సంపుటి: 37
సంచిక: 3

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

అక్టోబరు, 1983

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి

మీ ఉత్తరాలు

ఈ నెల అపనలో అజీజ్‌గారి 'విషవాయువు', రామలక్ష్మిగారి 'రాత్రి పగలు', చైతన్యగారి 'కాల్ గర్ల్' కథలు అద్భుతంగా వున్నాయి. 'సాగరలోయ' ఇంకా కొనసాగితే బాగుండేదనిపించింది. సప్లిమెంట్‌లో బొమ్మిడి అచ్చారావు, వసుంధరగారల నవల్లు ఆకట్టుకున్నాయి. కొత్త సీరియల్ కోసం ఎదురుచూస్తున్నాము.

—ఆర్. గంగాప్రతాప్‌కుమార్, పెంటాకలాన్.

ఈ నెల అపన మరియు సప్లిమెంట్‌లో అన్ని కథలు ఫెంటాస్టిక్‌గా వున్నాయి. వేలెత్తిచూపడానికి లోపాలు లేకుండా చక్కగా వ్రాసారు రచయితలు. 'సాగరలోయ' ఇంత త్వరగా అయిపోయినందుకు చింతిస్తున్నాము.

—యస్. శివానంద్, బెల్లంపల్లి.

సెప్టెంబరు నెల పత్రికలో విషవాయువు, సాక్షి, దుబాయ్ వ్యాపారుల కథలు చాల బాగున్నాయి. 'సాగరలోయ' ముగింపు చాల బావుంది. రాజేష్, అర్చనల కష్టాలను గట్టెక్కించినందుకు చాల థాంక్స్. 'స్కెలిటన్ గ్రూప్' నవల నిజంగా మనదేశంలో జరిగే అక్రమాలను బయటపెట్టింది. రచయిత్రి వసుంధరగారికి నా కృతజ్ఞతలు. —జె. వి. ఎస్. పుల్లయ్య శాస్త్రి, కర్నూలు.

'సాగరలోయ' సమాప్తం చూడగానే—నా వుత్సాహమంతా నిప్పుమీద నీళ్ళు చల్లినట్లు-చల్లారిపోయింది. ఇంతవరకు మంచి బిగువుగా, సస్పెన్స్‌గా నడిచింది. బొమ్మిడి అచ్చారావుగారికి నా అభినందనలు. కథనం నాకెంతో నచ్చింది.

—కోలపల్లి ఈశ్వరరావు, నెల్లూరు.

'ఈ వ్యవస్థ వర్ధిల్లాలి' కథ నేటి వ్యవస్థలో లొసుగులను బట్టబయలు చేసింది. విలేఖరులమీద ఇంత చక్కగా రాసిన ...నట్టులేవు. ఇటువంటి కథను ప్రచురించిన ఎడిటర్ ...దాలు. రచయిత వర్మగారికి నా అభినందనలు.

డి. రాజేశ్వరి, విజయవాడ.

ఈ నెలలో...

PARA ASHOK KUMAR

కథలు (మాస పత్రిక)

4. ఆ ఒక్కటీ అడక్కు—జొన్నలగడ్డ రామలక్ష్మి
25. రెండో బ్రీఫ్‌కేస్—పి. అరుణ
35. రుచిమరిగిన మృగాలు—యం. డి. చైతన్య
44. తిరుగాడిన శవం—కాశీభట్ల భానుమూర్తి
59. సంకల్ప బలం—వసుంధర
81. కసాయి కత్తి—యం. దుర్గావళి
131. సకల గుణాభిరాముడు—బి. రాజేశ్వరి
150. హంతకులకు హంతకుడు—కె. వి. రమణ
167. భజన బృందం—ప్రతాప రవిశంకర్
178. గుడ్డి దర్బారు (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. ముసలి మొగుళ్ళు—పడుచు పెళ్ళాలు—వసుంధర
46. కీర్తి కిరీటం—అజీజ్
121. నేరాలు శిక్షలు—టెంపోరావ్
158. పులివేట—బి. రాజేశ్వరి
190. విషసర్పాలు (సీరియల్)—సికిందర్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

ఆ ఒక్కటీ అడక్కు

జొన్నలగడ్డ రామలక్ష్మి

ఇంట్లో సుమిత్ర ఒక్కతే వున్నది. ఆమె ఏదో ఇంగ్లీషు నవల చదువుతున్నది. మధ్య మధ్య కనులు మూతపడుతున్నాయి. అలాగని నిద్ర పట్టడంలేదు. నిద్రపోవడం కోసం ఆమె చదువుతున్నది.

ఉన్నట్లుండి ఆమె నిద్రమత్తు విడిపోయింది.

గది గుమ్మానికి వేలాడుతున్న తెరకు అవతల ఎవరో

కదలాడినట్లయింది.

తను వీధి తలుపులు వేసింది. దొడ్డివైపు తలుపు కూడా వేసింది.

ఇంట్లో తను తప్ప యెవ్వరూలేరు. తల్లి, తండ్రి సినిమాకు వెళ్ళారు. ఓ తమ్ముడు జూవలాజికల్ టూర్లో వున్నాడు. రెండో తమ్ముడు ప్రైవేట్ క్లాసుకని వెళ్ళాడు. మూడో తమ్ముడు స్నేహితు డింటికని వెళ్ళాడు. ఇద్దరూ చెల్లెళ్ళూ మేనమామల ఇంట్లో వున్నారు.

తల్లి, తండ్రి సుమిత్రను కూడా సినిమాకు రమ్మన్నారు. కానీ ఆమెకు సినిమా చూడాలని లేదు. సినిమాకు వెడితే ఆమె మనసు ఏదోలాగైపోతుంది.

సుమిత్రకు ఇరవైనాలుగు నిండాయి. ఆమె బియ్యే ప్యాసయింది. ఉద్యోగం చేస్తోంది మూడేళ్ళ నుంచి. ప్రస్తుతం జీతం నెలకు ఆరువందల యాభై వస్తుంది.

ఆమె జీతాన్ని జీతం ఫళంగా బ్యాంకులో వేయాలనే ఉద్దేశ్యంతో తండ్రి ఆమెను ఉద్యోగంలో జేర్పించాడు. కానీ ఆయన అవసరాలందుకు సహకరించలేదు. ఇంట్లో పరిస్థితి చూసేక తన జీతం దాచుకోవడం అమానుషమని సుమిత్రకూ అనిపించింది. తన తల్లిని బలవంతపెట్టింది. మొహమాటపడుతూనే తల్లి ఒప్పుకుంది. ఆ తర్వాత నుంచి సుమిత్ర జీతం ఆలస్యమైతే యెలాగా అనే పరిస్థితి ఏర్పడింది.

సుమిత్ర తండ్రి ఎంతో బాధపడుతూండేవాడు. ఆయన సుమిత్రకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నాడు. కొన్ని మంచి సంబంధాలు వచ్చాయి. అయితే వచ్చిన వారందరూ కూడా సుమిత్ర ఎంత కాలం నుంచి ఉద్యోగం చేస్తున్నదో అప్పట్నించీ తమ ఇంటి మనిషైపోయినట్లు భావించి,ఆ సంపాద

నంతా కట్నం రూపంలో అడుగుతున్నారు. కట్నం అడగని వాళ్ళు లాంఛనా లడుగుతున్నారు ఆ లాంఛనా లడగడంలో ఏ మాత్రం సిగ్గుపడరు.

"నాకు నాలుగు రోజుల్నించి తిండిలేదు బాబయ్యా-మీ ఇంట్లో పెళ్ళవుతోంది. కాస్త కడుపు నిండా తిండి పెట్టిం చండి" అంటాడు బిచ్చగాడు.

"నాకు నలుగురాడ పిల్లలు. ఒక్కడే కొడుకు. వాళ్ళ ఆశలన్నీ ఈ పెళ్ళిమీదే పెట్టుకున్నారు. కాస్త వాళ్ళ అచ్చటా ముచ్చటా తీర్చండి" అంటాడు వియ్యంకుడు.

ఇద్దరికీ తేడా ఏమీలేదు. ఒకడు సిగ్గుపడతాడు. రెండో వాడు సిగ్గుపడడు.

తన కడుపున పుట్టిన పిల్లలకు ఎవరిచేతో ఏదో ఇప్పించా లనుకోవడం, గతిలేనివాళ్ళు చేసేపని. ఆ విషయం అర్థం చేసుకోగలవారు చాలా కొద్దిమంది!

సుమిత్రను పదిమంది దాకా వరులు చూపి వెళ్ళారు. మొదట్లో సుమిత్ర కలలు కనేది. తర్వాత రాయిలా మారి పోయింది. ఆపైన చూడ్డానికి వచ్చే వరులంటే అసహ్యం కూడా పెంచుకోసాగింది. ఇటీవల పెళ్ళి సంబంధాల పేరు చెబితేనే మండిపడుతున్నది.

సినిమాకు వెడితే ఆమెకు జంటలు కనబడతారు. ఒకరి నొకరిని పలకరించుకునే వారి కళ్ళు, ఒకరి చేతులొకరివి పట్టుకున్న వారి సాన్నిహిత్యం ఆమె మనసును ఏదోలా చేస్తాయి. అప్పుడామె తల్లిదండ్రుల్ని చూస్తుంద. వారిలోనూ కొన్ని జంటల లక్షణాలు కనబడతాయి. అప్పుడామె సిగ్గు పడుతుంది. అందుకే ఆమె సినిమాలకు వెళ్ళడం మాను కుంది. వెళ్ళినా తల్లిదండ్రులతో వెళ్ళదు.

ఇప్పుడు సుమిత్ర ఇంట్లో ఒంటరిగా వుంది.

తెరవెనుక యెవరో మనిషి మసులుతున్న అలికిడి....

"ఎవరది?" అంది సుమిత్ర.

అలా అన్నది కానీ ఆ అలికిడి తన భ్రమ కావచ్చునని ఆమె ఆశపడింది. కానీ ఆమె ఆశను నిరాశ చేస్తూ తెర కాస్త పక్కకు తప్పుకుంది.

ఒక యువకుడు గదిలో ప్రవేశించాడు.

అతణ్ణి చూస్తూనే సుమిత్ర ఉలిక్కిపడింది.

వయసెంతో చెప్పడం కష్టం కానీ ముప్పై దాటదు. మాసిన గెడ్డం. తీక్షణమైన కళ్ళు. చెదిరిన క్రాపు. చూడగానే కఠినాత్ముడనిపిస్తుంది. అతడి నడక కూడా అదోకలా వుండి నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నది.

సుమిత్ర చటుక్కున పైట సవరించుకుని మంచం దిగి చీర సర్దుకుంది.

అతడామె వంక రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు.

"ఎవర్నువ్వు?" అంది సుమిత్ర గట్టిగా.

"ఇష్....మాట్లాడకు...." అన్నాడతను.

"ఎవర్నువ్వు?" సుమిత్ర అరిచింది.

"కావాలంటే నెమ్మదిగా మాట్లాడు. అలా అరవకు" అన్నాడతను.

"నేను అరుస్తాను...." అన్నది సుమిత్ర.

"అరిస్తే చంపేస్తాను జాగ్రత్త!" అన్నాడా యువకుడు తాపీగా.

సుమిత్ర ఉలిక్కిపడింది. ఆమెకు నోటమాట రాలేదు.

"మంచం మీద బుద్ధిగా కూర్చో!" అన్నాడతను.

సుమిత్ర అప్రయత్నంగా మంచం మీద కూర్చుండిపోయింది.

పక్కనే వున్న బల్ల లాక్కున దానిమీద కూర్చున్నాడు.

2

"ఊఁ ఇప్పుడు నేనడిగినవాటికి వరుసగా సమాధానాలు చెప్పు" అన్నాడు.

సుమిత్ర అతడివంకే భయం భయంగా చూస్తోంది.

"ఇంట్లో ఎంత డబ్బుంది? నేనడిగేది క్యాష్ సంగతి.... అయిదు....పది వున్నా తీసుకుంటాన్నేను అబద్ధం చెబితే మాత్రం సహించలేను" అన్నాడతను.

"ఇంట్లో డబ్బేమీలేదు" అంది సుమిత్ర.

ఆ యువకుడు నవ్వి "ఏ ఇంట్లోనైనా మొదటి జవాబు యిదే!" అన్నాడు.

"నేను నిజం చెబుతున్నాను. డబ్బు పర్సులో ఉంటుంది. పర్సు నాన్నదగ్గర వుంటుంది. నాన్న, అమ్మ సినిమాకు వెళ్ళారు."

"వాళ్ళు సినిమాకు వెళ్ళారని నాకు తెలుసు" అన్నాడతను. "నేను నా పనులకు రోజు కో వీధిని యెన్నుకుంటాను. ఉదయం నుంచీ నాలుగైదు వేషాలలో ఆ వీధిలో తిరిగి ఓ యిల్లును ఎన్నుకుంటాను. సమయం చూసి ఆ యింట్లో జొరబడతాను. ఈ రోజు మీ వాళ్ళు మ్యాట్నీకి వెళ్ళడం చూశాను. ఈ పైముకి ముహూర్తం పెట్టాను."

"అన్ని తలుపులూ వేశాను. ఇంట్లోకెలా రాగలిగావు?" అన్నది సుమిత్ర.

"గోడ దూకి దొడ్లోకి వచ్చాను. కిటికీ ఊచలు వంచి యింట్లోకి ప్రవేశించాను. ఇది నాకు ఆఫ్ట్రాల్!" అని నవ్వాడతను.

"మా యింట్లో ఏమీలేదు. దయుంచి మరో యింటికి వెళ్ళు" అన్నది సుమిత్ర.

"దయ అన్న పదం మనిషన్నవాడు ఉచ్ఛరిస్తే నా రక్తం ఉడికిపోతుంది. నువ్వు నన్ను దయుంచి మరో యింటికి వెళ్ళమంటున్నావు-గతిలేక! ఏ మాత్రం అవకాశ మున్నా నువ్వు నన్ను నిర్దాక్షిణ్యంగా పోలీసులకు పట్టిస్తావు. అప్పుడు దయ అన్నపదం ఒకటుంటుందనే నీకు గుర్తుం డదు. అనవసరంగా ఆ పదం వాడి నన్ను రెచ్చగొట్టకు" అన్నాడా యువకుడు.

సుమిత్ర మాట్లాడలేదు. అతడు చెప్పిందాంట్లో నిజ ముంది మరి!

"నీ చేతిన మెరిసే ఆ గాజులు—మెడలోని ఆ గొలుసు అది చాలు నాకు....మర్యాదగా తీసిచ్చేయి...." అన్నాడా యువకుడు.

"నా చెవి రింగులు కూడా నీకు యిచ్చేస్తాను. అన్నీ గిల్టువి" అన్నది సుమిత్ర. ఈ సారి ఆమె నవ్వగలిగింది.

"నువ్వు నిజమే చెబుతున్నావు. లేకపోతే అంత హాయిగా నవ్వలేవు. మనుషుల నవ్వునుబట్టి నేను అబ ద్ధాల్ని అంచనా వేయగలను" అన్నాడా యువకుడు.

"మా యింట్లో నీకేమీ దొరకదు. వెళ్ళిపో" అన్నది సుమిత్ర.

"ఇంట్లో వెండికంచాలేమీ లేవా?" అన్నాడా యువకుడు.

సుమిత్ర వస్తున్న నవ్వాపుకుని "మా యింట్లో మొత్తం ఎనమండుగురం వున్నాం. స్టీలు కంచాలే నాలుగు కంటె కొనుక్కోలేకపోయాం. అంతా కలిపి భోంచేయాలంటే దొడ్లోని అరటి చెట్లే శరణ్యం" అంది.

"బీ సీరియస్!" అన్నాడతను—"నాతో ఇంత ఫ్రీగా మాట్లాడ్డం నాకు నచ్చదు. నేనంటే నువ్వు భయపడాలి."

"నిన్ను చూస్తే నాకు భయం కలగడంలేదే" అంది

సుమిత్ర.

"నువ్వు అలాగని అనుకుంటే నిన్ను భయపెట్టగలను" అంటూ ఆ యువకుడు తన జేబులోంచి ఏదో తీశాడు.

సుమిత్ర అటే చూస్తున్నది. అది ఒక జేబు రుమాలు. కాదు కాదు ఆ జేబురుమాలుకు ఏదో చుట్టబడి వుంది. ఎర్రరంగు జేబురుమాలు.

"ఈ జేబురుమాలుకి ఎర్రరంగు ఎందుకో తెలుసా? రక్తపు గుర్తులు దాచడానికి" అన్నాడతను.

"రక్తపు గుర్తులేమిటి?" అంది సుమిత్ర.

"హత్యచేస్తే రక్తపు గుర్తులు కావూ మరి!" అన్నాడతను.

సుమిత్ర మాట్లాడలేదు.

అతను జేబురుమాలు విప్పాడు. అందులో ఓ కత్తి వున్నది. అది రక్తసిక్తమై వున్నది. ఎటొచ్చీ దానికి అంటిన రక్తం బాగా గడ్డకట్టి వున్నది.

"నిన్న రాత్రి నుంచీ దీన్ని శుభ్రంచేసే అవకాశం రాలేదు" అన్నాడా యువకుడు. "నిన్న రాత్రి ఓ వ్యాపారస్థుడి యింట చొరబడ్డాను. అలికిడికి ఆయనకు మెలకువ వచ్చింది. అరవకు అని నేను హెచ్చరించినా వినలేదు. అరిచాడు. పొడచాను. పారిపోయాను. నాకు పైసా చిక్క లేదు. వాడు చచ్చాడో లేదో నాకు తెలియదు కానీ చావక పోతే మాత్రం మళ్ళీ వెళ్ళి పొడుస్తాను. యూస్‌లెస్ ఫెలో!"

సుమిత్రకు వళ్ళు జలదరించింది. తన యెదురుగా వున్న యువకుడు మామూలు దొంగకాదు. బరితెగించిన హంతకుడు!

"బాత్రూం చూపించు కత్తి శుభ్రం చేసుకోవాలి...."

సుమిత్ర అతడికి బాత్రూం చూపించింది. అతడా కత్తిని ఓపికగా శుభ్రంచేసి బాత్రూంలో వున్న తువ్వాలుతోనే తుడిచి మళ్ళీ జేబురుమాలుకు చుట్టి జేబులో పెట్టుకున్నాడు. సుమిత్ర వంక అదోలా చూస్తూ "జేబురుమాలు మార్చలేదని ఆశ్చర్యపడుతున్నావా? మరో ఎర్రరుమాలు కొని దీన్ని తగలబెడతాను. అసలు మీ యింట్లోంచే ఓ రుమాలు తీసుకునేవాణ్ణి కానీ ఎర్ర రుమాలు మీ యింట్లో దొరకదని నా అనుమానం" అన్నాడు.

సుమిత్ర మాట్లాడలేదు. ఆమెకు భయం పెరిగింది. మనసులో ఈ యువకుడినెలా వదిలించుకోవాలా అని చూస్తున్నదామె.

మళ్ళీ యిద్దరూ ఆ గదిలోకి వచ్చారు. సుమిత్ర మంచం మీద, అతడు బల్లమీద కూర్చున్నారు.

"ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేవా?" అనడిగాడతను.

ఆమె పెదవి కదపకుండా తల అడ్డంగా వూపింది

"బాగా ఆలోచించుకుని చెప్పు. నేనడిగే ప్రశ్న ఎంతో అర్థవంతమైనది. అది నీకు ఎంతో విలువైనది. సరైన జవాబు యివ్వకపోతే నువ్వు నీ జీవితానికి అర్థాన్నీ, విలువనూ కోల్పోవచ్చు. అందుకే బాగా ఆలోచించుకుని మరీ చెప్పు" అన్నాడతను.

సుమిత్ర కళ్ళలో భయాన్నతడు స్పష్టంగా చూశాడు. ఆమె తల అడ్డంగా ఊపబోయింది. ఆగిపోయింది. ఏదో చెప్పబోయింది. కానీ చెప్పలేదు.

"త్వరగా మాట్లాడాలి. నాకు కాలం చాలా విలువైనది" అన్నాడతను.

"నిజంగా యింట్లో ఏమీలేవు" అన్నదామె.

"ఇది చాలా దారుణం" అన్నాడతను.

"నీ దురదృష్టం కూడా....ఎప్పుడూ ఇలాంటి మధ్య తరగతి యిళ్ళను దొంగతనానికి ఎన్నుకోకు" అన్నదామె.

ఆ యువకుడు నవ్వి "నీకు పెళ్ళయిందా?" అన్నాడు.

ఆమె తల అడ్డంగా వూపింది.

"నీ దురదృష్టం" అన్నాడతను.

ఆమె ప్రశ్నార్థకంగా అతడివంక చూసింది.

౩

"పెళ్ళయితే కనీసం నీ మెడలో మంగళ సూత్రా లుండేవి. అవైనా తీసుకుని వెళ్ళిపోయి వుండేవాణ్ణి. అడుగు పెట్టిన యింట్లో ఏదో ఒకటి తీసుకోకుండా వెళ్ళడం అల వాటులేదు. అందువల్ల...." అతడు ఆగాడు.

"అందువల్ల...." అన్నదామె అప్రయత్నంగా.

"మనం కాసేపు సరదాగా...."

"యూ బ్రూట్...." అన్నదామె.

"అంతకంటే ఎక్కువగా తిట్టగలను" అన్నాడతను.

"లేకపోతే నువ్వనేదేమిటి?" అన్నదామె.

"నీ విలువ నాకు తెలుసు. నీ నుంచి విలువైనది తీసుకో గలనని నా మనసు చెబుతోంది. నేను ప్రయత్నిస్తాను. నువ్వు సహకరించాలి—" అన్నాడతను.

"అంటే?" అన్నది సుమిత్ర.

"అంటే అర్థం తెలియని పసిపాపవు కాదు నీవు?" అన్నాడతను.

"నాకు అర్థంకాలేదు—" అన్నది సుమిత్ర.

"నాలోని పురుషుడు నీలోని స్త్రీని గుర్తించి కోరు తున్నాడు—"

అతడంత సూటిగా చెప్పేసరికి సుమిత్ర తడబడి

పోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏదో చెప్పా లనుకుంటే గొంతు పెగలలేదు.

"సహకరిస్తావు కదూ—" అన్నాడతను.

ఆమె తల అడ్డంగా ఊపింది.

అతడు జేబురుమాలును విప్పి కత్తిని బయటకు తీసి—"దీన్ని శుభ్రంగా యెందుకు కడిగానో తెలుసా?" అన్నాడు.

ఆమె అతడి మాటలు వినలేదు. కత్తిని చూసి భయ పడింది.

"నీ రక్తం ఈ కత్తిమీద ఎండాలి తప్పితే ఎండిన రక్తం నీ వంట్లో ప్రవేశించకూడదని!" అంటూ అదోలా నవ్వాడతను.

"అంటే?"

"నా ప్రయత్నానికి నువ్వు సహకరించడంకోసం దీన్ని వుపయోగిస్తాను—" అన్నాడతను.

"ఆడది కత్తికి లొంగుతుందని నీ అభిప్రాయమా?" అన్నదామె. ఆ గొంతులో భయం వుంది. ఆ గొంతును పలికించిన శరీరం వణుకుతోంది.

"ఆడదాని గురించి నా అభిప్రాయం చెప్పమంటావా?"

ఆమె తల ఊపింది. అతణ్ణి మాట్లాడనివ్వడం మంచిది. తనకు టైము కుదురుతుంది. ఈలోగా యేదో వుపాయం పన్నాలి.

"ఆడదాని గురించి చరిత్ర భయంకరంగా రాస్తుంది. ఓ ద్రౌపది, ఓ క్లియోపాత్రా—రాజాధిరాజుల పతనాలకు కారణమయ్యారంటారు. అయితే నేనందుకు మూలకారణం వెదుకుతాను. ఆడదాని కారణంగా దారుణమైన యుద్ధాలు జరుగవచ్చును. కానీ ఆడవాళ్ళు చేయరు. వారి కారణంగా

మగావాళ్ళు దెబ్బలాడుకుంటారు. ఎందుకని! ప్రపంచంలో ఎంతటి కరుకుగుండె రాక్షసుడికైనా మనశ్శాంతి నివ్వ గలిగింది ఆడది మాత్రమే! పురుషుడికి ఆడది దేవుడిచ్చిన వరం. ప్రకృతి సృష్టించిన ఉపశాంతి. అందుకే మగవాడు ఒక్క ఆడదానికోసం ఈ ప్రపంచాన్నే నాశనం చేయాలను కుంటాడు........" అతను క్షణం ఆగాడు.

సుమిత్ర ఆసక్తిని నటిస్తున్నది. అతడికి ఆడవారిమీద సదభిప్రాయం వుండడం ఆమెకు రవంత ఆశను కలిగించింది. ప్రతిమనిషిలోనూ ఏదో బలహీనత వుంటుంది. ఇతడిలో యేదో బలహీనత వున్నదనిపిస్తోంది. అది పట్టాలి తను. ఆమె మెదడు సునిశితంగా పనిచేస్తోంది.

"నిన్నరాత్రి నేను హత్యగానీ, హత్యాప్రయత్నంగానీ చేశాను. ఇది నాకు ప్రథమం కాదు. ఇప్పటికి నాలుగు హత్యాప్రయత్నాలూ, రెండు హత్యలూ చేశాను. కానీ హత్య చేసినప్పుడల్లా నా మనసు పాడవుతుంది. నా మనసుకు ఉపశాంతి లభించేది స్త్రీ నుంచి మాత్రమే! అందుకే ఈ రోజు వుదయం మీ యింటి గుమ్మంముందు నిలబడ్డ బిచ్చగాడికి బిచ్చం వేస్తున్న నిన్ను చూసి—నాకు ఉపశాంతి కలిగించగలిగింది నీవేనని నిర్ణయించుకున్నాను— నీ కోసమే యీ యింట్లో ప్రవేశించాను—...." అన్నాడతను.

"నువ్వు నాకోసం వచ్చేవా?" అన్నది సుమిత్ర.

"అవును—నీ కోసమే!"

"అబద్ధం—నా కోసమే అయితే ముందు డబ్బుగురించి ఎందుకు అడిగావు?" అన్నది సుమిత్ర.

అతడు నవ్వి—"రాగానే నేను నీ మీద పడితే నీకు భయం వేస్తుంది. నన్ను రాక్షసుడిలా చూస్తావు. ముందు

మన మధ్య కొంత అవగాహన ఏర్పడాలి. అందుకే కాసేపు అవీయివీ మాట్లాడాను....నా గురించి నువ్వు కొంత తెలుసుకొనడం మంచిదనిపించింది. అందుకే అన్నీ నిజాలే చెప్పాను...." అన్నాడు.

"ఏడిపినట్లుంది—" అనుకుంది సుమిత్ర. అతడికి తనతో అవగాహన కావాలిట. తనను హత్య చేస్తానంటున్నాడు. కత్తి చూపి బెదిరిస్తున్నాడు. లొంగకపోతే చంపేస్తా నంటున్నాడు. ఇదే రకం అవగాహన. తనేం మాట్లాడుతున్నాడో అతడికి తెలుసా?

"వింటున్నావా?" అన్నాడతను.

"వింటున్నాను. నీకు ఆడదానినుంచి వుపశాంతి కలిగే మాటైతే హత్య చేసినప్పుడల్లా ఏ లాడ్జికో పోవచ్చుగా.... నువ్వు కోరేది నీకు అటువంటి చోటే లభిస్తుంది...."

అతడు నవ్వాడు. ఆమె సమాధానం విని వెటకారంగా నవ్విన నవ్వు అది.

కాసేపు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం.

సుమిత్రకు క్షణాలు భారంగా గడుస్తున్నాయి. అతడి వుద్దేశ్యమేమిటి? ఇప్పుడేం చేస్తాడు? తనను బలవంతం చేస్తాడా?

"నువ్వు మాట్లాడడంలేదు...." అన్నాడతను.

"ఏం మాట్లాడను?" అన్నదామె.

"నీ అంగీకారం తెలపాలి...."

"దేనికి?"

"కాసేపు మనం కలిసి ఆనందించడానికి...."

"అది అసాధ్యం...."

"అసాధ్యాన్ని సాధ్యం చేయగలను...."

సుమిత్ర నిర్లక్ష్యంగా నవ్వింది.

"నేను నిన్ను బలవంతం చేస్తాను—...." అన్నాడతను.

"నేను బలంగా ప్రతిఘటిస్తాను...." అన్నదామె.

"నీ కంటే నేను బలవంతుణ్ణి...."

ఆమె నవ్వి—"నా బలం యెక్కువయితే నువ్వు పట్టుబడతావు. నీ బలం ఎక్కువయితే నేను చస్తాను. నేను చావనయినా చస్తాను గానీ నీకు లొంగను—...." అన్నది.

అతడు కొద్ది క్షణాలు ఆమె వంకే చూస్తూ వుండిపోయాడు.

"దయుంచి ఇక్కణ్నుంచి వెళ్ళిపో!" అన్నదామె.

"దయ—ఆ పదం వాడవద్దని ఇప్పుడే అన్నాను. కానీ నువ్వు వినలేదు...." అంటూ అతడు కోపంగా ఆమెను సమీపించి నోరు గట్టిగా మూశాడు.

సుమిత్ర ఇది ఊహించలేదు. కొద్దిక్షణాలు ఆమె నిశ్చేష్టురాలైంది. ఆ కొద్ది క్షణాలలోనూ ఆమె నోట్లోగుడ్డలు కుక్కబడ్డాయి. చేతులు వెనక్కు విరిచి కట్టబడ్డాయి.

"కూర్చో!" అన్నాడతను.

ఆమె మంచంమీద కూర్చుంది.

అతడు చొక్కాజేబులోంచి ఓ ఉేపు తీసి—నోట్లోంచి గుడ్డలు తీసి ఆ ఉేపువేసి—"అమ్మాయిలను ఇలా అనుభవించడం నాకు కొత్తకాదు...." అన్నాడు.

సుమిత్ర కళ్ళలో భయం! ఆమె గడియారం వంక చూసింది. తల్లి తండ్రి రావటానికి యింకా ఆలస్యమున్నది.

ఇప్పుడు తననెవరు రక్షిస్తారు?

సుమిత్ర కనుల నుంచి నీరు ధారగా రావడం మొద

లయింది.

"ఏడవకు...." అన్నాడతడు.

"నీవు నాతో సహకరిస్తే అంతా మంచిగా జరిగి పోతుంది. లేదూ—క్రూరంగా హింపిస్తాను...." అన్నాడతను.

ఆమె అతడివంకే చూస్తున్నది.

అతడామెను సమీపించి ఆమె చీరకొంగుతోనే ఆమె కనులు తుడిచి—"బజారు మనుషులవద్దకు వెళ్ళమని నువ్వు సలహా యిచ్చావు. నేను డబ్బుతో వుపశాంతిని పొందదల్చుకోలేదు—" అన్నాడు.

ఆమె మాట్లాడకుండా అతడివంకే చూస్తున్నది. వాటం చూస్తే అతడు మళ్ళీ ఏదో చెప్పబోయేలాగున్నాడు. అతడికా అవకాశం యివ్వడమే మంచిది.

"డబ్బు...." అని నవ్వాడతను...."డబ్బుకోసం నేను పడ్డ అవస్థ యింతా అంతా కాదు. నీకు తెలుసో తెలియదో....నేను బియ్యే ప్యాసయ్యాను. కానీ ఎక్కడా చిన్న వుద్యోగం కూడా దొరకలేదు. అవసరం కోసం అహం చంపుకుని కూలిపని చేశాను. అప్పుడే నేను కొందరు ధనవంతుల అన్యాయాలనూ, అక్రమాలను గ్రహించగలిగాను. అన్యాయంగా జీవిస్తున్నవాడు సుఖపడడమే కాకుండా పదిమందిచేత గౌరవం పొందుతున్నాడు. అప్పుడే నా ఆలోచన మారిపోయింది. సాటిమనిషి ప్రాణాలు రక్షించమని దీనంగా అర్థిస్తే పదిమందీ నానా మాటలూ అంటారు. అవహేళన చేస్తారు. అదే పదిమందీ లేనప్పుడు ఒక్కణ్ణి పట్టి చెయ్యెత్తి అడిగితే—ఆ ఎత్తిన చేతిలో కత్తి వుంటే కాళ్ళు పట్టుకుని మరీ అడిగినదిస్తాడు.

అందుకే నేను అటువంటి జీవితాన్నాశ్రయించాను. అందుకు నావాళ్ళు నన్ను అసహ్యించుకుని వదిలిపెట్టేశారు. తామెవ్వరికీ మళ్ళీ నా ముఖం చూపవద్దన్నారు. వాళ్ళకు రోజులు భారంగా గడుస్తున్నవని నాకు తెలుసు. అయినప్పటికీ వాళ్ళు సమాజ న్యాయాలకు బానిసలు. నేను వాళ్ళకు డబ్బుతో వుపకారం చేయలేను. కనీసం నా ఒక్కడి బాధ్యత వాళ్ళకు తప్పించాలని వాళ్ళకు దూరంగా వచ్చేశాను. నేను చెడ్డవాణ్ణి కాదు. చెడ్డవాళ్ళకు మాత్రమే చెడ్డవాణ్ణి. కానీ సమాజం నన్ను వేటాడుతోంది. అడవిలోని లేడిలా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బ్రతుకుతున్నాను. అప్పుడప్పుడు నేను సేదతీర్చుకోవాలి. నాకు సేద లభించేది నీవంటి ఆడవాళ్ళ ఒడిలోనే। అందుకే కాదనవద్దు అంటున్నాను...."

సుమిత్ర యేదో చెప్పాలనుకుంది. కానీ నోటికి అంటించి వున్న టేపు అడ్డం వచ్చింది. అతడది గ్రహించి—"అరవడానికి ప్రయత్నిస్తే ఏ క్షణంలోనయినా నీ నోరు మూయగలనని యిప్పటికి గ్రహించి వుంటావు. ఆ టేపు తీసేస్తాను. అరవడానికి ప్రయత్నించకు—" అంటూ అతడామెను సమీపించాడు.

సుమిత్ర పెదవులు విడివడినాయి. ఆమె అతడివంక చూస్తూ—"నీ కథ నాకు జాలి కలిగించదు. నీలో వుండే క్రౌర్యానికి అసహాయత, అవసరం అన్న పేర్లు పెట్టి కొందర్ని హింసించి జీవిస్తున్నావు. నిన్నే ఆడదీ లాలించలేదు—" అన్నది.

"ఆడదాని గురించి నీ కంటే నాకు బాగా తెలుసు—" అన్నాడతను. "ఆడదాని హృదయంలో దయ వుంటుంది. ఈ సమాజపు కట్టుబాట్లకు భయపడ్డంవల్ల తప్పితే ఆడది

యే పురుషుణ్ణీ కాదనలేదు. మన పొందు రహస్యంగా వుండిపోతుంది — కాసేపు .... కొద్ది క్షణాలు నన్ను ప్రేమించు. ఆ తర్వాత యిద్దరం స్నేహితులుగా విడి పోదాం ..."

"నీతో స్నేహమా? నిన్ను ప్రేమించడమా?" అన్నది సుమిత్ర తిరస్కారంగా.

అతడికి కోపం వచ్చింది—"చూడు—నేను రెండు హత్యలు చేశానన్నాను—అందులో ఒకామె స్త్రీ. నన్ను కాదంది. చచ్చింది—...."

"సరే—నువ్వు మూడో హత్య చేద్దువుగాని...."

అతడు వికటంగా నవ్వాడు. మళ్ళీ ఆమె మూతికి టేప్ వేశాడు.

"నేనంత తేలికగా హత్యకు పాల్పడను. చూడు నిన్నెలా ఒప్పిస్తానో...." అంటూ అతడామె వంటిమీంచి చీరను ఊడబెరికాడు.

"చూడు నిన్ను బలవంతం చేయాలనే ఉద్దేశ్యంలో నేనిది లాగలేదు. ఇప్పుడు నేనేం చేస్తానో తెలుసా?" అంటూ అతడు తన చొక్కాను కాస్త పైకి ఎత్తాడు.

ఆమె అతడివంకే చూస్తున్నది. తిరిగి ఆమెను భయం ఆవహించింది. అతడి మాటలు విని మాటలతో అతణ్ణి మరిపించవచ్చుననుకుంది. జయించవచ్చుననుకుంది. కానీ అది సాధ్యపడేలాలేదు. ఇప్పుడెలా?

అతడు పాంటుకున్న బెల్టు విప్పాడు. అది మూడంగుళాల వెడల్పున వున్నది. పొడవుగా వున్నది. అతడా బెల్టును గాలిలోకి లేపుతూ "కొట్టవద్దు అని బుర్ర అడ్డంగా మూడుసార్లు ఊపు. అలా అయితే నువ్వు నాకు సహకరిస్తావని అర్థం చేసుకుంటాను. లేదా అలా తల ఊపేదాకా

బెల్టు పనిచేస్తూనే వుంటుంది" అన్నాడు.

సుమిత్ర ఏమీ మాట్లాడలేదు. అతడు నిజంగా తన్ను కొడతాడా?

"నీ వంటికి బాగా దెబ్బలు తగలాలనే చీర అడ్డు తొలగించాను" అంటూ అతడు వరుసగా మూడంకెలు లెక్కపెట్టి చెళ్ళుమనిపించాడు బెల్టు.

సుమిత్రకు వీపు అదిరిపోయింది. కళ్ళనుండి నీరు ఉప్పెనలా ప్రవహించింది. నోటికి ప్లాస్టరు లేకపోతే పెద్దగా అరిచి వుండేది. సన్నగా మూలిగిందామె.

"బాగుందా?" అంటూ అతడు మళ్ళీ బెల్టు గాలిలోకి లేపాడు.

సుమిత్ర వెంటనే కంగారుగా తల అడ్డంగా ఊపింది. మూడుసార్లైనా ఆమె ఆపలేదు. అతడే ఆమె తల పట్టుకుని ఆపి—నోటికి ప్లాస్టరు తీశాడు.

"దుర్మార్గుడా!" అన్నదామె.

"నేను నీనుంచి కోరేది ఆ పిలుపుకాదు" అన్నాడతను.

సుమిత్ర మాట్లాడలేదు.

"అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు. ఆడది నా మాట వినకపోతే హింసించి మరీ చంపుతాను. నా హింసలో అతి తేలికైన భాగం బెల్టుతో కొట్టడం. అర్థమయిందా?" అన్నాడతను.

"నేనేం చేయాలి?" అన్నది సుమిత్ర.

"నీ చేతులకు కట్లు విప్పుతాను. నన్ను లాలించాలి" అన్నాడతను.

"ఎలా?"

"అనుభవం లేదా?"

"లేదు" అన్నది సుమిత్ర.

"ఓహో—నువ్వు అవివాహితురాలివికదా" అని నవ్వాడతను "అయితే నువ్వు నీ తలిదండ్రుల నెప్పుడూ గమనించలేదా? నీ తల్లి నీ తండ్రి అవసరాల నేవిధంగా గుర్తుంచుకుంటుంది? ఆఫీసునుంచి ఇంటికి రాగానే ఆమె ఏం చేస్తుంది?... గుర్తు తెచ్చుకో....నామీద ప్రయోగించు"

సుమిత్ర తలాడించింది.

అతడామె చేతి బంధనాలు తొలగించి కాస్త దూరంగా వెళ్ళాడు. ఆమె అతడిని సమీపించి ఒక్క-క్షణం తటపటాయించి రెండు చేతులతోటీ ముఖం కప్పుకుని ఏడ్వసాగింది.

"ఏమిటీ—మీ నాన్నవద్ద మీఅమ్మ ఇలా ప్రవర్తిస్తుందా" అన్నాడతను ఆశ్చర్యంగా.

అంత దుఃఖంలోనూ ఆమెకు నవ్వొచ్చింది "నువ్వంటే నాకు ప్రేమ కలగడంలేదు. నిన్ను తాకాలంటేనే నా వళ్ళు జలదరిస్తోంది జుగుప్సతో! కానీ నీ హింసలు నేను భరించలేను. అలాగని నటించలేను...."

"ముందు నటన ప్రారంభించు. కాసేపు ఒకరికొకరు దగ్గరగా వుంటే ప్రేమ అదే పుట్టుకొస్తుంది" అన్నాడతను.

ఆమె అతడికి మరికాస్త దగ్గరగా జరిగి "ఊహూ — నావల్ల కాదు" అని క్రింద కూలబడి ఏడ్వసాగింది.

4

"అయితే ఇంక ఆఖరి అస్త్రం ఉపయోగించక తప్పదు" అంటూ తనలో తను గొణుక్కున్నాడతను. అంతవరకూ బల్లమీద వున్న కత్తిని తీసుకుని ఆమెను సమీపించాడు. ఆమె తల ఎత్తి తళతళ మెరుస్తూన్న అతడి చేతిలోని కత్తిని చూసింది.

అతడా కత్తిని ఆమె ముందుంచి—"ఇది తీసుకో —

దీన్నుపయోగించి నిన్ను నువ్వు రక్షించుకో. నేను నిన్ను వదలను. కానీ నీ చేతిలోని ఆ కత్తినిమాత్రం లాక్కోను. బలవంతంగా నిన్ను అనుభవించడానికి ప్రయత్నిస్తాను. ఇష్టం లేని ఆడదాన్ని అనుభవించినందుకు నీకు చేతనైన శిక్ష నువ్వు నాకు విధించు. నీ కత్తి నా చేతుల్ని నరకవచ్చు. గుండెల్లో దిగవచ్చు. కానీ నేను మాత్రం ఇక్కణించి నిన్ను అనుభవించకుండా వెళ్ళను. నా ప్రాణాలు పోయినా సరే!" అన్నాడు.

ఆమె చటుక్కున కత్తి తీసుకుంది.

చేతిలో కత్తి....ఎదురుగా అతడు....

"ఇలాంటి అవకాశం గతంలో ఓ స్త్రీకి ఇచ్చాను. ఆమె నాకు ఒక్క గాయంకూడా తగులనివ్వకుండా లొంగిపోయింది. నువ్వేం చేస్తావో నీ యిష్టం. నాకు మాత్రం నువ్వు కావాలి...."

ఆమె అతడి మాటలు వింటోంది. అతడామెను సమీపిస్తున్నాడు నెమ్మదిగా....

ఆమె చటుక్కున తన చేతిలోని కత్తిని క్రిందపడవేసి "ఒక్క క్షణం మనమిద్దరం మనసు విప్పి మాట్లాడుకుందాం" అన్నది.

"వెరీగుడ్!" అన్నాడతను సంతోషంగా.

"నీకు మళ్ళీ సమాజంచేత వేటాడబడని జీవితం రప్పిస్తాను. ఈ జీవితాన్ని వదిలిపెడతావా?" అన్నది సుమిత్ర.

"అంటే?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"నీకుద్యోగం దొరకలేదనేగా ఇలా తయారయ్యావు. నా కుద్యోగం వుంది. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అని ఒక్కక్షణం ఆగి "ఒకే ఒక్క షరతుమీద" అన్న

దామె.

"ఏమిటది?" అన్నాడతను. అసలామె తనను పెళ్ళి చేసుకుంటానంటేనే ఆశ్చర్యపడ్డాడతను.

"నువ్వు నన్ను కట్నం అడక్కూడదు" అన్నదామె.

"ఏమిటీ?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"నీ కులమేమిటీ అని అడగను. నీ గత చరిత్ర ఏమిటీ అని అడగను. జీవితంలో నువ్వు నన్ను సుఖపెడతావా అని అడగను. నీ పాత జీవితం మరిచి కొత్త జీవితం గడుపుతానన్న హామీ కూడా అడగను. కట్నం లేకుండా నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అంది సుమిత్ర.

అతడామె వంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

ఆమె కళ్ళు....వాటిలో భయాన్ని ప్రతిఫలింపజేశాడు తను.

ఆమె పెదవులు....తానంటించిన చేపు ఛాయలు ఇంకా కనబడుతున్నాయక్కడ.

ఆమె శరీరం ...తన బెల్టు దెబ్బకు కమిలి వున్నది ఒక చోట.

తను క్రూరంగా, మొరటుగా ఊడపెరికిన చీర ఆమె శరీరానికి దూరంగా అలా పడి వుంది....ఆమె తనను పెళ్ళాడతానంటుంది....కట్నం అడక్కపోతే....

అంటే కట్నం అడిగేవాడు ఆమె దృష్టిలో తనకంటె ఎన్నో రెట్లు.....

ఆమె ఈ విషయమై ఎలాంటి మానసిక క్షోభ అనుభవించిందో!

అతడి హృదయం ద్రవించింది. అతడు కూలబడి కొన్ని క్షణాలు గట్టిగా రోదించాడు. ఆమె అతణ్ని అలాగే చూస్తూ నిలబడి వున్నది. తన వంటికి చీర చుట్టబెట్టుకోవా

లన్న ధ్యాసకూడా ఆమెకు కలగలేదు.

అతడు లేచి నిలబడి వున్నాడు. ఎర్ర జేబురుమాలుతో కళ్ళు తుడుచుకుని "నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానోలేదో తెలియదు. నిన్ను కట్నం అడిగినవాళ్ళ అడ్రసులు చెప్పు. ఒక్కొక్కణ్ణి వెతికి వెతికి పరశురాముడిలా నరికి పారేస్తాను" అన్నాడు.

ఆమె అతడికి అడ్రసులిచ్చిందా?

అతడామెను వివాహం చేసుకున్నాడా?

ఇది తెలుసుకోవడం కోసం ఈ కథ వ్రాయబడలేదు. అందుకని అది నేను చెప్పదల్చుకోలేదు. □



రెండో బ్రీఫ్‌కేస్

పి. అరుణ

"నువ్వు నిరుద్యోగివా" అడిగాడతను.

అతనెవరో నాకు తెలీదు. అతడిని ఇంతకు ముందు ఎప్పుడూ చూపిన గుర్తుకూడా నాకు లేదు.

"ఎవరు మీరు?" అడిగాను.

"నేనెవరో తర్వాత చెబుతాను. ముందు నువ్వు చెప్పు.

నువ్వు నిరుద్యోగివి కదూ."

నల్లగా వున్నాడు. ఖరీదైన దుస్తులు వేసుకున్నాడు. పైకి దువ్విన క్రాపు .... కళ్ళు చిన్నవిగా వున్నాయి. పాయింటెడ్ బూట్లు వేసుకున్నాడు. చేతికి వెడల్పాటి విదేశీ గడియారం.

అతను ఖరీదైన మనిషిగా కనిపించాడు. అందువల్లనే అతను నన్ను మర్యాదగా పిలవకపోయినా అతనితో నేను గౌరవంగా మాట్లాడాను.

"నిజమే. నేను నిరుద్యోగిని. మీ కెలా తెలుసు?"

కొంచెం ఆశ్చర్యంగా అడిగాను.

"నిరుద్యోగులను నేను సులభంగా గుర్తుపట్టగలను. ఎందుకంటే కొన్నాళ్ళ క్రితం నేనుకూడా నిరుద్యోగినే."

అదోలా నవ్వాడతను.

తర్వాత సిగరెట్టు ప్యాకెట్టు బయటకు తీసి తనో సిగరెట్టు వెలిగించుకుని నాకో సిగరెట్టు ఇచ్చాడు.

తర్వాత అతను సముద్రంవైపు చూస్తూ "ఎంతవరకు చదువుకున్నావ్?" అన్నాడు పొగ బయటకు వదిలి.

"బియ్యే పాసైనాను. టైప్ చెయ్యటం వచ్చు."

"గుడ్. నీకు మంచి భవిష్యత్తు కావాలా?"

అతడిని మళ్ళీ ఆశ్చర్యంగా చూశాను.

ఎవరితను? ఎందుకు నన్నిలా అడుగుతున్నాడు? నాకేదైనా ఉద్యోగం ఇప్పించగలడా?

ఆశ కలిగింది. ఎందుకంటే బియ్యే పూర్తయి మూడేళ్లు గడిచినా ఇంతవరకు యెటువంటి ఉద్యోగం దొరకలేదు. నా తల్లి వంటలు చేసి సంపాదిస్తూ ముసలివయసులో కూడా నన్ను పోషిస్తోంది. ఇన్నేళ్ళు వచ్చినా ఆమె సంపాదనతో బతకటం నాకు సిగ్గును కలిగిస్తోంది.

ఈ దేశంలో బిచ్చగాళ్ళ కంటే నిరుద్యోగులే ఎక్కువ. ఒక్కసారి చుట్టూ చూశాను. సముద్రం ఒడ్డున చాలామంది అక్కడక్కడ కూర్చుని కొంతమంది యువకులు ఏదో ఆలోచిస్తున్నారు. వీళ్ళలో ఎంతమంది నిరుద్యోగులున్నారో అనుకున్నాను.

"ఏమిటో ఆలోచిస్తున్నావు?" అడిగాడతను.

"నాకు లేని ఉద్యోగం గురించి."

"ఇక నువ్వు ఉద్యోగం గురించి ఆలోచించవలసిన అవసరం లేదు" అన్నాడతను సిగరెట్టు ముక్కను దూరంగా ఇసుకమీదికి విసురుతూ.

"అంటే?"

"నువ్వు ఇష్టపడితే నేను నీకు ఓ ఉద్యోగం ఇప్పిస్తాను"

"ఉద్యోగమా?" నమ్మలేనట్టు అడిగాను.

"అవును."

సంతోషం కలిగింది. ఈ రోజుల్లో పిల్చి అమ్మాయి నిచ్చి పెళ్ళి చేస్తానంటే అంతగా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. కాని ఇతనెవరో నా దగ్గరకు వచ్చి ఉద్యోగం ఇస్తానంటున్నాడు.

"ఏం ఉద్యోగం?"

"ఏదో ఒక ఉద్యోగం. నెలకు వెయ్యి రూపాయల జీతం."

"వెయ్యి రూపాయలా!" నాకేమీ అర్థం కావటంలేదు.

"అవును. మొదట్లో వెయ్యి రూపాయలు. తర్వాత నీ సామర్థ్యాన్ని బట్టి నీ జీతం పెంచబడుతుంది. ఐదు నెలల్లో రెండు వేల వరకూ పెరుగుతుంది."

అతడి మాటలు వింటుంటే నాకు ఏదో మరో లోకంలో వున్నట్టు అనిపించింది.

"అంతా కలగా వుంది కదూ" అతనన్నాడు.

"అవును. రూపాయి సంపాదించలేని వాడికి ఒక్కసారిగా వెయ్యి రూపాయల ఉద్యోగం అంటే కలగానే వున్నది. ఇంతకీ నేను చెయ్యవలసిన పనేమిటో చెప్పలేదు" అన్నాను.

"చాలా సులభమైన పని. నేను నీకో బ్రీఫ్ కేసు ఇస్తాను. దానితోపాటు ఆ బ్రీఫ్ కేసును ఎవరికి ఎలా అందజేయవలసిందీ చెబుతాను. దాన్ని నువ్వు ఆ ఎడ్రసులో వున్న మనిషికి అందజేయాలి. అదే నువ్వు చెయ్యవలసిన పని."

"ఆ బ్రీఫ్ కేసులో ఏముంటాయి. వజ్రాలా?" సీరియస్‌గా అడిగాను.

"వజ్రాలుంటాయో వడియాలుంటాయో నీకు అనవసరం."

"నాకు తెలియనప్పుడు వెయ్యి రూపాయలకు ఆశపడి ఈ ఉద్యోగం నేను చెయ్యలేను. ఇందులో ప్రమాదం వుంటే?"

నవ్వేడతను.

"నువ్వింత పిరికివాడివని నేను అనుకోలేదు. డబ్బు సంపాదించటమే మగాడి లక్షణం. నువ్వు హత్యలు చెయ్యటం లేదు. దొంగతనం చెయ్యటం లేదు. ఇందులో ప్రమాదం లేదు. తెలివి తక్కువగా వెయ్యి రూపాయల ఉద్యోగం వదులుకోకు" అని హెచ్చరించాడు అతను.

కొంచెంసేపు ఆలోచించాను.

అతను చెప్పిన మాటలు నిజమే అనిపించాయి. డబ్బు సంపాదించటమే మగాడి వుద్యోగం. తెలిసి నేను ఏ పాపమూ చెయ్యడంలేదు. ఆ బ్రీఫ్ కేసులో పళ్ళపొడి

ప్యాకెట్లు వున్నాయనుకుని ఆ పని చేస్తాను. అయినా యిందులో నాకేమీ రిస్కు కనిపించలేదు. పైగా నెలకు వెయ్యి రూపాయల ఉద్యోగం వదులుకోవటం నిజంగా తెలివిలేని పనే.

"ఒప్పుకున్నట్లేనా?" అడిగాడు మళ్ళీ ఓ సిగరెట్టు వెలిగిస్తూ.

తల వూపాను.

"వెరీగుడ్....అయితే ఒక్కమాట. ఈ వుద్యోగంలో నమ్మకం చాలా ముఖ్యం. నువ్వు ఏదో విధంగా మోసం చెయ్యటానికి ప్రయత్నిస్తే అందుకు తగిన శిక్ష అనుభ వించవలసి వుంటుంది. అందుక్కూడా నువ్వు సిద్ధంగా వుండాలి."

మళ్ళీ తలాండిచాను.

తర్వాత "నాకో అనుమానం" అన్నాను.

"ఏమిటో అడుగు."

"మీరు నా కిచ్చిన బ్రీఫ్‌కేసును నేను మా యింటికి తీసుకెళ్ళి తెరిచి చూశాననుకోండి. ఆ విషయం మీకు తెలి యదు కదా."

అతను పెద్దగా నవ్వి "నేనంత తెలివితక్కువ వాడిని కాదు. ఆ బ్రీఫ్‌కేసును తెరవటం యెవరికీ సాధ్యంకాదు. అది ప్రత్యేకంగా తయారుచెయ్యబడిన బ్రీఫ్‌కేసు. అటు వంటివి రెండే రెండు బ్రీఫ్‌కేసు లున్నాయి. వాటికి ప్రత్యేక మైన తాళంచెవులున్నాయి. ఆ తాళం చెవులు నువ్వు ఎవరి కయితే ఆ బ్రీఫ్‌కేసును అందిస్తావో వాళ్ళ దగ్గరే వుంటాయి. వాళ్ళు దాన్ని తెరిచి ఆ కేసును ఖాళీచేసి నీకు దాన్ని తిరిగి ఇచ్చేస్తారు. అందువల్ల నువ్వు ఆ బ్రీఫ్‌కేసును తెరిచే అవకాశం లేదు" అన్నాడు.

నేను కూడా నవ్వి "అయితే ఫర్వాలేదు. ఆ బ్రీఫ్ కేసును తెరిచే అవకాశం నాకు లేకపోవడం నాక్కూడా మంచిదే. ఎందుకంటే ఆ బ్రీఫ్ కేసును తీసుకున్న మనుషులు అందులో వస్తువులు మార్చబడినాయని నన్ను అనుమానించే అవకాశం వుండదు" అన్నాను.

"తెలివిగలవాడివి. త్వరలోనే నువ్వు రెండువేల జీతం పొందుతావని ఆశిస్తాను. సరే....రేపే నువ్వు వుద్యోగంలో జాయిన్ అవుతున్నావు. రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు నువ్వు నన్ను కలుసుకో" అని అతని ఎడ్రస్ ఎడ్వాన్సుగా నాకు అయిదువందల రూపాయలు యిచ్చాడు. తర్వాత అతని పేరు కూడా చెప్పాడు.

అతని పేరు జాన్.

సంతోషంతో యింటికి వెళ్ళాను. వెళుతూ స్వీట్స్ కొనుక్కెళ్ళాను అమ్మకి—చెల్లికి.

2

నాకు వుద్యోగం వచ్చినందుకు మా అమ్మ—చెల్లి యెంతో సంతోషించారు.

చెల్లెలు పద్మ బియ్యే ఫైనలియర్ చదువుతోంది. ఇంతకు ముందు నా చెల్లెలు పెళ్ళి గురించి నేను బాగా దిగులుపడేవాడిని. ఇప్పుడు నాకు ఆ దిగులు లేకుండా పోయింది. చదువు పూర్తయ్యేసరికి పదివేల కట్నంతో పద్మ పెళ్ళి సులభంగా చేసెయ్యగలను.

జాన్ చెప్పినట్టుగా ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు అతడిని ఒకచోట కలిశాను.

ఓ నీలంరంగు బ్రీఫ్ కేస్‌ను నాకు యిచ్చాడు. దానితో దాన్ని యెవరికి అందజేయవలసిందీ చెప్పాడు.

ఆ ఎడ్రస్ చాలా క్లియర్‌గా వున్నది.

నేను అక్కడినించి బయల్దేరబోయే ముందు నేను నమ్మకంగా పని చేయాలని లేకపోతే నా ప్రాణాలకే ప్రమాదమని మరోసారి హెచ్చరించాడు.

తల వూపి అక్కడినించి బయల్దేరాను.

సెంటర్లోకి వచ్చిన తర్వాత ఒకరిద్దరు తెలిసినవాళ్ళు కనిపించారు. కాని నేను వాళ్ళకు కనపడకుండా తప్పుకు వెళ్ళిపోయాను.

రిక్షా ఎక్కి పావుగంట తర్వాత ఓ సందు మొదట్లో దిగాను.

వరుసగా నెంబర్లు చూసుకుంటూ పదహారో నెంబర్ యింటి ముందు ఆగి నిమిషం తర్వాత కాలింగ్ బెల్ నొక్కాను.

వెంటనే తలుపులు తెరుచుకున్నాయి. యాభై యేళ్ళున్న లావుపాటి మనిషి బయటకు వచ్చాడు.

నా చేతిలోవున్న బ్రీఫ్‌కేస్‌ను చూడగానే అతనికి అంతా అర్థమయి వుంటుంది. అతను నాతో ఏమీ మాట్లాడకుండా దాన్ని తీసుకుని లోపలకు వెళ్ళాడు.

కనీసం మర్యాదకయినా అతను నన్ను కూర్చోమని అనలేదు. ఆ యింట్లో యింకెవ్వరూ వున్న అలికిడి నాకు వినిపించలేదు.

ఐదు నిముషాల తర్వాత అతను బయటకు వచ్చి ఆ బ్రీఫ్‌కేస్‌ను నాకు యిచ్చేశాడు. ఇప్పుడా బ్రీఫ్‌కేస్ తేలిగ్గా వున్నది.

తర్వాత అతను జేబులోనించి యాభై రూపాయల నోటు తీసి నాకు యివ్వబోయాడు. ఆ డబ్బును తీసుకోవటానికి సందేహించాను.

అతను నవ్వి "ఫర్వాలేదు తీసుకో...." అన్నాడు.

తీసుకున్నాను.

బయటకొచ్చేశాను.

మళ్ళీ అరగంట తర్వాత ఆ బ్రీఫ్‌కేస్‌ను జాన్‌కు అంద జేశాను.

ఆ రోజుకు నా వుద్యోగం అయిపోయింది. మొదటి రోజు నా పనిని నిర్విఘ్నంగా పూర్తి చేసినందుకు జాన్ నా భుజం తట్టి నన్ను అభినందించాడు.

3

నెలరోజులు గడిచాయి. మొదటినెల జీతం వెయ్యి రూపాయలు పూర్తిగా నాకు ఇచ్చేశాడు జాన్. ఎడ్వాన్స్‌గా యిచ్చిన ఐదువందలూ ఎడ్వాన్స్ బోనస్‌కింద వుంచుకో మన్నాడు.

ఈ నెలరోజుల్లోనూ రెండు వింతలు జరిగాయి.

ఒకటి: ఆ బ్రీఫ్‌కేసు తాళంచెవిని నేను ఓ ఇంట్లో చూడగలిగాను. ఒక ఇంట్లో ఆ బ్రీఫ్‌కేసు తీసుకున్న మనిషి లోపలి గదిలోకి వెళ్ళి దాన్ని తాళం చెవితో ఓపెన్ చేస్తున్నప్పుడు ఆ దృశ్యం నాకు ఎదురుగా వున్న అద్దంలో కనిపించింది. ఆ తాళంచెవి పొడుగాటి మేకులా వున్నది. దానికి పైచివర ఎర్రటి బటన్ వున్నది. కిందంతా కణుపు లుగా వున్నాయి. చాలా చిత్రంగా వుంది ఆ తాళంచెవి.

రెండు: నాకు పోలీసు డిపార్టుమెంటులో ఉద్యోగం వచ్చింది. మూడు రోజుల తర్వాత నేను ఆ ఉద్యోగంలో జాయిన్ కావాలి.

నాకు ఉద్యోగం వచ్చిన విషయాన్ని నేను రహస్యంగా వుంచాను. ఎందుకంటే జాన్ చట్టవిరుద్ధమైన పని చేస్తు న్నాడని నాకు తెలుసు. ఎలాగయినా అతన్ని—అతని అను చరులను చట్టానికి పట్టించాలని నా ఉద్దేశం. ఒక రకంగా

నేను గూఢచారిగా పని చేస్తున్నాను. వాళ్ళకి నమ్మకం కలిగించటానికి నాకు పొట్ట గడపటానికి నేను జీతం తీసుకున్నాను.

నిజానికి ఆ బ్రీఫ్ కేసులో ఏమున్నదో కూడా నేను ఆ రోజు ఆ ఇంట్లో అద్దంలో చూడగలిగాను. అందులో చాలా ఘాటయిన మత్తుమందు వున్నది.

ఈ విషయాన్ని పోలీసులకు ఎప్పుడో తెలియబరిచే వాడిని. కాని వీళ్ళందరికీ ఒక నాయకుడు వున్నాడు. ఆ నాయకుడు ఎవరో తెలుసుకుంటే అందర్నీ ఒకేసారి పట్టించవచ్చు.

సరిగ్గా ఒకరోజు తరువాత నాకు ఆ అవకాశం వచ్చింది. ఆ రోజు నాకు పని లేదని చెప్పాడు జాన్. తిరిగి వస్తున్నాను. బస్టాండుకు దగ్గర్లోవున్న బుక్ స్టాలువైపు నడుస్తూ ఓ యువతి కనిపించింది. ఆమె నా చెల్లెలు పద్మ స్నేహితురాలు. పేరు రజని. ఆమె చేతిలో నీలిరంగు బ్రీఫ్ కేసు వున్నది. దాన్ని చూడగానే నేను ఆశ్చర్యపోయాను.

రజని బుక్ స్టాలు దగ్గర రెండు ఇంగ్లీషు మేగజైన్లు కొని భుజానికి తగిలించుకున్న బ్యాగ్ లో నించి పొడుగాటి ఎరుపురంగు బటన్ వున్న చిత్రమైన తాళం చెవిని తీసి బ్రీఫ్ కేసు తెరిచి మేగజైన్లను అందులో వుంచి క్లోజ్ చేసింది.

రోడ్డుమీద నిలబడి అంతా చూశాను.

అనుమానం లేదు. అది జాన్ చెప్పిన రెండో బ్రీఫ్ కేసు. అంటే రజని తండ్రి జనార్దనం ఈ ముఠా నాయకుడు అయివుండాలి. అవును. నా అంచనా తప్పదు.

ఇంటికి వెళ్ళి నేను ఎవరెవరికి ఆ బ్రీఫ్ కేసులను అందిం

చానో వాళ్ళందరి ఎడ్రసులనూ ఓ కాయితంమీద రాసుకుని పోలీసు స్టేషన్‌కి వెళ్ళాను.

అంతా నేను అనుకున్నట్టుగానే జరిగింది. మరుసటి రోజు జాన్ నాకు ఆ బ్రీఫ్‌కేసును అందిస్తూ పోలీసులకు పట్టుబడిపోయాడు.

తర్వాత రజని తండ్రి జనార్ధనం కూడా దొరికిపోయాడు. మిగిలిన వాళ్ళంతా పోలీసులకు చిక్కారు.

జనార్దనం ఇంట్లో అండర్‌గ్రవుండ్‌లో వున్న చిన్న గదిలో ఇంకా ఎన్నో లక్షలు విలువచేసే రకరకాల మత్తు పదార్థాలు దొరికాయి.

“నమ్మకంగా మోసం చేశావు. నీ ప్రాణాలకు ప్రమాదం తప్పదు” అన్నాడు జాన్, నాతో.

నేను నవ్వి “ఇప్పుడు నేను నిరుద్యోగిని కాదు. సాధారణమైన మనిషినీ కాదు. పోలీసు ఉద్యోగిని. నీలాంటి నేరస్తులను పట్టుకోవటమే నా ఉద్యోగం” అన్నాను. □

సుబ్బారావు మారాడు!



రుచి మరిగిన మృగాలు



ఎమ్.డి.చైతన్య

రాత్రి పన్నెండు గంటలు.

రాధ, మోహన్‌రావు ఒకే మంచంమీద పడుకున్నారు.

బయట వరండాలో పడుకున్నారు.

లైటు మూసేసారు. అంతా చీకటిగా వుంది.

వాళ్ళు మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్రపోయారు.

రాత్రి పన్నెండు గంటలకు ఆమెకు మెలకువ వచ్చింది.

రాధ తన భర్తమీద చేయి వేసింది.

అతనూ ఆమెమీద చేయి వేసాడు.

రాధ తన భర్త వీపు నిమిరింది.

వెంట్రుకలు తగిలాయి.

ఆశ్చర్యం!

తన భర్తకు వీపుమీద వెంట్రుకలు లేవు. మరి ఇదెలా సాధ్యం! ఉన్నట్టుండి అతని వీపుమీద వెంట్రుకలెలా మొలిచాయి. రాధ చీకటిలో ఆశ్చర్యపోయింది. మళ్ళీ తడిమి చూసింది. సందేహం లేదు. అవి వెంట్రుకలే!

తన భర్త తనను మళ్ళీ దగ్గరికి తీసుకుంటున్నాడు.

ఆమె చీకటిలోనే మొహం తడిమింది. మీసాలు తగిలాయి.

మళ్ళీ ఆశ్చర్యం!

తన భర్తకు మీసాలు లేవు.

రాధ ఇంక ఆలస్యం చేయకుండా లేచి లైటువేసింది.

ఎవరో గుర్తుతెలియని వ్యక్తి కంగారుగా లుంగీ సర్దుకొని పారిపోతున్నాడు. ఒంటిమీద బనియన్ కూడా లేదు. బేర్ బాడీతో వున్నాడు. చూస్తుండగానే ప్రహరిగోడ దూకి పారిపోయాడు. రాధ అవాక్కయింది.

తను ఎంత ఘోరంగా మోసపోయిందో తలుచుకోగానే రాధకు దుఃఖం ఆగలేదు. నిశ్శబ్దంగా ఏడ్చింది.

ఇంతకు తన భర్త ఏమైనట్టు.

"రాధా!" భర్త మోహన్‌రావు పిలుపు.

లెట్రిన్‌లో వుండి పిలుస్తున్నాడు.

రాధ లెట్రిన్‌వైపు వెళ్ళింది.

"గొళ్ళెం తియ్యి. బయటగొళ్ళెం ఎందుకు పెట్టావు?"

రాధ ఆశ్చర్యపోయింది.

తను పెట్టలేదా గొళ్ళెం. మరి ఎవరు పెట్టారు. ఇంతకు మునుపు వచ్చిన ఆగంతకుడి పని అయ్యుంటుంది. ఆయన లెట్రిన్‌లోకి వెళ్ళింది పసిగట్టి, గొళ్ళెం పెట్టేసి వచ్చి తన ప్రక్కన పడుకున్నాడన్న మాట. ఎంత ధైర్యం!!

రాధకు నిజం చెప్పడానికి ధైర్యం చాలలేదు.

"ఇందాక నేను బాత్రూమ్‌లోకి వెళ్ళానండి! నిద్ర మబ్బులో బాత్రూమ్ తలుపనుకొని లెట్రిన్ గొళ్ళెం పెట్టి వుంటాను. సారీ!" అన్నది.

"ఇంకా వెళ్ళి నిద్రపోయావు కాదు. రాత్రంతా ఇందు లోనే వుండాల్సి వచ్చేది ఖర్మ!"

రాధ కృత్రిమంగా నవ్వింది. ఇంతకు మునుపు జరిగిన సంఘటనతో ఆమె మూడ్ చెడిపోయింది.

ఇద్దరూ వెళ్ళి పడుకున్నారు.

2

రాధ జరిగిన సంఘటనను మరిచిపోతున్న తరుణంలోనే వారం రోజుల తర్వాత మరో సంఘటన జరిగింది.

ఆ రోజు.

రాత్రి పదిన్నరకే తనెందుకో ఆదమరచి నిద్రపోయింది. మామూలుగానే లైటు తీసేసి వుంది. అంతా కటిక చీకటి.

అలవాటు ప్రకారం భార్యభర్తలు తమ కార్యక్రమాన్ని ముగించి పడుకున్నారు.

. తన భర్త ప్రక్కలోనే వున్నాడు. బయట ఎవరో సన్నగా తలుపు తడుతున్నారు.

"ఎవరూ?" అని అడిగింది.

"నేను..." అన్నాడు అవతలి వ్యక్తి.

అది తన భర్త గొంతు.

తన భర్త బయటికెళ్ళాడన్నమాట. మరి తన ప్రక్కలో పడుకున్నదెవరు? రాధకు భయమేసింది. చటుక్కున లేచి లైటు వేసింది. లుంగీ బనియన్‌మీద ఒక వ్యక్తి ప్రహరి గోడ దూకి పారిపోతూ కనిపించాడు. అతన్ని స్పష్టంగా చూడగలిగింది. ఇతను గతంలో వచ్చిన వ్యక్తి మాత్రం కాదు. మరోవ్యక్తి. రాధకు ముచ్చెమటలు పోసాయి.

వెళ్ళి బయట తలుపుతీసింది.

"ఇప్పుడేకదా సిగరెట్లకని సినిమాహాలు వరకు వెళ్ళొచ్చాను. వెళ్ళేటప్పుడు నిద్రపోతూనే వున్నావు, తలుపెలా పెట్టుకున్నావు" అడిగాడు మోహన్‌రావు.

రాధ గతుక్కుమన్నది. గడియ ఎవరు పెట్టారు? ఇంతకు మునుపు పారిపోయిన వ్యక్తి పెట్టేసి వుంటాడు. నిజం చెప్పాలనుకున్నది. విషయం తెలిస్తే-తనకు విడాకు లిచ్చి పంపిస్తాడేమోనని భయమేసింది. వెంటనే మాట మార్చేసింది.

"మీరలా వెళ్ళగానే—మెలకువ వచ్చింది. కుక్కలొస్తాయోమేనని—తలుపు గడియవేసాను" అని బుకాయించింది.

"సరే పద!" అని ఇద్దరూ వెళ్ళి పడుకున్నారు.

3

మర్నాడు సాయంత్రం ఆరుగంటలు!

రాధ భర్త రాకకు ఎదురుచూస్తూ గుమ్మంలో కూర్చుంది.

గంట గడిచింది. అయినా భర్త జాడలేదు. రాధ లోనికి వెళ్ళి తలుపులన్నీ వేసుకొని పడుకున్నది.

ఆమెకెందుకో భయంగా వున్నది.

తన ఇష్టం లేకుండా — తనకు తెలియకుండా—ఇద్దరు

వ్యక్తులు తనను అనుభవించారు. తన భర్తలేని సమయం చూసి వాళ్ళు ఎవరైనా వచ్చి—అల్లరి చేస్తారేమోనని భయపడుతూ—గడియలన్నీ వేసి పడుకుంది.

తెల్లవారింది. మోహన్‌రావు ఇంటికి తిరిగిరాలేదు.

పాలుపోసే మనిషి వచ్చి "వూరు అవతల చెరువుగట్టు దగ్గర ఎవరినో చంపి పడవేసారట అమ్మగారు. ఏం కాలమొచ్చింది. మాయదారికాలం" అని వెళ్ళిపోయింది.

రాధ గుండెలో గుబులు బయలుదేరింది.

ఆ వ్యక్తి ఎవరో చూసిరావాలని వున్న పళాన బయలుదేరింది.

చెరువుగట్టు దగ్గర మనుషులు గుంపుగాచేరి అక్కడ పడి వున్న శవాన్ని చూస్తూ ఏదో మాట్లాడుకుంటున్నారు.

రాధ దగ్గరికి వెళ్ళింది. శవాన్ని పరీక్షగా చూపింది. సందేహం లేదు. అది తన భర్త మోహన్‌రావు శవమే. రాధ భోరున ఏడుస్తూ అక్కడే కుప్పలా కూలిపోయింది.

జనంలో కలకలం చెలరేగింది.

అంతలోనే పోలీసులు వచ్చారు. వాళ్ళుచేసే ఫార్మాలిటీలను మొదలుపెట్టారు.

4

అమాయకుడైన తన భర్తను ఎవరు హత్యచేసారో రాధకు అర్థం కాలేదు. తన భర్తకు శత్రువులు ఎవరూ లేదు. తన భర్తను చంపాల్సిన అవసరం ఎవరికుంది.

ఆలోచించగా రాధకు ఒక విషయం గుర్తొచ్చింది.

ఈ రోజు ఉదయం తాను ఇద్దరు భయంకరమైన వ్యక్తులను చూసింది. వాళ్ళను గుర్తించింది కూడా.

ఇంటి ఎదురుగా వున్న మేడగదిలో వాళ్ళిద్దరు కొత్తగా అద్దెకు దిగినట్లుంది.

ఆ ఇద్దరు వ్యక్తులే తనకు తెలియకుండా తెలివిగా తన మానాన్ని దోచుకున్నారు. వెధవలు రుచి మరిగారు. తన భర్త వాళ్ళకు ఆటంకమని భావించి హత్య చేసారు. ఇందులో సందేహం లేదు.

రాధ గట్టి నిర్ణయానికి వచ్చింది. వాళ్ళను హత్యచేసి తన భర్త ఆత్మకు శాంతి చేకూర్చి తన పగ చల్లార్చుకోవా లని నిర్ణయించుకుంది.

సాయంత్రం 8 గంటలైంది.

వాళ్ళిద్దరు వ్యక్తులు మేడమీద గదిలో పచార్లు చేస్తు న్నారు. ఆ వ్యక్తులు రాధవైపే చూస్తున్నారు.

రాధ ధైర్యంచేసి రమ్మన్నట్టుగా సైగ చేసింది.

అయిదు నిముషాల తర్వాత ఇద్దరూ వచ్చేసారు.

రాధ కంగారుపడింది.

"ఇద్దరూ ఒకేసారివస్తే ఎలా? మీలో ఎవరైనా ఒకరు ఒక గంట తర్వాత రండి!" అన్నది.

ఆ ఇద్దరు వ్యక్తులు కాస్సేపు మాట్లాడుకున్న తర్వాత ఒకడు వెళ్ళిపోయాడు.

రాధ అతన్ని లోనికి తీసుకువెళ్ళి మంచం చూపించింది.

"పడుకోండి! నేను చీర మార్చుకొని వస్తాను" అంటూ లోనికి వెళ్ళింది.

ఆ వ్యక్తి వెల్లకిలా పడుకొని — "చీరెందుకు అలాగే వచ్చెయ్యకూడదూ" అన్నాడు.

"అబ్బా....ఆశ" అని నవ్వింది రాధ.

రాధ లోనికి వెళ్ళి సిద్ధంగా పెట్టుకున్న కత్తిని బయటికి తీసింది.

చీర మార్చుకొని బొడ్లో కత్తి దోపుకుంది.

ఆ వ్యక్తి జరగబోయే కార్యక్రమాన్ని ఊహించు

కుంటూ కలలు కంటున్నాడు.

రాధ అతని దగ్గరికి వెళ్ళింది.

అతను కళ్ళు మూసుకొని కూనిరాగం తీస్తున్నాడు.

రాధ కత్తితీసి అతని కడుపులో పొడిచేసింది.

చివ్వున రక్తం చిమ్మింది. అరవకుండా అతనినోటిలో చీరకొంగు కుక్కింది.

అతను కిక్కురుమనకుండా ప్రాణం వదిలేసాడు.

అతని శవాన్ని లాక్కొచ్చి ఆ ఇంట్లో ఉన్న నీళ్ళులేని చేదబావిలో తోసేసింది.

రాధ రక్తంతో తడిసిన తన చీరెను మార్చుకుంది.

రెండోవాడికై ఎదురుచూస్తూ కూర్చుంది.

రెండో అతన్ని వెంటనే చంపకుండా తన భర్తను ఎందుకు హత్యచేసారో కనుక్కోవాలనుకుంది.

గంట గడిచింది.

రెండో వ్యక్తి వచ్చి తలుపు తట్టాడు.

రాధ తలుపు తెరిచింది.

"రండి...." అంటూ లోనికి ఆహ్వానించింది.

"రాజు ఎక్కడికెళ్ళాడు?" అడిగాడు అతను.

"ఇప్పుడే సిగెరెట్లు కొనుక్కొచ్చుకుంటానని బయటికి వెళ్ళారు" అన్నది తొణక్కుండా.

"ఓహో!"

"కూర్చోండి!" అంటూ మంచం చూపించింది.

అతను కూర్చున్నాడు.

రాధ గదిలోనికి వెళ్ళి దోసెడు మల్లెపూలు తెచ్చి అవి వాసన చూడమన్నది.

అతను సంతోషపడిపోయి ఆ మల్లెపూలను తనివితీరా వాసన చూసి అలాగే మంచంమీద స్పృహతప్పి పడి

పోయాడు.

మల్లెపూలమీద బాగా క్లోరోఫాం చల్లింది రాధ.

స్పృహతప్పి పడిపోయిన అతన్ని తాళ్ళతో మంచానికి కట్టేసింది.

ఒక గంట తర్వాత అతనికి మెలకువ వచ్చింది.

రాధ అపరకాళిలా అతని ముందు కత్తి పుచ్చుకొని నిలుచుంది.

ఆ వ్యక్తి ఆమె రూపాన్ని చూసి కంగారుపడి పోయాడు. తనను కట్టివేసి వుండటం గమనించి భయపడి పోయాడు.

"రేయ్ బాస్టర్డ్ చెప్పు....నా భర్తను ఎందుకు హత్య చేసారు? చెప్పు?" అని కత్తి మొనను అతని గొంతుదగ్గర పెట్టింది.

"నేను చంపలేదు. రాజు చంపాడు" అన్నాడు అతను వణికిపోతూ.

"ఏ రాజు?"

"నా కంటే ముందు ఈ గదిలోకి వచ్చినతను."

"ఎందుకు చంపాడు. నా భర్త ఏం పాపం చేసాడని."

"డబ్బులడిగినందుకు చంపేసాడు."

"డబ్బులా....ఎక్కడి డబ్బులు."

అతను చెప్పడానికి జంకాడు.

"ఊఁ చెప్పు! లేదా చంపేస్తాను" అని బెదిరించింది.

"నీ భర్త మోహన్‌రావు మేమిద్దరం చెరొక అయిదు వొందలు ఇస్తామంటే నీకు తెలియకుండానే నీ దగ్గర పడుకోబెట్టాడు. నేను అయిదువొందలు ఇచ్చానుగానీ రాజు ఇవ్వలేదు. ఇవ్వమని గట్టిగా అడిగితే ఇవ్వను పొమ్మన్నాడు. వాళ్ళిద్దరికీ తగాదా వచ్చింది. రాజు,

మోహన్‌రావును పొడిచి చంపేసాడు" అని ముగించాడు.

రాధ అవాక్కయింది. తను ప్రేమించి పెళ్ళి చేసుకున్న మోహన్‌రావే తనను ఇంత మోసం చేసాడంటే నమ్మలేక పోయింది. కానీ జరిగిన సంఘటనను తలుచుకుంటే నిజమే ననిపిస్తోంది. తన భర్త సహకారం లేకపోతే ఈ దుండగులు తన మానాన్ని దోచుకోవడం కల్ల.

"ఒరేయ్, మీలాంటి రాక్షసులు ఈ లోకంలో వుండటానికి వీల్లేదు" అని ఆ వ్యక్తి కడుపులో కత్తితో నాలుగైదుసార్లు పొడిచేసి అదే నీళ్ళులేని చేదబావిలో పడేసింది.

మరో గంటతర్వాత, పోలీస్ స్టేషన్లో చేతిలో రక్తం ఓడుతున్న కత్తితో అపర భద్రకాళిలా తమ ఎదుట నిలుచున్న రాధను చూసి కొయ్యబారిపోయారు పోలీసులు. □



తిరుగాడిన శవం

కాశీభట్ల భానుమూర్తి

ట్రింగ్, ట్రింగ్ మంటూ ఫోను మ్రోగిన శబ్దానికి శ్రద్ధగా 'అపరాధ పరిశోధన' చదువుతున్న ఓంకారం విసుగ్గా పుస్తకంలోంచి తలెత్తి ఫోను తీశాడు.

కాని అవచ్చింది రాంగ్ నంబర్. చిరాగ్గా ఫోను పెట్టేసి మళ్ళీ అపరాధ పరిశోధన చదువుకోసాగాడు ఓంకారం.

ఇంతలో తలుపు తట్టిన శబ్దమయింది. మళ్ళీ అపస

పెట్టేసి, విసుగ్గా వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా చిరునవ్వులు చిందిస్తూ శ్రీకారం నిలుచున్నాడు.

"ఓరి, నువ్వా యింకా యెవరో అనుకున్నాను" అన్నాడు ఓంకారం.

"ఏం, ఆఫీసు అద్దెకోసం యజమాని వచ్చాడనుకొన్నావా" అన్నాడు శ్రీకారం.

"ఆ! అదేం లేదు. అద్దె నిన్ననే యిచ్చేశా. బాసు నన్ను యిమ్మని డబ్బులిచ్చి ఊరు వెళ్ళారు" అన్నాడు ఓంకారం.

"ఏమిటీ బాసు ఊళ్ళో లేరా, ఎక్కడికి వెళ్ళారు" అన్నాడు శ్రీకారం.

"నువ్వు అలా వారం రోజులు శలవుపెట్టి మీ అత్తారింటికి రాజమండ్రి వెళ్ళావు. బాసు ఏదో పనిమీద కాకినాడ వెళ్ళారు. ఈవేళో, రేపో వచ్చేస్తారు"అన్నాడు ఓంకారం.

"మనకి ఈ తణుకులో లాభంలేదురా ఓంకారం. నెలకో కేసయినా రావటంలేదు. బాసు వచ్చాక మనం ఏ విజయవాడో, విశాఖపట్నమో వెళితే, అక్కడ డిటెక్టివ్ ఆఫీసు పెడితే మనకి డబ్బులకి కొదవ వుండదు" అన్నాడు శ్రీకారం.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఈ తణుకులో డిటెక్టివ్ ఆఫీసు పెట్టినప్పటి నుంచి డబ్బులొచ్చే కేసులకన్నా, డబ్బులు రానికేసులే ఎక్కువగా వున్నాయి. అందులోనూ తణుకులో జనానికి తమాషాగా వుంది డిటెక్టివ్‌లంటే. మొన్నటికి మొన్న నువ్వు లేవులే అప్పుడు. ఒక పల్లెటూరి అతను వచ్చి 'బాబూ ఇది డిటక్టవలు వుండే ఆపీచేనా' అన్నాడు. నేను అవునన్నాను. బాబూ మా కుర్రాడి కళాసు పుత్తకాలు నిన్న సందేళ పోయాయి. వెతికితే ఒక

అరిటిగెల ఇస్తానన్నాడు" అని అచ్చు ఆ పల్లెటూరి అతను యెలా మాట్లాడాడో అదే విధంగా అనుకరిస్తూ మాట్లాడి చూపించాడు ఓంకారం.

"అలా వుంది యిక్కడ మన పరువు. అందుకే ఏ పట్నమన్నా పోదామని నాకూ వుంది. అయినా బాసు రానీ, మాట్లాడొచ్చు" అని శ్రీకారంతో చెప్పి మళ్ళీ అపరాధ పరిశోధన పఠనంలో మునిగిపోయాడు ఓంకారం.

వీధి తలుపు వేసివచ్చి 'సప్లిమెంట్' పట్టుకొని చదువుకోసాగాడు శ్రీకారం.

ఇంతలో వీధితలుపు తట్టిన శబ్దం వినబడింది.

శ్రీకారం వెళ్ళి తలుపు తీశాడు. అవతల తలుపుతట్టింది ఓ బట్టతల పెద్దాయన. ఆయన వేసుకొన్న బట్టలు చాలా విలువయినవి.

శ్రీకారానికి అర్థమయిపోయింది ఆ వచ్చింది కష్టమరే నని. అందుకే లోపలికి వచ్చి కూర్చోమన్నాడు.

ఆయన రెచ్చిపోయాడు. "ఏమిటిరా, దగుల్బాజీ వాగుతున్నావు. కూర్చోవాలా, నేనెవరో నీకు తెలుసా! ముందు మీ బాసుగాడిని పిలు" అన్నాడు.

ఆ గొడవకి చదువుతున్న అపన అక్కడ వదిలేసి పరుగు పరుగున వచ్చాడు ఓంకారం. శ్రీకారం ఏదన్నా తప్పుగా మాట్లాడాడేమో అందుకే ఆ మనిషి రెచ్చిపోతున్నాడని తలంచి, "సార్! రండి కూర్చోండి. ఏం తీసుకొంటారు. మా శ్రీకారం చిన్నవాడు. ఏదన్నా తప్పుగా మాట్లాడితే క్షమించండి" అన్నాడు ఓంకారం.

"ఏమిటిరా, మిమల్ని క్షమించేది. పుండాకోరు వెధవల్లారా! ఈ భుజంగరావు ముందా మీ కుప్పిగంతులు. యెప్పుడో జరిగిపోయిన కేసులు వెతికి తీసి, మీ బాసు

మమ్మల్ని అవమానపరుస్తాడా. ఏడిరా మీ పరిశోధనరావు. ఎక్కడ దాక్కున్నాడురా. తోలు వలచి ఆరవేస్తాను ఆ గాడిదకి. డిటెక్టివ్ అంటే ఏవో చిన్న చిన్న కేసులు పరిశోధించి నాలుగు డబ్బులు సంపాదించుకోవాలిగాని, ఇలా నాలాంటి పెద్దవారిమీద, వారి కేసులు కెలికి, వారి పరువు తీస్తే ప్రాణాలు తీస్తాను జాగ్రత్త! రండిరా ఎవడొస్తాడో, ఇప్పుడు మీ పీకలు పిసికిపారేస్తాను. రమ్మను ఆ పరిశోధన రావుని. వచ్చి రక్షించుకోమను మిమ్మల్ని!" అని ఓంకారం పీక పుచ్చుకొన్నాడు భుజంగరావు.

ఈ గొడవకి అక్కడ మూగిన జనం వచ్చి భుజంగ రావు చేతల్లోంచి ఓంకారాన్ని విడిపించారు. ఓంకారం పీక పిసకటానికి వీల్లేక శ్రీకారం వైపు బయలుదేరాడు భుజంగ రావు.

జనం మళ్ళీ భుజంగరావుని పట్టుకొని, శ్రీకారం పీకని కూడా రక్షించారు.

ఇక ఓంకారం, శ్రీకారంలని ఏమీచేయలేక, మళ్ళీ ఒకసారి బెదిరించి, కారెక్కేసాడు భుజంగరావు. అక్కడ చేరిన జనాల మీదికి పొగ వొదులుతూ భుజంగరావు కారు వెళ్ళిపోయింది.

బెదిరిపోయిన ఓంకారం, శ్రీకారంలకి కాపిన మంచి నీళ్ళు త్రాగించి, లోపలికి తీసుకొనిపోయి కుర్చీలలో కూర్చోపెట్టారు జనం. ఈ గొడవకి మతిపోయి, కుర్చీల్లో కదలక మెదలక బొమ్మల్లా కూర్చుండిపోయారు ఓంకారం శ్రీకారంలు.

2

"అదీ సార్, జరిగింది. అలా భుజంగరావు బెదిరించి వెళ్ళాక, మతిపోయి కూర్చొన్నాము" అని అప్పటివరకు

జరిగింది పరిశోధనరావుకి చెప్పాడు శ్రీకారం.

పరిశోధనరావు కాకినాడ నుంచి అప్పుడే వచ్చాడు. రాగానే అప్పటివరకూ జరిగింది చెప్పాడు శ్రీకారం.

అది వినగానే వళ్ళు మండిపోయింది పరిశోధనరావుకి. "ఏమిటి, డిటెక్టివ్‌లనే అవమానిస్తాడా ఆ భుజంగరావు. చూపిస్తా నా తడాఖా" అని పెద్దగా అరవసాగాడు పరిశోధన రావు.

"మా పీకలు కూడా నులపబోయాడు బాస్. మా అదృష్టం బావుండి ఏలాగో బైటపడ్డాం. మమ్మల్ని పుండాకోర్లని, దగుల్బాజీలని తిట్టాడు బాస్" ముక్కు చీదుతూ చెప్పాడు ఓంకారం.

"అంతేకాదు బాసూ. మిమ్మల్ని కూడా ఏకవచనంలో తిట్టాడు. జనం అందరూ చూసారు బాస్. మన పరువు పోయింది బాసో, బాసో" అని పెద్దపెట్టున ఏడవసాగాడు శ్రీకారం.

"ఛీ! ఊరుకో వెధవ ఏడుపూ నువ్వూనూ. నేను లేనుకదాని నా అసిస్టెంట్లని బెదిరిస్తాడా భుజంగరావు. ఇంతకీ ఎందుకు తిట్టాడో చెప్పాడా," అన్నాడు పరిశోధన రావు.

"ఏదో, ఎప్పుడో జరిగిపోయిన కేసుని మీరు కెలికి, ఆ భుజంగరావుని అవమానపరిచారట. అందుకు యిప్పుడు మిమ్మల్ని, మమ్మల్ని కలిపి ఉతికి ఆరబెట్టాడు బాసో" అని మళ్ళీ ఏడుపు లంకించుకొన్నాడు శ్రీకారం.

"పాతకేసా" అని ఆలోచిస్తూంటే పరిశోధనరావుకి చప్పున గుర్తుకు వచ్చింది. తాను అదివరకు పరిశీలించిన కేసు విషయం.

పోలీసులు పరిష్కారం కాక వదిలిపెట్టిన హత్యకేసులో,

హతుడి తాలూకూ వాళ్ళు కోరిన మీదట పరిశోధనరావు ఆ కేసు కెలికితే చాలా పెద్ద పెద్ద వాళ్ళే ఆ కేసులో వున్నారని తేలింది. ఏ మాత్రం సంకోచించకుండా వాళ్ళందరినీ సాక్ష్యాధారాలతో సహా పోలీసులకి పట్టిచ్చింది పరిశోధనరావే.

ఆలోచిస్తుంటే భుజంగరావు పేరు కూడా ఆ కేసులో వున్న విషయం గుర్తుకొచ్చింది. "విడుదలయి వచ్చి నలుగురిలో నన్ను అల్లరిపెడతావురా భుజంగరావూ. చెబుతా, నిన్ను యిలా వదిలిపెట్టను. జైలుకు పంపి నిన్ను మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. డిటెక్టివ్‌లంటే ఏమిటో చెబుతాను" అని ప్రతిజ్ఞ చేసి.

"ఓంకారం, శ్రీకారం మీరిద్దరూ, భుజంగరావు ఎడ్రస్సు యెలా అయినా సంపాదించి, వాడి దినచర్యల మీద, వాడుచేసే పనులమీద ఒక కన్నేసి వుంచండి" అన్నాడు పరిశోధనరావు.

"ఓ, అలాగే. మా పీకలు పిసుకుతాడా, వాడి పీక పట్టుకొని రామూ" అన్నారు ముక్తకంఠంతో ఓంకారం, శ్రీకారంలు, ఏడుపు మాని.

"పుల్లయ్య వ్యవహారంలా చేయకండి. నాకు అన్ని విషయాలు ఎల్లుండి పొద్దున్నకల్లా తెలియాలి. ఎల్లుండి సాయంత్రానికి వాడు జైల్లో వాడిపీక వాడు పిసుక్కోవాలి" అని మళ్ళీ ఒకసారి చెప్పాడు పరిశోధనరావు.

"సరే" అని క్షణంలోనే పరిశోధనరావు చెప్పిన పని మీద బయలుదేరారు ఓంకారం, శ్రీకారంలు.

౩

తలుపు తట్టిన శబ్దమయింది.

మళ్ళీ ఆ భుజంగరావే వచ్చాడేమోనని కంగారుపడ్డాడు

పరిశోధనరావు. ధైర్యం చిక్కబట్టుకొని తలుపు తీసాడు. ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి.

లోపలికి వచ్చి కూర్చోమని మళ్ళీ తలుపు వేసేసాడు పరిశోధనరావు.

"ఏమిటి, ఇదివరకు నేను యెప్పుడు చూసినా తలుపులు తీసివుండేవి. ఇప్పుడు అస్తమానూ తలుపులు వేస్తున్నారు ఏమిటి?" అని అడిగాడు ఆ వచ్చిన వ్యక్తి.

"అబ్బే! మాకు యిది అలవాటే. ఎవరైనా కష్టమ రొచ్చినప్పుడు అతని మాటలు బయటకు వినబడకుండా యిలా తలుపులు వేస్తూ వుంటాము" అన్నాడు పరిశోధన రావు ఇకిలిస్తూ.

"ఆఁ మరిచా, మీ పేరు. మీరు వచ్చిన పని, మేం మీకే సహాయం చేయాలి చెప్పండి" అని ప్రశ్నించాడు పరిశోధన రావు.

"నా పేరు గోపాలరావండి. మా నాన్నగారి పేరు ప్రసాదరావుగారండి. మీరు వినేవుంటారు మాకు చాలా ఫ్యాక్టరీలున్నాయి. ఇంకా చాలా ఫ్యాక్టరీలలో షేర్లు వున్నాయి. నిన్న పొద్దున పదిగంటల నుంచి మా నాన్న గారు కనబడటంలేదు. వయస్సు ఏభై సంవత్సరా లుంటాయి. కాస్త మీరు శ్రమతీసుకుని వెతికిపెట్టాలి" అన్నాడు గోపాలరావు.

"దానికేముంది లెండి. వెతుకుతాను. కాని నిన్ననే కన బడటం లేదన్నారుగా. కాస్త ఆగి చూడొచ్చుగదా. ఏ పని మీదైనా ఏ ఊరైనా వెళ్ళారేమో" అన్నాడు పరిశోధన రావు.

"అబ్బె! నాకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళరండి. మొన్న గుండెపోటు మొదటిసారి మా నాన్నగారికి వచ్చి

నప్పటి నుంచి ఏదైనా పని వుంటే నేనే ఊర్లు అవీ తిరుగుతున్నాను. అందుకే మాకు కంగారుగా వుంది'' అన్నాడు గోపాలరావు.

"పోలీసు రిపోర్టు యిచ్చారా, లేదా'' అని ప్రశ్నించాడు పరిశోధనరావు.

"ఇచ్చానండి. మాకు తెలిసిన వాళ్ళ యిళ్ళకి ఫోన్లుచేసి, మా నాన్నగారు లేరని తెలుసుకొని, వెంటనే పోలీసు రిపోర్టు చేసానండి. కాని ఈ రోజు కూడా కనబడకపోయే సరికి మీ దగ్గరికి వచ్చాము. కాస్త మీరు మా నాన్నగారిని వెతికిపెట్టాలి'' అన్నాడు గోపాలరావు.

"తప్పకుండా నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. బై దిబై మీనాన్న ప్రసాదరావుగారికి ఎవరన్నా శత్రువులున్నారా, మీకు తెలిస్తే చెప్పండి'' అని ప్రశ్నించాడు పరిశోధనరావు.

"శత్రువులంటే శత్రువులు లేరుగాని ఒక విరోధి వున్నాడు. మా నాన్నగారూ, అతనూ కలిసి ఒక ఫ్యాక్టరీ పెట్టారు చాలా కాలం క్రితం. కాని అది లాభాలు రాక అతని షేర్లు కూడా మా నాన్నగారికి అమ్మేసి అతను చేతులు దులుపుకొన్నాడు. అయితే ఆ ఫ్యాక్టరీకి ఈ మధ్య కాలంలో విపరీతంగా లాభాలు వస్తున్నాయి. అందుకని అతను మళ్ళీ వచ్చి తన షేర్లు తనకి అమ్మమన్నాడు. కాని మా నాన్నగారు ఒప్పుకోక, కసిరిపంపించేశారు. దానితో అతను రెచ్చిపోయి, నీ అంతు చూస్తానన్నాడు. ఇది అతని పనేమోనని నా అనుమానం. అనుమానమే సుమండీ'' అన్నాడు గోపాలరావు.

"అతని పేరు చెప్పలేదు మీరు'' అని గుర్తుచేసాడు పరిశోధనరావు.

"అతని పేరు భుజంగరావు'' అన్నాడు గోపాలరావు.

పరిశోధనరావుకి 'ఆనంద తాండవం' చేద్దామనిపించింది. "తస్సాచెక్కా ఒరేః భుజంగరావు. నీ పనిసరి. చూసుకో నా సత్తా" అని మనసులో ఆనందపడుతూంటే "మీ ఫీజెంత" అని డిస్టర్బ్ చేశాడు గోపాలరావు. చెప్పాడు ఫీజెంతో పరిశోధనరావు.

మారు బేరాలాడకుండా అడిగిన ఫీజు టేబిల్‌మీద పెట్టి లేచి నుంచున్నాడు గోపాలరావు.

ఆ డబ్బులు జేబులో దోపుకొని, "మీ నాన్నగారి ఫోటో యివ్వండి, అలాగే మీ అడ్రసు కూడా" అని అడిగాడు పరిశోధనరావు.

ఫోటో, అడ్రసు ప్రింట్ చేసినకార్డు టేబుల్‌మీద పెట్టి, "వస్తానని" పరిశోధనరావు దగ్గర శలవు తీసుకొని వెళ్ళి పోయాడు గోపాలరావు.

భుజంగరావు మీద కక్ష తీర్చుకోవటానికి ఏమి చేయాలా అని పరిశోధనరావు ఆలోచిస్తుంటే, ఇంతలో ఓంకారం, శ్రీకారంలు పరిగెత్తుకు వచ్చారు.

భుజంగరావు ఎడ్రసు, అతని అలవాట్లు, అతని ప్రవర్తన మొత్తం అన్నీ ముక్తకంఠంతో పరిశోధనరావుకి వివరించారు ఓంకారం, శ్రీకారంలు.

4

చీకటి పడింది.

భుజంగరావు యింటిముందే తచ్చాడుతున్నారు ఓంకారం, శ్రీకారంలు. ఇంటి వెనకాల వున్నాడు పరిశోధనరావు.

ఇంటి వెనక నుండి పరిశోధనరావు ముందుకు వచ్చి, శ్రీకారం, ఓంకారాలని కలుసుకొని "అబ్బె లాభంలేదు. లోపలికి వెళ్ళి చూడటంకన్నా, నేను ఒక మంచి పని

చెబుతాను. ఇప్పుడు మనం ఒక శవం సంపాదించాలి" అన్నాడు సీరియస్‌గా.

"శవమా?" అని వణికిపోసాగాడు శ్రీకారం.

"బాస్, అదేమన్నా ఐస్‌ఫ్రూట్ అనుకొన్నారా, సంపాదించాలనుకొన్నప్పుడు సంపాదించటానికి" అని అన్నాడు ఓంకారం.

"ఛీ! ఛీ! పవిత్రమయిన డిటెక్టివ్ వృత్తిలో వుండి శవాలకి భయపడటమా? ఎంత సిగ్గుచేటు" అన్నాడు పరిశోధనరావు.

"అసలు యింత చీకట్లో యిప్పుడు మనకి శవాలెక్కడ దొరుకుతాయి బాసూ" అన్నాడు శ్రీకారం.

"భారతదేశంలో శవాలకి కొదువా. రండి పాతూరు స్మశానం దగ్గర, కాలువ ఒడ్డున వెదుకుదాం. ఎవరి శవమైనా దొరుకుతుందేమో? లేకపోతే నువ్వో, ఓంకారమో శవాలలా నటించి ఆ భుజంగరావు మీద పగ తీర్చుకోవచ్చు" అన్నాడు పరిశోధనరావు శ్రీకారాన్ని ఉద్దేశించి.

"బాబోయ్! మేము శవాలుగా ఆ భుజంగరావు ముందు కనబడితే మమ్మల్ని నిజం శవాలుగా చేసినా చేస్తాడు. అంతకన్నా శవాలకోసం వెతకటమే నయం" అన్నారు ముక్తకంఠంతో ఓంకారం, శ్రీకారంలు.

"అదీ, ఇప్పుడు డిటెక్టివ్ లనిపించారు. రండి, పాతూరు స్మశానానికి" అని వారిని తీసుకొని కదిలాడు పరిశోధనరావు.

ఎంత వెతికినా ఒక్క శవం కూడా కనిపించలేదు. తిరిగి వచ్చేస్తుంటే తుప్పల్లో ఒక శవం కనిపించింది. ఆనందంతో పొలికేకపెట్టి నాలిక్కరుచుకున్నాడు పరిశోధనరావు.

టార్చిలైటు వెలుతుర్లో చూసేసరికి ఆ చనిపోయింది

గోపాలరావు తండ్రి ప్రసాదరావుగారే. అనుమానం తీరక జేబులో వున్న ఫోటోతో పోల్చి చూసుకొన్నాడు పరిశోధన రావు. కరెక్టే! అతను ప్రసాదరావే.

పొద్దున వాళ్ళు వెళ్ళాక వచ్చిన కేసు గురించి విపులంగా చెప్పి, తన ప్లాను కూడా చెప్పాడు వారికి పరిశోధన రావు.

ఆ శవాన్ని జాగ్రత్తగా చూస్తుండమని శ్రీకారానికి, ఓంకారానికి చెప్పి తాను సంచి తీసుకొని రావటానికి వెళ్ళాడు పరిశోధనరావు.

కాసేపటికి సంచితో తిరిగివచ్చాడు పరిశోధనరావు. ముగ్గురూ ఆ శవాన్ని సంచిలో పెట్టారు.

"ఎవరు కన్నారో, యెవరు చంపారో కాని ఈ శవం మనని చంపుతోంది" అన్నాడు శ్రీకారం.

"మనని కాదు చంపేది. ఈ శవాన్ని ఈ సంచిలో తీసుకొని వెళ్ళి ఆ భుజంగరావువాళ్ళ పెరట్లో పారేసి, పోలీసులకి ఒక ఫోను కొడితే నా సామిరంగా, అప్పుడు తెలుస్తుంది భుజంగరావుకి డిటెక్టివ్ అంటే" అన్నాడు పరిశోధనరావు.

ముగ్గురూ బస్తాని మోసికొచ్చి కార్లో పెట్టారు. పదినిముషాలలో కారు భుజంగరావు ఇంటి పెరటివైపున ఆగింది. మళ్ళీ ముగ్గురూ సాయంపట్టి ఆ శవం వున్న సంచిని భుజంగరావు పెరట్లో పడేసి, కారెక్కి వెళ్ళిపోయారు పరిశోధనరావు, ఓంకారం, శ్రీకారంలు.

తిన్నగా వెళ్ళి పోలీస్‌స్టేషనుకి ఎస్సై ముకుందరావుతో చెప్పారు శవం సంగతి.

"మీకెలా తెలుసు" అని ఎదురుప్రశ్నించాడు యిన్‌స్పెక్టర్ శశికాంత్.

"మేము కేసులేం లేక రోడ్లమీద అలా గాలికి తిరుగుతూ వుంటే, భుజంగరావు యింటిముందు కారాగింది. ఒక మూటని లోపలికి తీసుకొనిపోయారు. అది శవమేమో అన్న అనుమానంతో, డిటెక్టివ్‌లము కనుక ఆగలేక మీకు చెప్పాం" అని వివరించాడు పరిశోధనరావు.

ఇన్‌స్పెక్టర్ శశికాంత్, ఎస్.ఐ. ముకుందరావు మరి కొద్దిమంది కానిస్టేబుల్స్ ఒక జీపులోనూ, పరిశోధనరావు, ఓంకారం, శ్రీకారంలు పరిశోధనరావు కార్లోనూ, భుజంగరావు వాళ్ళింటికి బయలుదేరారు.

భుజంగరావు వాళ్ళ ఇంటిలోపలా, బయటా క్షుణ్ణంగా పరిశీలించారు పోలీసులు. ఎక్కడా శవంకాదు గదా, శవం తాలూకూ బస్తా కూడా దొరకలేదు. భుజంగరావుని 'క్షమించమని' అడిగి పరిశోధనరావుని కొరకొరా చూస్తూ వెళ్ళిపోయారు ఇన్‌స్పెక్టర్ శశికాంత్, ఎస్.ఐ. ముకుందరావు. తతిమ్మా పోలీసులు అనుసరించారు.

పరిశోధనరావుకేసి వికటంగా చూస్తూ విచిత్రంగా నవ్వాడు భుజంగరావు. దీలాపడిన మొహంతో కారెక్కాడు పరిశోధనరావు. ఓంకారం, శ్రీకారంలు అనుసరించారు. ముగ్గురికీ శవం ఏమయిపోయిందో బోధపడలేదు. ముందుగా చూపి శవాన్ని మాయం చేశాడేమో భుజంగరావు అన్న అనుమానం వచ్చింది పరిశోధనరావుకి.

5

ఆఫీస్‌కొచ్చిన పరిశోధనరావు బృందానికి ఆశ్చర్యంతో మతిపోయింది.

గుమ్మానికి కడ్డుగా భుజంగరావు యింటిదగ్గర తాము వదిలేసిన ప్రసాదరావు శవం వుంది. ఎవరన్నా చూశారేమోనని అటూ యిటూ చూశారు. నయం ఎవరూ చూడలేదు.

ఈలోపల ఓంకారం తాళం తీశాడు. శ్రీకారం. పరిశోధన రావు సాయం పట్టి ముందు శవాన్ని లోపల పడేసి లోపల తలుపు లేసుకొన్నారు.

"తస్సా చెక్కా! ఆ భుజంగరావుది బుర్రా లేక పాద రసమా, ఏ శవాన్నయితే వాడిమీదికి గెంటామో, మళ్ళీ ఆ శవాన్నే మనమీద ప్రయోగించాడు" అన్నాడు ఓంకారం.

"వదులుతాడు వదులుతాడు. వాడిని నే నంత తేలిగ్గా వదలను" అన్నాడు తర్వాతి ప్లాను గురించి ఆలోచిస్తూ పరిశోధనరావు.

"ఇంకెంతసేపాలోచిస్తారు సార్ ఆ ప్లాను. అవతల భుజంగరావుగాడు పోలీసులకి ఫోను చేసి వుంటాడు ప్రసాదరావు శవం యిక్కడుందని" అని గుర్తుచేశాడు శ్రీకారం.

"నిజమే, చేసినా చేస్తాడు" అని కంగారుపడిపోయాడు ఓంకారం.

"ఈ ప్రసాదరావు శవాన్ని మీరు తీసుకొనివెళ్ళి ప్రసాద రావు వాళ్ళ ఆఫీస్‌లో పడేయండి. నేను మిగిలింది చూస్తా...." నన్నాడు పరిశోధనరావు, ఒక నిర్ణయానికి వస్తూ.

హత్యానేరం మీదపడుతుందన్న భయంతో శవాన్ని తీసుకొని అక్కడ నుండి కదిలారు — ఓంకారం, శ్రీకారంలు.

పరిశోధనరావు ఫోనుతీసి గోపాలరావుతో "మీరు చెప్పినట్టే మీ నాన్నగారిని కనుక్కొన్నాను. కాని బ్యాడ్ లక్. మీ నాన్నగారిని సజీవంగా కనుక్కోలేకపోయాను. వెంటనే మీ ఆఫీస్‌కి రండి. మీ నాన్నగారి శవాన్ని చూద్దురు గాని" అని ఫోను పెట్టేశాడు.

భుజంగరావుకి తరువాత గొంతు మార్చి ఫోను చేశాడు పరిశోధనరావు.

"భుజంగరావుగారూ, నేను ప్రసాదరావుగారి కుమారుడు గోపాలరావుని మాట్లాడుతున్నాను. మా నాన్నగారిని మీరు షేర్లు అమ్మమన్నారట కదా. మా నాన్నగారి తరపున నేను మీకు అమ్ముతాను. నా ఆఫీస్‌కి రండి" అని ఫోన్ పెట్టేశాడు పరిశోధనరావు.

"ఒరే భుజంగరావు! ఇప్పుడెక్కడికి పోతావురా బడా చోర్. నీ పీక నా చేతిలో చిక్కింది" అని మళ్ళీ పోలీస్‌లను తీసుకొని ప్రసాదరావు వాళ్ళ ఆఫీస్‌కి చేరుకొన్నాడు పరిశోధనరావు.

అప్పటికే ప్రసాదరావు శవాన్ని అక్కడ పడేసి దిక్కులు చూస్తూ నిలబడి వున్నారు ఓంకారం, శ్రీకారంలు. గోపాలరావు కాని, భుజంగరావు కాని ఎవరూ కనిపించలేదు.

ప్రసాదరావు శవంను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

అప్పుడు తట్టింది యిక్కడ జరగవలసిన రభస భుజంగరావు వాళ్ళింట్లో జరగవచ్చునని. వెంటనే పరిశోధనరావు పోలీస్‌లని తీసుకొని భుజంగరావువాళ్ళింటికిబయలుదేరాడు.

పోలీస్ జీప్‌ని ఆ వీధిచివర ఆపించేశాడు పరిశోధనరావు. శబ్దం కాకుండా నడుస్తూ అందరూ భుజంగరావు వాళ్ళింటికి చేరుకొన్నారు. అప్పటికే లోపల ఘర్షణ జరుగుతోంది. అరుపులు వినబడుతున్నాయి. పోలీసులు శ్రద్ధగావిన్నారు.

"అవును. మీ నాన్నని చంపింది నేనే. ఏం చేస్తావు? కాస్త లాభం రాగానే షేర్లు అమ్మనంటాడా! అసలా షేర్లు నావే కదా. అయినా నువ్వు నాకు షేర్లు అమ్ముతానన్నావని

బయలుదేరుతున్నాను యిప్పుడు నేను" అన్నాడు భుజంగ రావు.

"నేనూ అందుకే వచ్చాను. పరిశోధనరావు ఫోనుచేసి మీ నాన్నగారి శవం మీ ఆఫీస్‌లో వుంది అక్కడికి రమ్మని చెప్పారు. కాని నా అనుమానం నువ్వే చంపావని. అందుకే ఆఫీస్‌కి వెళ్ళకుండా మీ యింటికి వచ్చానురా" అని భుజంగరావుమీదికి దూకాడు గోపాలరావు.

ఇక ఆలస్యం చేయక పోలీస్‌లని తీసుకొని లోపలికి వురికాడు పరిశోధనరావు.

పోలీస్‌లని చూడగానే వెనక్కి తగ్గాడు గోపాలరావు. భయంతో వణకసాగాడు భుజంగరావు.

కాస్త పోలీస్ మర్యాద చవిచూశాక నిజం చెప్పాడు భుజంగరావు. "కాని ఆ శవాన్ని నేను కాలువ ఒడ్డున తుప్పల్లో పడేశాను. అది మళ్ళీ బయటికి ఎలా వచ్చింది" అన్నాడు భుజంగారావు.

"నిజమే. అది ఎలా వచ్చింది" అని ప్రశ్నార్థకంగా పరిశోధనరావుకేసి చూశాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

పరిశోధనరావు గొంతు సవరించుకొని భుజంగారావు తమను తిట్టి పోయింది మొదలు అంతా చెప్పాడు.

ఏమైనా అసలు హంతకుడిని పట్టించినందుకు ఇన్‌స్పెక్టర్ శశికాంత్, ఎస్.ఐ. ముకుందరావు, పరిశోధనరావు బృందాన్ని మెచ్చుకొన్నారు.

తరవాత యిన్‌స్పెక్టర్ శశికాంత్ దగ్గర, ఎస్.ఐ. ముకుందరావు దగ్గర, గోపాలరావు దగ్గర శలవు తీసుకొని భుజంగారావువైపు వికటంగా చూసి, విచిత్రంగా నవ్వి, బయటకు వచ్చాడు పరిశోధనరావు. ఓంకారం, శ్రీకారంలు అనుసరించారు పరిశోధనరావుని. □

సంకల్పబలం

వసుంధర

ఫోన్‌కోసం యెదురుచూస్తున్నాడు రామనాధం. క్షణం యుగంలా గడుస్తున్నదతడికి.

అది ఎయిర్‌కండిషన్డ్ గది. అయినప్పటికీ అతడికి చెమటలు పడుతున్నాయి. ఫోసీ అతడికి ఉక్కపోస్తున్నదా అంటే శరీరం సన్నగా వణుకుతున్నది.

అందుకు కారణం ...

అతడి చూపులు గడియారంపై వున్నవి. ఎలక్ట్రానిక్ వాచి....అంకెలు క్షణక్షణానికీ మారుతున్నవి. ఆ గడియారంలో అతడి శరీరానికి వణుకు తెప్పించి, చెమటలు పట్టించే విశేషమున్నదనుకునేందుకు లేదు.

అతడి మనసు ....

మనసులో సుబ్రహ్మణ్యం వున్నాడు. అంటే సుబ్రహ్మణ్యం గురించి ఆలోచనలు. సుబ్రహ్మణ్యం అతడికి స్నేహితుడు. కానీ యిటీవల వారి స్నేహం దెబ్బతిన్నది.

సుబ్రహ్మణ్యం మంచి వ్యవహారవేత్త. ఏదో కంపెనీలో వుద్యోగం చేస్తున్న అతడి వ్యవహార దక్షతను చూసి ముచ్చటపడి తన వ్యాపారంలో పదిపైసల వాటా ఇచ్చి తీసుకుని వచ్చాడు రామనాథం. అయితే అసలు కారణం సుబ్రహ్మణ్యానికి చెప్పలేదు.

రామనాథం వ్యాపారం కుంటినడక నడుస్తున్నది. ఆయనకసలే లక్షతొంభై వ్యవహారాలు. ఆయన యింట్లో రహస్యపు గది కూడా వున్నది. ఆ విషయం ఆయన భార్యకే తెలియదు. ఆ రహస్యపు గదిలో ఆయన తనవంటి వారితో సమావేశాలు జరుపుతాడు. ఊళ్ళో స్మగ్లింగు వ్యవహారాల్లో రామనాథానికి ప్రధాన పాత్ర వున్నది.

రామనాథం ఆర్జన అంతా స్మగ్లింగ్ వ్యవహారాలమీంచే! ఆ కారణంగా ఆయన ఊళ్ళో తనకున్న బట్టల దుకాణాన్ని చెరకుమిల్లునీ నిర్లక్ష్యం చేశాడు. వాటిమీద లాభాలు అంతంతమాత్రంగా వున్నవి.

రామనాథానికి వచ్చిన సమస్య ఏమిటంటే తను స్మగ్లింగ్ వ్యవహారాల్లో సంపాదించిన డబ్బును ఖర్చు పెట్టుకోగలగాలి!

ఇన్ కంటాక్స్ శాఖవా రతడిమీద ఓ కన్ను వేసి వుంచారు.

రామనాథం ఓ కొత్త మేడ కట్టాలనుకుంటే డబ్బు యెక్కడిదీ అని వారు ఆరాతీస్తారు. ఆ డబ్బు తన వ్యాపారంమీంచి వస్తున్నట్టు చూపిద్దామంటే అవి కుంటి నడక నడుస్తున్నాయి.

అందుకే అతడికి సుబ్రహ్మాణ్యం అవసరం పడింది.

సుబ్రహ్మణ్యం వ్యాపారాన్ని ప్రారంభించలేదు గానీ నడపడంలో సిద్ధహస్తుడు. అతడికి తనమీద ఇంతా అంతా అనలేని నమ్మకమూ వున్నది.

రామనాథం సుబ్రహ్మణ్యాన్ని కలుసుకుని—"మనం చిన్ననాటి స్నేహితులం. ఆ స్నేహాన్ని పునరుద్ధరించాలని వచ్చాను. నువ్విలా ఎవరికిందనో వుద్యోగం చేయడం నా కిష్టంలేదు. నాతోకలిసి వ్యాపారం ఎందుకుచేయకూడదూ?" అన్నాడు.

"నా దగ్గర డబ్బు చాలదు—" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"పెట్టుబడి వద్దు. అంతా నాదే! అలాగని నీకు జీతమూ యివ్వలేను. పదిపైసల వాటా తీసుకో—అదే నీ జీతం అనుకున్నా సరే—లాభం అనుకున్నా సరే...."

సుబ్రహ్మణ్యానికి కంపెనీ వుద్యోగం బోరుగా వున్నది. స్నేహితుడు ఆప్యాయంగా పిలుస్తున్నాడుగదా అని అతడు వెళ్ళాడు. వ్యవహారాలు ఎంత అస్తవ్యస్తంగా వున్నాయో చూశాడు. మొత్తం వ్యవహారాన్ని సరిదిద్దడానికి అతడికి ఒక్క నెల్లాళ్ళు సరిపోయింది. ఆ తర్వాత.... మొదటి సంవత్సరమే అతడు మంచి లాభాలు తీశాడు.

అది రామనాథానికి ఎంతో పీలుగా తోచింది.

సుబ్రహ్మణ్యం పనివాళ్ళ కష్టసుఖాలను అవగాహనతో విచారించేవాడు. అతడి యాజమాన్యంలో వారి జీతాలు మెరుగయ్యాయి; పరిస్థితులు బాగుపడ్డాయి. అతడిమీద వారందరికీ యెంతో గౌరవం. అతణ్ణి వాళ్ళో దేవుడిలా చూసుకుంటున్నారు.

నాలుగైదు సంవత్సరాల్లో రామనాథం వ్యాపారం అక్కడ బాగా విస్తరించింది. ఆయన పేరున నాలుగంతస్తుల డిపార్టుమెంటల్ స్టోర్స్ వెలసింది. చెరకుమిల్లుతో పాటు, రిఫైండ్ ఆయిల్ తయారీ చేసే మిల్లు కూడా ప్రారంభించబడింది.

సుబ్రహ్మణ్యం పదిపైసల వాటా తీసుకుంటూనే లక్షలు లక్షలు గడిస్తున్నాడు. అయితే వ్యాపార వ్యవహారా లన్నీ పకడ్బందీగా వుండేవి. ఆదాయం పన్ను తగ్గడానికీ, మినహాయింపుకీ న్యాయమైన పద్ధతులెన్ని వున్నాయో అన్నీ అతడు అవలంబించి లాభాలు ఎక్కువ వచ్చేలా చేసేవాడు. అయితే ప్రభుత్వోద్యోగులెవరూ వేలెత్తి చూపలేని విధంగా నడిచేవి వ్యవహారాలు.

రామనాథం తెలివైనవాడు. సమర్థుడిని తన పనుల కుపయోగించుకొనడం మాత్రమే కాదు. ఆ సమర్థుడిని అదుపు చేయడమెలాగో కూడా ఆయనకు తెలుసు. సుబ్రహ్మణ్యాన్ని అన్ని వేళల్లోనూ కనిపెట్టుకుని వుండేందుకు ఆయన గిరీశాన్ని నియమించాడు.

గిరీశం యెప్పటికప్పుడు సుబ్రహ్మణ్యం గురించిన విశేషాలు రామనాథానికి తెలియజేస్తూండేవాడు.

రామనాథం గిరీశానికి ఒకేమాట చెప్పాడు—"ఏదో ఒకరోజున సుబ్రహ్మణ్యం స్థానం నీది—సుబ్రహ్మణ్యం నాకు శాశ్వతం కాదు—"

అయితే గిరీశానికి సుబ్రహ్మణ్యం నచ్చాడు. సుబ్రహ్మణ్యం యెంతయినా సమర్థుడు కావచ్చు కానీ గిరీశం రామనాథం ఏజంటు అనిమాత్రం అతడు గుర్తించలేక పోయాడు. అందువల్ల సుబ్రహ్మణ్యం గిరీశానికి అమాయకుడిలా అగుపిస్తాడు.

మొదటి నాలుగు సంవత్సరాలూ రామనాథానికీ సుబ్రహ్మణ్యానికీ ఎటువంటి సమస్యలూ రాలేదు. తన ఆర్జన పెరుగుతున్నకొద్దీ రామనాథానికి సంతోషంగానే ఉన్నది. కానీ—

సుబ్రహ్మణ్యం పనివాళ్ళను బాగా చూసుకుంటున్నాడు. వాళ్ళతణ్ణి దేవుడిలా చూస్తున్నారు. అందుకు కారణం సుబ్రహ్మణ్యం గొప్పతనం కాదు. రామనాథం డబ్బును అతడు పనివాళ్ళకు పంచిపెడుతున్నాడు. రామనాథం దగ్గర పనిచేసేవాళ్ళందరకూ మంచి బోనసులు—మిగతా యజమానులెవ్వరూ యివ్వలేనంత జీతం!

రామనాథం ఒకరోజున సుబ్రహ్మణ్యాన్ని పిలిచి— "పనివాళ్ళ విషయంలో నువ్వు కాస్త జాగ్రత్తగావుండాలి. వాళ్ళకు జీతాలు ఎక్కువగా వున్నాయి. ఈ ఏడాది బోనసు పెంచకు—" అన్నాడు

"ఆదాయం పెరిగినప్పుడు బోనసూ పెంచాలి—" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఒకసారి పెంచకుండా చూడు...." అన్నాడు రామనాథం.

"అలా చేయడంవల్ల లాభమేమిటి? డబ్బు ఇన్‌కంటాక్సు వాళ్ళు పట్టుకుపోతారు—" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"బోనసు యెక్కువ తీసుకున్నట్లు సంతకం పెట్టమను.

మనకు తోచింది యిద్దాం—" అన్నాడు రామరాధం.

"అందుకు వర్కర్సు ఒప్పుకోరు—"

"ఒప్పుకోనివాళ్ళను ఉద్యోగంలోంచి తీసేయ్. ఇష్ట మైనవాళ్ళే పని చేస్తారు. మనదగ్గర పని మానుకునే తెలివి తక్కువ దద్దమ్మ లుండరు...."

"సుబ్రహ్మణ్యం నవ్వి—"నేను అడుగు పెట్టినపుడు కంపెనీ ఏ స్థితిలో వున్నదో తెలుసా? ఇప్పుడు అంతకు వందరెట్లు మెరుగ్గా ఉన్నది. నువ్వు వర్కర్స్ జోలికి రాకు...." అన్నాడు.

"అంటే నా వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకునేం దుకు వీల్లేదా! నువ్వు నా మాట కూడా వినవా?" అన్నాడు రామనాధం.

"పనికొచ్చే సలహాలు చెబితే ఎన్నైనా వింటాను."

రామనాధం అప్పటికి వెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యం పలుకుబడి ఊళ్ళో తనకు మించి పెరిగిపోతున్నది. అదాయ నకు బాధగా వున్నది. అందుకని సుబ్రహ్మణ్యాన్ని కంపెనీ నుంచి తొలగించాలనుకున్నాడు.

"చాలా పెద్ద గొడవై పోతుంది. వర్కర్సు కాయన దేవుడు. ఆయన జోలికి వెళ్ళకండి" అన్నాడు గిరీశం.

"ఏం చేయాలో" అని ఆలోచించాడు రామనాధం.

దొంగ అకౌంట్స్ రాపి లాభాలు పెంచమన్నాడు రామ నాధం. సుబ్రహ్మణ్యం ఒప్పుకోలేదు.

అతడి బలమంతా అతడి నైతిక ప్రవర్తనలో వున్న దని గ్రహించి సుబ్రహ్మణ్యాన్ని తనకు స్మగ్లింగులో పార్ట్నర్‌గా చేసుకోవాలనుకున్నాడు రామనాధం.

రామనాధానికి స్మగ్లింగ్ వ్యవహారాల్లో సంబంధమున్న దని తెలియగానే మండిపడ్డాడు సుబ్రహ్మణ్యం.

"నీకెంత కావాలో చెప్పు-అంతకు రెట్టింపు ఆర్జిస్తాను. కానీ యిలా అండర్ గ్రౌండ్ వ్యవహారాలలో సంబంధం పెట్టుకోవద్దు. నీకు సరిగ్గా ఆర్నెల్లు టైమిస్తున్నాను. నువ్వు నీ దుష్టవ్యవహారాలన్నింటికీ స్వస్తి చెప్పు...." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఆర్నెల్లు టైము దేనికి?" అన్నాడు రామనాధం.

"నీ బ్రతుకు బయటపెట్టడానికి...."

రామనాధం ముందు ఉలిక్కిపడ్డాడు. తర్వాత ఆయన క్కలిగిన ఆశ్చర్య మింతా అంతా కాదు. ఆపైన కోపం వచ్చింది — "నేనూ నీకు ఆర్నెల్లు టైమిస్తున్నాను" అన్నాడు.

"దేనికీ?"

"నేను చెప్పినట్లు వినడానికి...."

"వినకపోతే....?"

"నువ్వీ భూమ్మీద వుండవు...."

సుబ్రహ్మణ్యం అదోలా నవ్వి "నీకు తెలియదేమో— నన్ను చంపినా చావను. అనుకున్న పని పూర్తి చేసేవరకూ నన్ను చావు కూడా ఏమీ చేయలేదు" అన్నాడు.

"సవాలు వద్దు. బ్రతకడం విషయం ఆలోచించు" అన్నాడు రామనాధం.

"వెధవాలోచనలు వంటికి మంచిది కాదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఆ తర్వాత మిత్రు లిద్దరూ కలిసి మాట్లాడుకోలేదు.

టైము గడిచిపోతోంది నెలలు తిరిగిపోతున్నాయి.

ఒకరోజు ఉదయం సుబ్రహ్మణ్యం రామనాధానికి ఫోన్ చేశాడు.

"ఇంక సరిగ్గా వారంరోజులు గడువు. నీ దారి మార్చుకో-లేదా నీ బ్రతుకు రోడ్డున పడుతుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఓహో గడువు సంగతి గుర్తుందన్నమాట నీకు...."

అని ఫోన్ పెట్టేశాడు రామనాథం. ఆఫ్టరాల్ సుబ్రహ్మణ్యం.....

ఆయన వెంటనే ఓ కాగితం తీశాడు. ఓ గంటసేపు ఏమో రాశాడు. తర్వాత సుబ్రహ్మణ్యానికి ఫోన్ చేసి "ఓ సారిలా వస్తావా?" అనడిగాడు.

సుబ్రహ్మణ్యం వచ్చాడు. ఆప్యాయంగా రామనాథాన్ని పలకరించి "నీ మనసు మారిందా?" అనడిగాడు.

"ఈ రోజు తేదీ యెంత?" అనడిగాడు రామనాథం.

"సెప్టెంబరు 8" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఈ కాగితం చూడు" అన్నాడు రామనాథం.

సుబ్రహ్మణ్యం ఆ కాగితం తీసుకున్నాడు. దానిమీద సెప్టెంబరు 15వ తేదీ వ్రాసివుంది. ఆ కాగితంలోని వివరాలు....

సుబ్రహ్మణ్యం రామనాథం వంక ఆశ్చర్యంగా చూశాడు.

అది సుబ్రహ్మణ్యం మరణం కారణంగా ఏర్పాటు చేసిన సంతాప సభకు రామనాథం తయారుచేసుకున్న ఉపన్యాసం.

"సిద్ధంగా వున్నావు కదా!" అన్నాడు రామనాథం.

"నువ్వూ సిద్ధంగా వుండు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుబ్రహ్మణ్యం వెళ్ళిపోగానే రామనాథం సోముకు కబురుపెట్టాడు.

సోము హంతకుడు. అనుకున్న టైముకు అనుకున్న

విధంగా హత్యలు చేయడంలోనూ-పట్టుబడని విధంగా పథకాలు వేయడంలోనూ అతడు సమర్థుడు. ఇంతవరకూ అతడు ఎన్ని హత్యలు చేశాడో లెక్కలేదు. కానీ ఒక్క సారి కూడా అతడి పేరు పోలీసు రికార్డులోకి కూడా వెళ్ళడం సంభవించలేదు.

సోము చార్జి ఎక్కువ. మనిషిని తిరుగులేకుండా చంపాలంటే సోము ఒక్కడే సాధనం. అందులోనూ సుబ్రహ్మణ్యంలాంటి వాడిని....

సోము చార్జి ఎంత ఎక్కువైనా అది రామనాధానికి ఎక్కువ కాదు.

రామనాధం సోముకు డ్యూటీ యిచ్చాడు.

సెప్టెంబరు 14 రాత్రి పది గంటలకు సుబ్రహ్మణ్యం చావుకు ముహూర్తం పెట్టాడు రామనాధం. హత్య జరిగి సుబ్రహ్మణ్యం చావగానే రామనాధానికి సోము ఫోన్‌చేసి విషయం కోడ్‌లో చెబుతాడు....

ప్రస్తుతం ఫోన్‌కోసం ఎదురు చూస్తున్నాడు రామనాధం. క్షణం యుగంలా గడుస్తున్నదతడికి.

అది ఎయిర్ కండిషన్డు గది. అయినప్పటికీ అతడికి చెమటలు పడుతున్నాయి. పోనీ అతడికి ఉక్క పోస్తున్నదా అంటే శరీరం సన్నగా వణుకుతున్నది.

అప్పుడు బల్లమీద టెలిఫోన్ మోగింది....

రామనాధం కంగారుగా ఫోన్ ఎత్తాడు.

"నేను....జంబునాధాన్ని మాట్లాడుతున్నాను....కుమారస్వామి నిద్రపోతున్నాడు. అంతా అనుకున్నట్లే జరిగింది."

రామనాధానికి నోట మాట రాలేదు.

తానెన్నో ఘోరాలు చేశాడు. ఎప్పుడూ ఆయన చలించలేదు. కాని సుబ్రహ్మణ్యం హత్య జరిగిందని

తెలియగానే ఏదో తెలియని భయం ఆయన శరీరాన్నావ హించింది. ఫోన్లో ఏదో చెబుదామనుకుని చెప్పలేక "ఊఁ" అన్నాడు.

"నేను ఫోన్ పెట్టేస్తున్నాను...."

అవతల క్లిక్మనగానే రామనాథం రిసీవర్ క్రెడిల్ చేశాడు.

2

ఫోన్ సోము చేశాడు. అతడు సుబ్రహ్మణ్యాన్ని చంపేశాడు. తాము ఏ కోడ్ వర్డ్స్ ఉపయోగించాలను కున్నారో అవి ఉపయోగించాడు సోము.

అంటే అంతా దిగ్విజయంగా కొనసాగిపోయిందన్న మాట!

పాపం—సుబ్రహ్మణ్యం!

హాయిగా తన మానాన తను బ్రతుకుతున్న వాడిని బ్రతకనివ్వక వ్యాపారంలోకి తీసుకొచ్చాడు తను. తన వ్యాపారాన్ని చాలా గొప్పగా వృద్ధిచేశాడు సుబ్రహ్మణ్యం.

ఇప్పుడు సుబ్రహ్మణ్యం పోయినా ఫరవాలేదు. గిరీశం సుబ్రహ్మణ్యం అంతటి వాడయ్యాడు. అంతేకాదు—గిరీశం రామనాథం చెప్పినట్లు వింటాడు.

సుబ్రహ్మణ్యం చచ్చిపోయాడంటే నమ్మడానికింకా కష్టంగా వున్నది. వ్యాపారంలో పదిపైసల వాటాలోనే అతడూ బాగా సొమ్ము చేసుకున్నాడు. తన జాగ్రత్త అత డికి బాగా తెలుసు. అదృష్టమల్లా అతడు తన సవాలును సీరియస్గా తీసుకోలేదు. తను నిజంగా సుబ్రహ్మణ్యాన్ని చంపదల్చుకున్నట్లు అతడూహించలేదు.

సోము పకడ్బందీగా పథకం వేశాడు. సుబ్రహ్మణ్యాన్ని చంపాడు.

సుబ్రహ్మణ్యం చావుతో తనకు పెద్ద గండం గడిచింది.

సరిగ్గా అప్పుడే రామనాథం ఎదుటి బల్లమీద ఫోన్ మళ్ళీ మ్రోగింది.

రామనాథం తాపీగా ఫోన్ ఎత్తాడు.

"సార్.... నేను సోముని మాట్లాడుతున్నాను...."

ఆ గొంతులో కంగారు వుంది. అతడెప్పుడూ ఫోన్లో తన పేరు ఉపయోగించడు. ఉపయోగించాడంటే అతడికి మతి మతిలో లేదన్నమాట!

"ఏం—ఏం జరిగింది?"

"సార్ ...ప్రమాదం" అని అతడింకా ఏదో అనబోతూ కెవ్వున కేక వేశాడు. ఆ కేక సోముదే!

"సోమూ—ఏమయింది!"

అవతల ఫోన్ క్లిక్‌మంది.

మళ్ళీ రామనాథం శరీరంలో వణుకు ప్రారంభమయింది. ఏమయింది సోముకి! సోము ఎప్పుడూ అలా కేక వేసే మనిషి కాడు. అది మామూలు కేకలా లేదు. చావుకేకలా వుంది. అంటే సోము చచ్చిపోయాడా?

మళ్ళీ బల్లమీద ఫోన్ మ్రోగింది

రామనాథం భయంగా "హలో—నేను రామనాథాన్ని!" అన్నాడు.

"నేను గురు రాజారావుని" అంది అవతల కంఠం కంగారుగా.

గురు రాజారావు రామనాథం స్మగ్లింగ్ పార్ట్నర్. అతడెన్నడూ దేనికీ కంగారుపడడు. మొదటిసారి అతడి కంఠంలో కంగారు వింటున్నాడు రామనాథం.

"ఏం జరిగింది?"

"సోము చచ్చిపోయాడు...."

"ఎలా జరిగింది?"

"సోము హత్య చేయబడ్డాడు ..."

"హత్యా?"

"అవును—సోము హత్య చేయబడ్డాడు. అతడి శవం పబ్లిక్ టెలిఫోన్ బూత్ వద్ద పడి వున్నట్లు పోలీసులకు ఫోను అందిందట. వాళ్ళు శవాన్ని స్వాధీనపర్చుకున్నారు. ఈ విషయం ఇప్పుడే తెలిసింది నాకు."

"సోము—హత్య చేయబడడమా?" రామనాధం ఇంకా నమ్మలేక పోతున్నాడు.

"వీపుమీద రెండు ....గుండెల్లో ఒకటి .... మొత్తం మూడు కత్తిపోట్లు. చాలా బలమైన మనిషి చేసి వుండాలి హత్య."

సోము....హత్య చేయబడడమా?" రామనాధానికి మరో మాట రావడంలేదు.

"అదిప్పుడు గతం. ప్రస్తుతం ఏం చేయాలో అని ఆలోచించాలి. అతడికి మనం చాలా పనులు అప్పగించాం. ఆ వివరాలన్నీ వా డెక్కడైనా రాసిపెట్టుకుని వుంటే ప్రమాదం. నేను వాడింటికి మన మనుషుల్ని పంపించాను. నీక్కూడా ఏమైనా వివరాలు తెలిస్తే నీ జాగ్రత్తలో వుండు...." అవతల ఫోన్ క్లిక్‌మంది.

రామనాధం ఫోన్ పెట్టేసి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

సోము హత్య చేయబడ్డాడనడం కంటె....సోమును ఎవరు హత్య చేశారూ అన్న విశేషం అతడిని ఆశ్చర్య పరుస్తున్నది.

సోమును ఎవరు హత్యచేశారు? ఎందుకు చేశారు?

సుబ్రహ్మణ్యం తన గురించి ఏ విధమైన వ్యతిరేక సమాచారం సంపాదించినా అవన్నీ సంపాదించి తీసుకుని

రమ్మన్నాడు సోముని. ఆ పని పూర్తి చేసుకుని వస్తూండగా అతడికి ప్రమాదం సంభవించిందా.

తనకు ఫోన్ చేసినప్పుడు సోము గొంతులో భయం వుంది. భయమన్నది అతడెరుగడు. అతడెందుకు భయపడ్డాడు?

సోము దగ్గర తనకు సంపాదించిన కాగితాలేమైనా వున్నాయా? ఆ కాగితాలెవరి చేతులోనైనా చిక్కుకున్నాయా?

ఈ విషయం తన కెలా తెలుస్తుంది....

రామనాథం టైము చూసుకున్నాడు. పదకొండయింది.

తనిప్పుడేం చేయాలి? సోము దగ్గర్నుంచి ఆ కాగితాలనెవరైనా దొంగిలిస్తే తాత్కాలికంగా తనకు సమస్య వుండదు. ఆ వ్యక్తి తన్ను బ్లాక్ మెయిల్ చేయవచ్చు. అప్పుడు తన తంటాలు తను పడతాడు. అసలు ఇబ్బంది ఆ కాగితాలు సోము దగ్గిరే వుండిపోతే వస్తుంది. ఆ కాగితాలు పోలీసుల చేతిలో పడతాయి.

సోమును ఎవరు హత్యచేశారు? హత్య ఈ కాగితాల కోసమే జరిగిందా—లేక ఎవరైనా పాత పగతో అతణ్ని హత్య చేశారా?

పాత పగతో హత్యచేసి వుంటే మాత్రం తన పని అయిపోయింది. ఎందుకంటే హంతకుడు సోముని చంపేసి పారిపోయి వుంటాడు.

ఎవరా హంతకుడు?

తలుపుతీసిన చప్పుడయింది. చటుక్కున ఓ మనిషి లోపల ప్రవేశించాడు. హైడ్రాలిక్ డోర్ క్లోజర్ అతడి వెనుకనే మూసుకుంటున్నది.

రామనాథం అతణ్ణి చూశాడు.

మనిషి పొడుగ్గా వున్నాడు. లాంగ్ కోట్ వేసు కున్నాడు. తలమీద హేట్ వున్నది. హేట్ ముఖాన్ని కప్పుతున్నది.

"ఎవర్నువ్వు?" అన్నాడు రామనాథం. అతడి గొంతులో కంగారు వున్నది. ఆత్రుత వున్నది. భయం వున్నది. అన్నింటికీ మించి వణుకు వున్నది.

అతడు మాట్లాడలేదు. నెమ్మదిగా రామనాథాన్ని సమీ పిస్తున్నాడు.

"ఎవర్నువ్వు?" రామనాథం ఇంచుమించు అరిచాడు. కానీ ఆయన కుర్చీలోంచి లేవలేదు. భయంగా ఆ ఆగంత కుణ్నే చూస్తున్నాడు.

అతడు రామనాథాన్ని సమీపించి—హేట్ తీసి బల్లమీద పెట్టాడు.

"నువ్వా?" అన్నాడు రామనాథం.

3

"అవును—నేనే!" అంటూ కుర్చీలో కూర్చున్నాడు సుబ్రహ్మణ్యం.

రామనాథం అతడివంకే చూస్తున్నాడు.

సుబ్రహ్మణ్యం ఎలా బ్రతికి వచ్చాడు?

సోము పొరపాట్లు చేయడు. పొరపాటు చేసినా వెంటనే సవరించుకుంటాడు. అతడు తనకు ఫోన్ చేశాడంటే అర్థం అన్నీ సక్రమంగా జరిగిపోయాయని!

మరి ఇప్పుడు సుబ్రహ్మణ్యం ఎక్కణ్నించి ఊడి పడ్డాడు?

"సార్—ప్రమాదం" అన్న సోము మాటా—ఆపైన అతడి ఆర్తనాదమూ రామనాథం చెవుల్లో గింగురు మన్నాయి.

"ఎలా వచ్చావిక్కడికి?" అన్నాడు రామనాథం.

"సోముని చంపి ..."

"సోము నెందుకు చంపావు?" అన్నాడు రామనాథం.

"నువ్వు సోముని పంపావు. నేను వాణ్ని చంపాను."

"వాడు నిన్ను చంపలేదా?"

"చంపేదో లేదో నన్ను చూస్తే తెలియడం లేదా? నేను నీకంటే సమర్థుణ్ని. ఆ విషయం నీకు తెలియక నా హెచ్చరికను పెడచెవిని పెట్టావు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇప్పుడిక్కడికి ఎందుకు వచ్చావు?"

"ఎందుకా?" నవ్వాడు సుబ్రహ్మణ్యం "సెప్టెంబరు 17 కింకా గంటలోపే టైముంది. ఆ టైమును నీవు సద్వినియోగం చేసుకుంటావనీ—నీలో మార్పు వస్తుందనీ ఆశతో వచ్చాను. నా ఆశ నిరాశ చేశావా—నువ్వు అనుభవిస్తావు!"

"సుబ్రహ్మణ్యం!" అన్నాడు రామనాథం కోపంగా-"నువ్వు సమర్థుడివన్న విషయం నాకూ తెలుసు. కానీ నన్నే ఎదిరించి నెగ్గగల స్థాయికింకా ఎదగలేదని గుర్తుంచుకో. నన్ను మార్చాలని కాక నువ్వు మారాలనుకుంటే బాగుపడతావు. నీ సమర్థతకు సార్థకత లభిస్తుంది. లేదూ—వున్న సామర్థ్యం చూపించుకునే అవకాశంకూడా వుండదు."

"నువ్వింక మారవు" అని నిట్టూర్చాడు సుబ్రహ్మణ్యం- "నీకెలా రాసిపెట్టి వుంటే అలా జరుగుతుంది. ఎవరి కర్మకు ఎవరు కర్తలు!"

"కబుర్లు తర్వాత. నువ్వు సోమునుంచి ఎలా తప్పించుకున్నావో చెప్పు!" అన్నాడు రామనాథం.

"ఏమిటో ఆ నమ్మకం. సోమునించి ఎవరూ తప్పించుకో

లేరా?"

రామనాథం నవ్వి "సోము సంగతి నీకు తెలియదు. అందుకే అలా మాట్లాడుతున్నావు. నేను నిన్ను ఈరోజు రాత్రి పది గంటలకు చంపడానికి ముహూర్తం పెట్టి అందుకు సోముని నియోగించాను. ఈ రోజంతా అతడు నిన్ను నీడలా వెంటాడాడు. నీ రొటీన్లో ఏ విధమైన మార్పు లేదు. ఎలాంటి పరిస్థితుల్లోనూ నువ్వు రాత్రి ఎనిమిదయ్యే సరికి మంచంమీద వాలతావు. ఈ రోజు మీ యింట్లో అందరికీ భోజనంలో నిద్రమాత్రలు కలిశాయి. ఇంటిల్లిపాదీ పడుకున్నాక మళ్ళీ తెల్లారేదాకా లేవలేరు. రాత్రి పదింటికి సోము మీ యింటికి వచ్చాడు. గాఢ నిద్రలో వున్న నిన్ను కత్తిపోటుతో చంపాడు. ఆ విషయం నాకు ఫోన్ చేసి చెప్పాడు" అన్నాడు.

"వాడు చంపాననుకున్నాడు" అని సుబ్రహ్మణ్యం నవ్వి "నా యింట్లో నిద్రమాత్రలు కలపగలిగినవాడు—నా భోజనంలో ఇంత విషం కలపలేకపోయాడా?" అన్నాడు.

"నిద్రమాత్రలు, విషం—ఇలాంటివి హత్యకుపయోగించడం సోము కిష్టం వుండదు. హత్యచేస్తే రక్తం చిందాలి—అదీ అతడి సరదా!"

"అందుకే నేనూ వాణ్ణి అలాగే చంపాను" అని నవ్వాడు సుబ్రహ్మణ్యం.

"అవును. వాడు నిన్ను చంపలేదా? సోము కత్తిపోటు తిన్నాక ఎవ్వడూ బ్రతకడు. అయినా వాడు నీ ఊపిరి ఆగేదాకా ఎదురుచూపి అప్పుడే బయటకు వస్తాడు. నువ్వు వాడి కత్తిపోటుకు ఎదురు నిలిచావంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది."

"నా సంగతి తర్వాత చెబుతాను. నేనిక్కడికెలా

వచ్చానో తెలిస్తే నీ గుండె ఆగిపోతుంది. కానీ ఒక్క మాట! చిన్ననాటి స్నేహాన్ని పురస్కరించుకుని నన్ను రమ్మన్నావు. వచ్చాను. ఇప్పుడు నన్ను చంపాలను కున్నావు. ఎందుకు;"

"ఎందుకా?" గర్జించాడు రామనాథం. ఒకరి మోచేతి కింద నీళ్ళుతాగే నిన్ను నా కంపెనీకి యజమానిగా మార్చాను. కానీ నీకు నాకంటే పనివాళ్ళే ఎక్కు వయ్యారు. వాళ్ళ జీతాలు పెంచవద్దంటే వినవు. తప్పుడు లెక్కలు వ్రాయమంటే వినవు. ఇన్‌కంటాక్స్ డిపార్టు మెంటుని మోసం చేద్దామంటే వినవు. పోనీ అని నిన్నూ నా స్మగ్లింగ్‌లోకి లాగాలనుకున్నాను. అదీ వినలేదు నువ్వు. పైగా నా బ్రతుకు బైటపెడతానన్నావు. అందుకే నీకు బ్రతుకులేకుండా చేయాలనుకున్నాను. సోముని నియో గించాను. ఎవడినైనా తిరుగులేని విధంటు చంపాలనుకున్న ప్పుడే నేను సోమును నియోగిస్తాను. కానీ నువ్వు."

"ఒకసారి నీకు చెప్పాను. నేను చంపినా చావనని! అది విస్మరించి నా జోలికి వచ్చావు" అని ఓసారి చుట్టూ చూపి—"పన్నెండు కావడానికింక ఒక్కటే నిముష ముంది. ఆ నిముషం తర్వాత ఏం జరుగుతుందో తెలుసా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏం జరుగుతుంది?"

"నేను అన్ని ఏర్పాట్లూ చేసే వచ్చాను. సరిగ్గా పన్నెం డింటికి పోలీసులు ఈ గది తలుపులు తడతారు. వారిముందు నేను నీ బ్రతుకు బయలుపెడతాను...." అన్నాడు సుబ్ర హ్మణ్యం.

రామనాథం తన ఎలక్ట్రానిక్ వాచివంక చూశాడు.

పదకొండూ యాభై తొమ్మిది—ఇరవై సెకన్లు....

ఇరవై ఒకటి....ఇరవై రెండు....ఇరవై మూడు.... ఇరవై నాలుగు.

"నో!" అని అరిచాడు రామనాథం.

సుబ్రహ్మణ్యం గదంతా అదిరేలా నవ్వాడు.

రామనాథం లేచాడు. "నేను నిన్ను ఇక్కడే చంపేస్తాను!"

సుబ్రహ్మణ్యం తాపీగా "పోలీసులు తలుపు తట్టేసరికి హతుడు, హంతకుడు....ఇద్దరే వుంటారు. నువ్వు నన్ను చంపు. నేను ప్రతిఘటించను" అన్నాడు.

"ఏమిటి అతగాడి ధైర్యం?" అనుకున్నాడు రామనాథం. తానిప్పుడు సుబ్రహ్మణ్యాన్ని చంపితే. నిజంగా పోలీసులు వస్తే.

"నేనే ఆత్మహత్య చేసుకుంటాను" అన్నాడు రామనాథం.

"నాకు బ్రతుకు లేకుండా చేయాలనుకున్నావు. అందుకు నీకు బ్రతుకులేకుండా పోతోంది. రామనాథం. ఒక్క విషయం గుర్తుంచుకో! మనిషి పరుల కష్టార్జితంమీద మేడలు కట్టవచ్చు. తప్పులేదు. కానీ పరులను పునాది రాళ్ళుగా ఉపయోగించుకుని సమాధి చేస్తే మాత్రం వాళ్ళకు సెగతే పడుతుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

రామనాథం ఎలక్ట్రానిక్ వాచివంక చూసుకున్నాడు.

యాభై ఏడు....యాభై ఎనిమిది....యాభై తొమ్మిది.

అప్పుడే ఎవరో తలుపుతట్టారు. టక్ టక్ మని ఆగకుండా తలుపు బాదుతున్నారు.

"నో!" అని అరిచాడు రామనాథం.

"ఊరికే అరుస్తావేం? వెళ్ళి తలుపు తీయి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఏమనుకున్నాడో రామనాధం కదిలాడు.

వచ్చింది పోలీసులు కాదేమో! సుబ్రహ్మణ్యం తనను ఆట పట్టిస్తున్నాదేమో!

తను చెడ్డవాడు కావచ్చు కానీ సుబ్రహ్మణ్యం చెడ్డ వాడు కాలేడు. అతడు మంచివాడు. రామనాధంలో ఆశ ప్రారంభమైంది. సోము పొరపాటున ఎవరినో పొడిచాడు. వాడితాలూకు మనిషి సోముమీద ప్రతీకారం తీర్చుకున్నాడు.

ఆయన ఆలోచనలు పనిచేయకుండా తలుపు మ్రోగు తున్నది.

టక్ .... టక్ .... టక్.

రామనాధం తలుపు తీశాడు.

పోలీసులు!

రామనాధం వాళ్ళను లోపలకు రానివ్వకుండా తనే బయటకు వచ్చాడు.

"మాకు సమాచారం అందింది. సరిగ్గా పన్నెండు గంటలకు వెడితే మీ గదిలో ఓ శవం, ఆ శవం వంటిమీద మీకు వ్యతిరేకంగా సమాచారమూ దొరుకుతుందని" అంటూ పోలీస్ యిన్స్పెక్టరు తోసుకుని తనే లోపలకు వెళ్ళాడు.

"గదిలో శవం ఏమీలేదు" అన్నాడు రామనాధం. అతడి మాటల నెవ్వరూ వినిపించుకోలేదు. పోలీసులు బిలబిలా లోప లకు ప్రవేశించారు. వారి వెనుకనే లోపలకు ప్రవేశించిన రామనాధం అక్కడి దృశ్యం చూపి మ్రాన్పడిపోయాడు.

సుబ్రహ్మణ్యం వెల్లకిలా పడి వున్నాడు. పోలీసులు అతణ్ణి శోధిస్తున్నారు.

4

"ఏమయింది నా మిత్రుడికి?" అన్నాడు రామనాధం కంగారుగా.

"మీ మిత్రుడా! వాటే ఫైన్ పీసాఫ్ యాక్టింగ్" అన్నాడు యిన్‌స్పెక్టర్ — "ఈ శవం గదిలో ఎంతసేప ట్నించి వుంది."

పోలీసులతోపాటు వచ్చిన డాక్టరు—"ఖచ్చితంగా చెప్ప లేదు కానీ ఇతడు చనిపోయి సుమారు రెండు గంట లయుండవచ్చు" అన్నాడు.

రామనాథం తెల్లబోతూ — "ఇతడు మీరు తలుపుతట్టే వరకూ నాతో మాట్లాడుతున్నాడు" అన్నాడు.

"సార్! హతుడి జేబులో ఈ పాకెట్ టేపురికార్డర్ వున్నది. రెండు పొడవాటి కవర్లుకూడా వున్నవి" అన్నాడో కానిస్టేబుల్.

ఇన్‌స్పెక్టర్ ఆ టేపురికార్డరు అందుకొన్నాడు. అది బ్యాటరీతో పని చేస్తుంది. ఆన్‌చేశాడు....అందులో రామ నాథం నవ్వు వినిపించింది—"సోము సంగతి నీకు తెలి యదు. అందుకే అలా మాట్లాడుతున్నావు. నేను నిన్ను ఈ రోజు రాత్రి పది గంటలకు చంపడానికి ముహూర్తం పెట్టి అందుకు సోముని నియోగించాను ..."

ఇన్‌స్పెక్టర్ రామనాథం వంక చూసి "ఇది మీ గొంతు అనుకుంటాను...." అన్నాడు.

రామనాథం ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. సుబ్రహ్మణ్యం యెంత పని చేశాడు? కానీ యెలాచేశాడు.

టేపు నడుస్తున్నది—. విచిత్రమేమిటంటే అందులో రామనాథం మాటలు మాత్రమే వస్తున్నవి ...సుబ్రహ్మణ్యం మాటలులేవు. అతడు ఆ విధంగా టేపును ఆన్, ఆఫ్ చేస్తూండేవాడా?

"ఇన్‌స్పెక్టర్! సుబ్రహ్మణ్యాన్ని నేను చంపలేదు. కొద్దిక్షణాల క్రితం వరకూ మే మిద్దరం మాట్లాడుకుంటూనే

వున్నాం" అన్నాడు రామనాథం.

"అయితే ఒక్కసారి హతుణ్ణి చూడండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

హతుడి లాంగ్‌కోటు తొలగివున్నది. గుండెల్లో బలమైన కత్తిపోటు వున్నది. ఆ మేరంతా రక్తం గడ్డకట్టి వున్నది. హత్య జరిగి చాలా సేపైనదని ఎవరైనా చెప్పవచ్చు.

"కత్తిపోటు తినగానే హతుడు మరణించాడు. చాలా బలమైన పోటు అది" అన్నాడు పోలీసు డాక్టర్.

అంటే సుబ్రహ్మణ్యం సోముచేతిలో చచ్చాడు. కానీ అతడు తన సంకల్పబలంతో చచ్చేక కూడా అనుకున్న పని పూర్తిచేశాడు! అతడు మానవాతీతుడు కావడం వల్లనే సోమును చంపగలిగాడా?

రామనాథం ఎదురుగా జీవంలేని సుబ్రహ్మణ్య శవం! జీవంలేని-ఆ శవం సుబ్రహ్మణ్యం జీవితాశయాన్ని నెరవేర్చింది.

రామనాథం బ్రతుకంతా ఆ శవంలో వున్నది.

"నీ సామర్థ్యాన్ని తప్పు అంచనా వేశాను" అనుకున్నాడు రామనాథం. కానీ అతడు పైకి మాత్రం "నిజంగా ఇన్‌స్పెక్టర్....ఇతడితో నేను కొద్దిక్షణాల క్రితం వరకూ మాట్లాడాను. ఇతణ్ణి రెండుగంటల క్రితమే చంపించి వుంటే—అతడి ఇంటినుంచి శవం ఇక్కడికెలా వచ్చింది? నేను నా విశేషాన్ని ఇప్పటికిప్పుడు ఎందుకు రుజువు చేస్తాను? అయినా ఇలా నా రహస్యాలు రుజువు చేయించడానికి నేను వెర్రివాడినా? ఆలోచించండి....ఏదో తిరకాసు జరిగింది...."

"చూడండి సార్....ఈయనకూ మీకూ వున్న స్నేహం కారణంగా హత్య మీ మతిని చలింపజేసింది. అంతా మీ భ్రమ. హత్య ఇక్కడే ఈ గదిలోనే జరిగింది. మీరు శవంతో మాట్లాడుతున్నానన్నది అబద్ధమో, భ్రమో అయి వుండాలి..." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

శవం జేబులో దొరికిన కాగితాలు రామనాధంతోపాటు ఊళ్ళో చాలామంది పెద్దల బ్రతుకును బైటపెడుతున్నాయి.

కొద్ది రోజుల్లోనే వాళ్ళందరూ జైల్లో చెప్పే సందేశం- సమర్ధుడిని పనిలోకి తీసుకుంటే వాడిలో మంచితనం వుండకుండా చూసుకోవాలి. తప్పని పరిస్థితుల్లో అలాంటి వాడు మనలో కలిస్తే వాణ్ణి మామూలుగా వదుల్చుకోవాలి తప్పితే ప్రాణాలు మాత్రం తియ్యకూడదు. అలా చేస్తే వాళ్ళు పగతీరేదాకా ప్రాణాలు నిలుపుకోవడమో-మానవాతీత శక్తులుగా అసాధ్యాలను సాధ్యాలుగా చేయడమో చేస్తారు. చాలా ఆలస్యంగా నేను గ్రహించిన విశేషమిది!" □

సంపాదన మిష్టరీ!



కసాయి కత్తి

యం. దుర్గావళి

పోలీస్ వేన్ శరవేగంతో వచ్చి "అరవింద నిలయం" ముందు ఆగింది.

ఇన్‌స్పెక్టర్ శివస్వామి, ఆయన అనుచరులు, ఫింగర్ ప్రింటర్స్ తదితరులంతా దిగారు.

APANA 6

అప్పటికే అరవింద నిలయం ముందు జనం మూగి వున్నారు.

పోలీసుల్ని చూసి ఎవరికి వారే తొలగి దారి ఇచ్చారు.

ఇన్‌స్పెక్టర్ శివస్వామి కళ్ళు ఒక్కసారి ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి. తన సర్వీసులో ఎన్నో హత్యకేసులు చూశాడుగానీ, ఇంత దారుణంగా హత్యచేయబడ్డ శవాన్ని చూడటం యిదే మొదలు.

విశాలంగా వున్న చెక్కపెట్టెలో పద్దెనిమిది సంవత్స రాల యువతి తల, చేతులు, మొండెం ఏ భాగానికి ఆ భాగం నరికివేయబడి వుంది.

పక్కనే దాదాపు యాభై అరవై సంవత్సరాల మధ్య వయస్సుగల మనిషి, మరో స్త్రీ గోలగా ఏడుస్తున్నారు. చుట్టూ వున్నవాళ్ళు వారిని ఓదార్చటానికి ప్రయత్నిస్తు న్నారు.

మరుక్షణం శివస్వామి తన కర్తవ్య నిర్వహణలో మునిగిపోయాడు.

ఫింగర్‌ప్రింటర్స్ తమ పనులు చకచకా చేసుకుపోతు న్నారు. ఇద్దరు కానిస్టేబుల్స్ చెక్కపెట్టె కొలతలు తీసు కున్నారు డాక్టర్ తన డ్యూటీ నిర్వహిస్తున్నాడు.

మరో అరగంట తర్వాత శవాన్ని తరలించారు అతి కష్టంమీద.

అంతా హాల్లో సమావేశం అయ్యారు.

"మీ పేరు?" అన్నాడు స్వామి.

"ఈయన ప్రముఖ పారిశ్రామికవేత్త బాబూలాల్‌గారు. లక్షాధికారి. రెండు ఫాక్టరీలకు యజమాని. ఈ ఊరి మొత్తంమీద వీరిని ఎరగనివారంటూ లేరు" అన్నాడు పక్కనున్న బట్టతల వ్యక్తి.

"నేను రెండు రోజుల క్రితమే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాను ఈ ఏరియాకి. ఇంతకీ మీరెవరు?" అన్నాడు స్వామి.

"నేను.... నేను వారి ముఖ్యస్నేహితుడిని" అన్నాడు బట్టతలవ్యక్తి తెల్లపోతూ.

"చూడండి. ఈ హత్యతాలూకు వివరాలు మీకేమైనా తెల్సివుంటే తర్వాత చెబుదురుగాని. మేం ఎవరిని అడిగితే వారే జవాబు చెప్పాలి."

"అబ్బే ఈ హత్యను గురించి నాకేం తెలియదు. ఆయన అసలే కూతురుపోయిన దుఃఖంతో వున్నాడు కదాని...."

"అయినా తప్పదు. ఇది మా డ్యూటీ" అంటూ బాబూలాల్ వైపు తిరిగి ప్రశ్నించసాగాడు శివస్వామి.

"చూడండి బాబూలాల్‌గారూ. మీరు మీ అమ్మాయి పోయిన దుఃఖంలో వున్నారు. అయినా మాతో సహకరించి వివరాలు తెలియచేస్తే హంతకుడిని త్వరలోనే పట్టుకోగలం. చనిపోయిన అమ్మాయి మీకేమౌతుంది?"

"అరవింద నా కుమార్తె. అల్లారు ముద్దుగా పెంచుకున్నాను. దాన్నెవరో దారుణంగా" ఆపై ఇంక మాట్లాడలేకపోయాడు.

"మీకు ఎంతమంది పిల్లలు?" అన్నాడు వివరాలు నోట్ చేసుకుంటూ స్వామి.

"ఇద్దరు ఆడపిల్లలు. ఒకే మొగపిల్లాడు. అందరిలోకి అరవింద పెద్దది. త్వరలోనే వివాహం చేద్దాం అనుకున్నాను."

"మీరు ఆఖరుసారిగా అమ్మాయిని ఎప్పుడు చూశారు?"

"ఇవాళ నా షష్టిపూర్తి. ఉదయం అంతా అమ్మాయి

అందరితోపాటు ఇంట్లోనే వుంది. రాత్రి ఏడు గంటలకు నా ఫ్రెండ్స్ అందర్నీ డిన్నర్‌కి పిలిచాను. మధ్యాహ్నం అరవింద రెండుగంటలకు బైటకు వెళ్ళిపోతుంది. 'ఎక్కడికి' అని అడిగాను. 'మీరు మర్చిపోలేని మంచి బహుమతి ప్రజెంట్ చేస్తాను డాడీ' అంటూ వెళ్ళిపోయింది. అంతే, మళ్ళీ అమ్మాయిని ఈ విధంగా చూడాల్సి వస్తుందని అనుకోలేదు" అన్నాడు వెక్కి వెక్కి ఏడుస్తూ.

"ఆ పెట్టె ఎవరు తీసుకువచ్చారు?"

"అపుడే డిన్నర్ ముగిసింది. ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్నాను. ఇంతలో ఒక ఆటో సరాసరి లోపలికి వచ్చింది. డ్రైవరు "బాబులాల్‌గారికి అరవింద అమ్మగారు ఈ పెట్టె అప్పగించమన్నారు" అని చెప్పాడు. మా నౌకర్లు వెళ్ళి దాన్ని మోసుకొచ్చారు. డ్రైవరు వెంటనే వెళ్ళిపోయాడు."

"ఆటో నెంబరు చూశారా మీరు?" అన్నాడు స్వామి.

"లేదు. ఆ హడావిడిలో అమ్మాయి పంపిన బహుమతి ఏమైవుంటుందా అన్న ఆలోచన తప్ప నేను ఆ విషయమే గమనించలేదు."

"మరి ఆటో ఫేర్ చెల్లించలేదా?"

"లేదు. అది వాడికి ముందే ముట్టచెప్పివుంటారు. లేకపోతే డబ్బులుకోసం ఆగివుండేవాడేగా" అన్నాడు బాబూలాల్.

"ఆటో డ్రైవర్ని సరిగా చూశారా?"

"లేదు. సరిగ్గా చూడలేదు" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"అరవింద వయస్సెంత?" అన్నాడు స్వామి బాబూలాల్ వంక సూటిగా చూస్తూ.

"పద్దెమిది మొన్ననే వచ్చాయి."

"నేను ఇట్లా అడుగుతున్నందుకు ఏం అనుకోకండి. మీ అమ్మాయికి బాయ్ ఫ్రెండ్స్ ఎవరైనా వున్నారా?"

"లేరు ఇన్స్పెక్టర్‌గారూ. అలాంటిది కాదు. ఒక ఇద్దరు ఆడపిల్లలు తప్ప దానికి ఎక్కువమంది స్నేహితులు కూడా లేరు. టైం ప్రకారం కాలేజీకి వెళ్ళివచ్చేది."

"మీకు ఎవరైనా శత్రువులున్నారా?"

"లేరు. నేనంటే చాలా మందికి అభిమానం. ఇంత వరకూ నాకు శత్రువులు అంటూ ఎవరూ లేరు."

"మీ యింట్లో ఎంతమంది వుంటారు?"

"మామూలుగా అయితే నేను, నా భార్య కుసుమ, పెద్ద అమ్మాయి అరవింద, రెండో అమ్మాయి అనిత, అబ్బాయి శ్యామ్. నాయర్, ఇద్దరు నౌకర్లు, తోటమాలి, డ్రైవరు అంతే."

"ఐ.సీ." వివరాలు అన్నీ నోట్ చేసుకున్నాడు స్వామి.

"మీరు లోపలికి వెళ్ళి మీ మిసెస్‌ని ఒకసారి పంపండి" అన్నాడు స్వామి.

ఐదు నిముషాల తర్వాత వచ్చింది బాబూలాల్ భార్య కుసుమ.

ఆమె వయస్సు సుమారు నలభై, యాభై సంవత్సరాల మధ్య వుంటుంది. మనిషి మంచి అందగత్తె. ఎర్రని కెంపురంగు పట్టుచీర, అదేరంగు జాకెట్టు ధరించింది. వంటినిండా విలువైన ఆభరణాలు వున్నాయి. చాలాసేపటి నుంచీ ఏడ్చినందువల్ల కళ్ళు ఎర్రగా బాగా ఉబ్బి వున్నాయి.

"మీ పేరు?"

"కుసుమ" అంది బొంగురుపోయిన కంఠంతో.

"చనిపోయిన అరవింద మధ్యాహ్నం ఎన్ని గంటలకు బైటికి వెళ్ళిందో చెప్పగలరా?" అన్నాడు ఆమెవంకే చూస్తూ.

"సరిగ్గా రెండు గంటలకు వెళ్ళింది."

"అలా అని మీరు ఖచ్చితంగా ఎలా చెప్పగలరు?"

"ఉదయం వారి షష్టిపూర్తి సందర్భంగా బంధువుల్ని భోజనాలకి పిలిచాము. అంతకు ముందే అతిథులు కొందరు వెళ్ళిపోతూ "అబ్బో అప్పుడే టైము రెండయిపోయిందే" అనుకొన్నారు. ఆ వెంటనే అమ్మాయి వెళ్ళింది."

"అరవింద బైటికి వెళ్ళిపోతూ మీకు చెప్పిందా?"

"లేదు. అమ్మాయి బైటికి వెడుతుంటే "ఎక్కడికి అరవిందా?" అని వారు అడిగారు. మీరు మరిచిపోలేని ప్రజెంట్ తెస్తాడాడీ" అంది, అప్పుడే నేనూ విన్నాను."

"అంటే ప్రత్యేకంగా మీకు చెప్పలేదా?"

"లేదు. పైగా దానికి వాళ్ళ డాడీ అంటే అమితమైన ప్రేమ. సడన్‌గా ప్రజంటేషన్ తెచ్చి సర్‌ప్రైజ్ చెయ్యాలని దాని అభిప్రాయం. అలా వెళ్ళకపోయినా బావుండేది. ఇంత ఘాతుకం జరిగివుండేది కాదు" అంది దుఃఖిస్తూ.

"అరవింద నడిచి వెళ్ళిందా? లేక కారులో వెళ్ళిందా?" అడిగాడు స్వామి.

"నడిచే వెళ్ళింది. నేనే అన్నాను, 'ఇప్పుడు నడిచి వెళ్ళకపోతేనేం సాయంకాలం వెళ్ళరాదా అని' 'మళ్ళీ పార్టీ టైంకి తిరిగి రావద్దా ఆటోలో వెడతాలే' అని వెళ్ళిపోయింది."

"ఆల్‌రైట్ మీరు వెళ్ళి నౌకర్లని పంపండి" అన్నాడు స్వామి.

డ్రైవరు, నౌకర్లు కూడా అంతకుమించి వివరాలు చెప్ప

లేకపోయారు.

"త్వరలోనే హంతకుడిని పట్టుకుంటాం" అని శలవు తీసుకోపోతూ...."మీ అమ్మాయి ప్రజంటేషన్స్ తరచుగా ఏ షాపులో కొంటుందో తెలుసా?" అడిగాడు బాబూలాల్‌ని.

"తెల్సు. అమెరికన్ ఫాన్సీ ఎంపోరియమ్" అన్నాడు బాబూలాల్.

2

ఇన్‌స్పెక్టర్ స్వామి స్కూటరు "ది అమెరికన్ ఫాన్సీ ఎంపోరియమ్" వాకిట్లో ఆగింది.

ఇన్‌స్పెక్టర్ని చూడగానే ఎంపోరియమ్ మేనేజరు వినయంగా లేచి వచ్చి నమస్కరించాడు.

"ఈ షాపు మీ సొంతమా" అన్నాడు స్వామి చుట్టూ చూస్తూ.

"లేదుసార్. నేను కేవలం దీనికి మేనేజర్ని మాత్రమే. ఇది సేఠ్ గిరిధర్‌లాల్ గారిది. ఆయన బొంబాయిలో వుంటాడు. నెలకు ఒకసారి వచ్చిపోతారు."

"మీ పేరు?"

"రత్నకుమార్ సార్."

"మీరు ఎన్నాళ్ళనుంచీ ఇక్కడ పని చేస్తున్నారు?"

"ఈ షాపు పెట్టి పదేళ్ళు కావస్తోందండీ. అప్పటినుంచీ నేనే దీనికి మేనేజరుగా వుంటున్నాను. ఇది బాగా అభివృద్ధిలోకి వచ్చింది" అన్నాడు రత్నకుమార్ చేతులు కట్టుకొని వినయంగా.

"మీ షాపుకు వచ్చే కష్టమర్స్ మీకు బాగా గుర్తుంటారు కదూ?"

"అంటే తరచుగా వస్తూ ఎక్కువ వస్తువులు కొనే వారైతే బాగా గుర్తుంటారు. కొందరైతే కొత్తవాళ్ళు

వస్తూంటారు. మేం బిజీగా వుంటే అలాంటి వాళ్ళను గుర్తు పెట్టుకోంసార్. ఇంతకీ మీకేం కావాలో చెప్తే...." అన్నాడు రత్నకుమార్.

"నాకు మీ నుంచి కొంచెం ఇన్ఫర్మేషన్ కావాలి" అనటంతో "రాజూ బేరం చూసుకో అని చెప్పి, "లోపలికి రండి సార్ ఇక్కడైతే ఎవ్వరూ రారు" అంటూ బెల్ కొట్టి ఎవర్నో పిల్చి రెండు స్ట్రాంగ్ కాఫీ పంపించ మన్నాడు.

ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి సార్" అన్నాడు రత్నకుమార్.

"ఈ నెల మూడవతేదీ అంటే మొన్న మధ్యాహ్నం అరవింద అనే అమ్మాయి మీ షాపుకు వచ్చిందా?"

"అరవిందగారా, బాబూలాల్‌గారి అమ్మాయి, వచ్చారు సార్."

"అప్పుడు టైము ఎంత అయిందో చెప్పగలరా?"

"సరిగ్గా రెండుగంటల ముప్పైఐదు నిముషాలు అయింది. నేను ప్రతిరోజూ సరిగ్గా రెండుగంటలకి భోంజేసి అరగంట రెస్ట్ తీసుకుని రెండున్నరకి కరెక్టుగా కౌంటర్లో కూర్చుంటాను. ఆ రోజు షాపు బాగా రద్దీగా ఉండటంతో నేను సేల్స్‌లో కొంతసేపు వున్నాను. అందువల్ల నా భోజనం ముగించేసరికి రెండున్నర అయింది. ఐదు నిముషాలు అయిందో లేదో అరవిందగారు వచ్చారు."

"ఏం అడిగారు?" అన్నాడు స్వామి.

"ఇంతలో కాఫీలు రావటంతో స్వామికి ఆఫర్ చేసి తనూ ఓ కప్పు తీసుకున్నాడు రత్నకుమార్.

"ఆవిడ సరాసరి నా దగ్గరకు వచ్చి మంచి ప్రజంటేషన్స్ కావాలన్నారు. నేను చాలా పెయింటింగ్స్, లేపాక్షిలో

మంచి వెరైటీ ఇంకా చాలా చూపించాను. ఆవిడకి అవేం నచ్చలేదు. రెండు రోజుల్లో లేటెస్ట్ మోడల్స్ వస్తాయన్నాను. ఈ రోజే తనకి కావాలన్నారు. దాదాపుగా మూడున్నర దాకా షాపు మొత్తం చూపించాను. తనకి ఏమీ నచ్చలేదని వెళ్ళిపోయారు."

"ఆ అమ్మాయి కారులో వచ్చిందా?"

"లేదుసార్. ఆటోలో వచ్చారు."

"ఆటో నెంబరు చూశారా మీరు" అన్నాడు స్వామి.

"చూశాను సార్. సరిగ్గా దాని నెంబరూ, మా ఫోన్ నెంబరూ ఒక్కటే" అని ఆటో నెంబరు చెప్పాడు రత్న కుమార్.

నోట్ చేసుకున్నాడు స్వామి.

"తిరిగి ఆ అమ్మాయి ఆటోలోనే వెళ్ళిందా?"

"అవును సార్. నేను కూడా వాకిట్లో దాకా వచ్చాను. రెండు రోజుల్లో కొత్తస్టాకు వస్తుందని, మరోసారి షాపుకి రమ్మని చెప్పాను."

"మీరు ఆటో డ్రైవర్ని చూశారా?"

"నేను అంతగా చూడలేదుసార్."

"పోనీ ఆటో ఎటువైపు వెళ్ళిందో తెలుసా?"

"ఆ.... మెయిన్‌రోడ్డు వైపు వెళ్ళింది."

"ఆ అమ్మాయి ఇదివరలో చాలాసార్లు మీ షాపుకి వచ్చేదా?"

"అవును సార్. వాళ్ళ అమ్మగారితో కూడా వచ్చేవారు. ఒక్కొక్కసారి ఆవిడ తన ఫ్రెండ్స్‌తో వచ్చేది."

"సరే" అంటూ లేచాడు స్వామి.

"ఏం సార్ ఆ అమ్మాయి గురించి ఇంత ఇన్ఫర్మేషన్ అడిగారు" అంటూ ప్రశ్నించాడు రత్నకుమార్.

"అరవింద మొన్న మీ షాపునుంచి వెళ్ళాక హత్య చేయబడింది."

"ఆ....హత్యా...." అంటూ నోరు తెరుచుకుని వుండి పోయాడు రత్నకుమార్.

3

అవి చెక్కపెట్టెలు, సామాన్లు తయారుచేసే షాపు. రేకులతో విశాలంగా పెద్ద షెడ్డులాగా వుంది.

ఉదయం నుంచీ అలాంటి షాపుల్ని చాలా చూశాడు యిన్స్పెక్టర్ స్వామి. ఇది చివరి షాపు. ఇందులో అయినా తన ప్రయత్నం ఫలిస్తుందన్న ఆశతో లోపలికి ప్రవేశించాడు మఫ్టీలో. అతన్ని చూసిన షాపులో పేపరు చదువుకుంటున్న నడివయసు వ్యక్తి....

"రజ్వీ చూడు బేరం తగిలింది," అని కేకపెట్టి మళ్ళీ పేపరులో మునిగిపోయాడు.

"ఏం సార్ ఎంత పెట్టె కావాలి? కొలతలు చెప్పండి? ఎప్పటికి కావాలి?" అన్నాడు అలవాటుగా.

"నువ్వు లోపలికి వెళ్ళి నీ పని చూసుకో" అంటూ వాడి వంక వురిమి చూశాడు స్వామి.

ఏం అనుకున్నాడో కానీ గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు రజ్వీ.

"మీతో కొంచెం మాట్లాడాలి" అంటూ నడివయస్సు వ్యక్తి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు స్వామి తనని తాను పరిచయం చేసుకుని.

"నమస్కారం సార్" అన్నాడా వ్యక్తి వినయంగా లేచి.

"మీ పేరు?"

"జలాల్ సార్."

"ఈ వ్యాపారంలో ఎన్నేళ్ళుగా వున్నారు?"

"పాతికేళ్ళనుంచీ చేస్తున్నాను సార్" అన్నాడు భయంగా చూస్తూ.

"మిస్టర్ జలాల్, ఈ నెల మూడవ తేదీకి ముందు మీరు ఎవరికయినా అందంగా నగిషీలు బాగా వున్న పెట్టెను అమ్మటం జరిగిందా?"

"కొలతలు ఎంత సార్?"

చెప్పాడు స్వామి.

"చూసి చెబుతాను సార్" అంటూ లోపలికి వెళ్ళి అల్మారాలోంచి లావుపాటి పుస్తకం, రశీదు పుస్తకం రెండూ తెచ్చి చూశాడు పది నిముషాలపాటు.

"మొన్న ప్రొద్దున ఒక ముసల్మాన్ తండ్రి చనిపోయాడని పెట్టె చేయించుకొని వెళ్ళాడు. మరోపెట్టె క్రితం నెల 29 న చేసి యిచ్చాం. కానీ కొలతలు వాటివి వేరు. మీరు ఇచ్చిన కొలతలలో వున్న పెట్టె....ఇరవై ఏడో తారీకున అమ్మాం సార్."

"కొలతలు మరోసారి చూసి చెప్పండి" అన్నాడు స్వామి.

మరో పదినిముషాలు పుస్తకాన్ని తిరగేసి చూశాడు జలాల్.

"అవును సార్. క్రిందటినెల ఇరవయి ఏడున మీ కిచ్చిన కొలతలతో ఒక అందంగా వున్న పెట్టె చేసి ఇచ్చాం. దానికి బాగా నగిషీలు చెక్కి అందంగా కనిపించాలని చెప్పాడు కొన్న మనిషి. డబ్బు ఎంతయినా ఫర్వాలేదన్నాడు. మేం మూడు రోజుల్లో తయారుచేసి ఇచ్చాం. డబ్బు యాభై రూపాయలు అదనంగా ఇచ్చాడు సార్."

"అతని పేరు ఏమిటో చెప్పగలరా?"

"రశీదు పుస్తకంలో లాజరస్ అని రాసుకున్నాం సార్. బాగా డబ్బున్నవాడిలాగే వున్నాడు."

"ఎక్కడుంటాడో తెలుసా?"

"తెలియదు సార్. ఈ వ్యాపారంలో ఏ మనిషి ఎవరో ఎక్కడుంటారో తెలియాల్సిన పని లేదు."

"పోనీ అతను ఎట్లా వుంటాడో చెప్పగలరా?" అన్నాడు స్వామి.

"మనిషికి వయస్సు ముప్పై అయిదు వుండొచ్చు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. చిన్నపాటి గడ్డం వుంది. రంగు నల్లగా వున్నాడు సార్."

"మీరు పెట్టె గురించి అతన్నేం అడుగలేదా?"

"నేను ఓసారి అన్నాను సార్. పెట్టె ఇంత అందంగా చేయించావు ఎవరికి అని. చాలా గొప్పవాళ్ళకి కావాలి. గొప్పవాళ్ళకేగా పుట్టింది మొదలు చచ్చేదాకా అందమైనవి అనుభవించే అర్హత అన్నాడు. అంతేసార్ ఇంకేం అడగ లేదు, అతను చెప్పలేదు."

ఇంక అతన్నించి తెల్సుకోవాల్సింది ఏం లేదు అన్పిం చింది స్వామికి.

4

నైట్ డ్యూటీలో వున్నాడు స్వామి.

అప్పుడే టీ త్రాగి బైటినుంచి వచ్చి సీట్లో కూర్చుని కేసు తాలూకు ఫైలు తీసి చూస్తున్నాడు.

అరవింద మధ్యాహ్నం రెండు గంటలకి ఆటోలో వెళ్ళింది. మూడున్నరవరకూ ఎంపోరియంలోనే వుంది. అక్కడి నుంచి ఆటో ఎక్కింది. ఆపైన ఎటు వెళ్ళిందో తెలియటం లేదు. ఆటో నెంబరు కోసం ప్రయత్నిస్తే అసలా నెంబరు గల ఆటోనే లేదని తేలింది. కాలేజీలో

ఎంక్వాయిరీ చేస్తే అరవింద మంచి పిల్లనీ, మగస్నేహాలు లేవని తేలింది. బేడ్ రిమార్క్ ఏమీ లేదు. మరి ఆమెను హత్య చెయ్యటానికి కారణం ఏమిటి? అరవిందని రోజూ కాలేజీ దగ్గర డ్రాప్‌చేసే డ్రయివరూ ఏం చెప్పలేకపోతు న్నాడు.

మరి అరవింద మీద ఎవరికి ఇంత కక్ష వుంది? హత్య జరగటానికి తగినంత కారణం వుండాలి. హత్య నాలుగు న్నర, ఐదున్నరకి మధ్య జరిగి వుంటుందని డాక్టరు రిపోర్టు. శవం మీద వేలిముద్రలు బాగా అతుక్కుపోయి వున్నాయి. ఆటో డ్రయివరే ఆమెను తీసుకువెళ్ళి హత్య చేసి శవాన్ని పెట్టెలో పెట్టి ఏం తెలియనట్లు ఇంటిదగ్గర దింపాడా? దానికి కారణం? అరవింద వంటిమీదున్న వస్తు వులు ఆమెని శవాన్ని తెచ్చిన పెట్టెలోనే వున్నాయి.

పెట్టె తయారు చేయించిన లాజరస్‌కీ బాబూలాల్‌కి శతృత్వం వుందా? లేకపోతే లాజరస్ తయారు చేయించిన పెట్టెలోనే అరవింద శవం ఎందుకున్నట్లు? ఓసారి బాబూ లాల్‌ని కల్సుకుని లాజరస్ విషయం కనుక్కోవాలి. అలా చేస్తే కేసు కొంచెం ముందుకు నడుస్తుంది.

టెలిఫోన్ మ్రోగటంతో ఆలోచనలకు అంతరాయం కల్గి రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు స్వామి.

"హలో నేను యిన్‌స్పెక్టర్ స్వామిని మాట్లాడు తున్నాను. ఎవరూ మాట్లాడేది?"

"............"

"ఆ.. ఆ... నేను వెంటనే బయలుదేరి వస్తున్నాను. శవాన్ని ఎవరూ ముట్టుకోవద్దు" అని మరోసారి హెచ్చ రించి ఫోన్ పెట్టేశాడు స్వామి.

కానిస్టేబుల్ మునిరత్నాన్ని, వీర్రాజుని కేకేశాడు

స్వామి.

"ఏం సార్," అంటూ ఆవలింతలతో వచ్చారు ఇద్దరూ.

"బాబూలాల్ గారింట్లో మళ్ళీ హత్య జరిగింది. వెంటనే మనం అక్కడికి వెళ్ళాలి" అంటూ హెచ్చరించాడు వాళ్ళని.

దాంతో నిద్రమత్తు ఎగిరిపోయింది ఇద్దరికీ.

జీప్ ఎక్కబోతూ టైమ్ చూశాడు స్వామి. పదకొండూ పది నిమిషాలు.

మరో పది నిముషాల్లో పోలీస్ జీప్ బాబూలాల్ భవంతి ముందు ఆగింది.

అప్పటికే జనం చాలామంది మూగి వున్నారు. వారిని తప్పించుకుని లోపలికి నడిచిన స్వామి ఆ దృశ్యం చూసి దిగ్భ్రాంతి చెందాడు.

నేలమీద ప్లాస్టిక్ గుడ్డ పరిచి వుంది. దానిలో మరో ఎర్రని కాటన్ గుడ్డ వుంది. అందులో బాబూలాల్ రెండో కూతురు పధ్నాలుగేళ్ళ అనిత శవం ఘోరంగా శరీరంలో ఒక భాగానికీ మరో భాగానికీ సంబంధం లేకుండా నరికి వేయబడి వుంది. రక్తంతో అన్ని భాగాలూ తడిసిపోవటం వల్ల దుస్తులతోసహా సమస్తం ఎర్రని ముద్దగా మాత్రం కన్పిస్తున్నాయి. హంతకుడు తలను మాత్రం ప్రత్యేకంగా పోలిథిన్ పేపర్లో చుట్టి ముఖం కన్పించటం కోసం రక్తంతో తడిసిపోకుండా జాగ్రత్తపడ్డాడు.

బాబూలాల్ నేలమీదపడి ఆడుదానికంటే ఘోరంగా ఏడుస్తున్నాడు. ఆ సంఘటన చూసి అంతా అయ్యోపాపం అనేవాళ్ళే తప్ప అననివాళ్ళెవరూ లేరు. "నా కొంపకేదో అరిష్టం పట్టింది. నా మీద ఎవరో పగ పట్టారు. బిడ్డల్ని

దారుణంగా చంపేస్తున్నారు. నేను ఎవ్వరికీ ఏ అపకారం తలపెట్టి ఎరుగను" అంటూ పిచ్చివాడిలా పడీ పడీ ఏడుస్తున్నాడు బాబూలాల్.

అతని భార్య స్పృహ లేకుండా పడి వుంది.

ఆమె పక్కన పదేళ్ళ శ్యామ్ దీనంగా కూర్చుని ఏడ్చే తండ్రిని చూసి తనూ ఏడుస్తున్నాడు.

"సారీ బాబూలాల్‌గారూ, జరిగిన దారుణానికి మేం చాలా బాధపడుతున్నాం. ఏం జరిగిందో వివరంగా చెప్పండి" అన్నాడు బాబూలాల్‌కి అంతంత సమీపంలో నిలబడి.

"రోజులాగే అనిత ఉదయం స్కూలుకి బైలుదేరింది. స్కూల్లో సాయంత్రం ఫంక్షన్ వుంది వచ్చేసరికి ఆలస్యం అవుతుంది అని చెప్పింది. అరవింద పోయిన దగ్గర నుంచీ వీళ్ళిద్దర్నీ చూసుకుని బ్రతుకుతున్నాం. అందుకే అనితను స్కూలు వదలగానే బయలుదేరి రమ్మని చెప్పాను. సరే అంది. సాయంత్రం ఐదు దాటినా రాలేదు. ఒక గంట ప్రోగ్రాం చూసి వస్తుందేమోనని అనుకున్నాను. డ్రయివర్ అసలు అమ్మాయి అక్కడ లేదన్నాడు. ఏడు గంటలు దాటినా రాకపోతే, డ్రయివర్ క్లాస్‌టీచర్ని అడిగితే అనిత నాలుగు గంటలకే ఇంటికి వెళ్ళిందని తెల్పింది. వాడు ఖంగారుగా ఈ విషయం నాకు చెప్పాడు. అనిత ఫ్రెండ్స్ ఇళ్ళకి ఏమయినా వెళ్ళిందేమోనన్న అనుమానంతో వాళ్ళందరి ఇళ్ళకీ పంపాను. వాళ్ళంతా ఇంకా స్కూల్లోనే ఉన్నారని చెప్పారు.

డ్రయివరు చాలాచోట్ల వెతికాడు. తీరా ఇంటికి వచ్చేసరికి గేటు ముందు ఈ మూట కన్పించింది. మమ్మల్ని పిలిచి చూపించాడు. తీరా చూసేసరికి నా చిట్టి తల్లి

ఇలా....” అంటూ ఏడవసాగాడు.

మిగిలిన పనులన్నీ ముగించి శవాన్ని మచ్యుయారీకి పంపేసరికి రెండు గంటలు దాటింది.

“అనిత ఏ స్కూల్లో చదువుతోంది?” అని ప్రశ్నించాడు స్వామి.

“సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో 8th స్టేండర్డు చదువుతోంది.”

“ఉదయం ఎన్ని గంటలకి వెళ్ళింది?”

“రోజూ సరిగ్గా మూడు గంటలకు బయలుదేరుతుంది. ఈరోజూ అంతే జరిగింది” అన్నాడు బాబూలాల్ కళ్ళు తుడుచుకుంటూ.

“మీ డ్రయివరు పేరు ఏమిటి?”

“సుబ్బయ్య. చాలా నమ్మకమైన మనిషి.”

“మీ దగ్గర ఎన్నేళ్ళుగా పని చేస్తున్నాడు?”

“తొమ్మిది సంవత్సరాలుగా వుంటున్నాడు.”

“రోజూ అనితను అతనే ఇంటికి తీసుకు వస్తాడా?”

“అతనే తీసుకు వస్తాడు.”

“ప్రతిరోజూ కాన్వెంట్ ఎన్నింటికి వదులుతారు?”

“సరిగ్గా నాలుగున్నరకి వదులుతారు. ఐదు గంటలకల్లా ఇంటికి వచ్చేసేది.”

“మీ దగ్గరకు రాక ముందు సుబ్బయ్య ఏం చేసేవాడు?”

“ఎవరి దగ్గరో డ్రయివరుగా వున్నట్లు చెప్పాడు. జీతం చాలక నా దగ్గరకు వచ్చాడు.”

“ఓసారి సుబ్బయ్యను పంపించండి.”

“చూడండి ఇన్‌స్పెక్టర్‌గారూ. నేనూ నా బిడ్డలూ ఏ పాపం ఎరగం. నా మీద ఎవరికి ఇంత కక్ష వుందో

తెలియడం లేదు. దయచేసి ఈ హత్యలు ఎవరు చేస్తున్నారో తెలుసుకుని మమ్మల్ని కాపాడండి" అన్నాడు దీనంగా.

అంత పెద్దమనిషి దీనంగా అలా అర్థిస్తుంటే జాలేసింది స్వామికి.

"మీకేం ఫర్వాలేదు. ధైర్యంగా వుండండి. మా వాళ్ళని నల్గురిని పంపిస్తాను కాపలా వుండటానికి. త్వరలో హంతకుడిని పట్టుకుని మీకు అప్పగిస్తాం" అన్నాడు ధైర్యం చెబుతూ.

తల ఊపి వెళ్ళిపోయాడు బాబూలాల్.

కుసుమకు ఇంకా స్పృహ రాలేదు. డాక్టర్లు ఆమె గదిలోనే వున్నారు.

తల వంచుకుని భయంగా వచ్చి చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు డ్రయివర్ సుబ్బయ్య.

"సుబ్బయ్యా. నీ వయసెంత?"

"ము....ముప్పై రెండు సంవత్సరాలండీ" అన్నాడు తడబాటుగా.

"రోజూ అనితను స్కూల్లో దింపటం, తీసుకురావటం నువ్వే చేసేవాడివా?"

"అవునండీ."

"ఎప్పుడయినా ఫ్రెండింటికి వెళ్ళి వస్తాననీ, కాసేపు ఆడుకుంటేగానీ రాననీ మారాం చేసేదా అనిత?" అన్నాడు అతన్నే గమనిస్తూ.

"లేదయ్యా. బంగారు తల్లి నాలుగున్నర కొట్టేసరికల్లా రడీగా కారు దగ్గరకు వచ్చేదయ్యా."

"ఊ...నీ ఇల్లెక్కడ."

"లేబరు పేటలోనయ్యా."

"ఇంతకు ముందెక్కడ పని చేశావు?"

"లాయరు విశ్వనాథంగారి దగ్గర పని చేశాను. జీతం చాలక ఇక్కడ చేరాను."

"నువ్వు సాయంత్రం మూడు నాలుగు మధ్య ఎక్కడున్నావు?"

"నేనా....నేను....మా ఇంట్లోనే వున్నాను. నాలుగు గంటలకి మళ్ళీ డ్యూటీలో కొచ్చాను" అన్నాడు తడబాటుగా.

"సరే నువ్వెళ్ళు" అంటూ ఇంట్లో నౌకర్లని మరికొన్ని ప్రశ్నలు వేశాడు స్వామి. కానీ కేసుకి అవి అంతగా వుపకరించేవిలా లేవు. అనిత ఫోటో ఒకటి అడిగి తీసుకుని బయలుదేరాడు.

5

డిటెక్టివ్ వాల్మీకి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

అసిస్టెంట్ వర్మ ఏదో కేసు తాలూకు వివరాలు చూస్తున్నాడు.

"సార్ మీ కోసం ఎవరో వచ్చారు లోపలికి పంపమంటారా?" అన్నాడు నౌకరు.

ఫోన్ పెట్టేసి పక్కకి తిరిగి "లోపలికి పంపించు" అన్నాడు వాల్మీకి.

చేతిలో ఫైలు పక్కన పెట్టేశాడు వర్మ.

అప్పుడే లోపలికి వచ్చాడు బాబూలాల్.

"కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు వాల్మీకి.

"నమస్కారం. నాకు మీ సహాయం కావాలి" అన్నాడు బాబూలాల్.

"చెప్పండి" అంటూ సిగరెట్ వెలిగించాడు వాల్మీకి.

"నా పేరు బాబూలాల్. నేను వూళ్ళో వున్న వ్యాపారస్థుల్లో ఒకణ్ణి. నాకు రెండు ఫాక్టరీలు, మూడు కంపెనీలు వున్నాయి. కావల్సినంత డబ్బుంది. ముగ్గురు పిల్లలు" అని అంతవరకు జరిగిన విషయాలన్నీ చెప్పాడు.

"నాకు ఇంటా, బయటా కూడా శత్రువు లెవరూ లేరు. నేను ఎవరికీ ఏ అపకారం చెయ్యలేదు. పోలీసులు ఇంతవరకూ ఎవర్నీ పట్టుకోలేదు. దయచేసి మీరు ఈ హత్యలు చేసిన హంతకుడిని పట్టుకోవాలి. ఆ దుర్మార్గుడిని పట్టుకునేదాకా నాకు, నా భార్యకు కూడా మనశ్శాంతి లేదు" అన్నాడు బాధగా.

"మీ పెద్ద అమ్మాయి వయస్సెంత?"

"పద్ధెనిమిది, రెండో అమ్మాయికి పధ్నాలుగేళ్ళుంటాయి."

నోట్ చేసుకోమన్నట్లు వర్మ వంక చూశాడు వాల్మీకి.

"మీ అమ్మాయికి బాయ్ ఫ్రెండ్స్ ఎవరయినా వున్నారా?"

"లేరు. ఒకరిద్దరు ఆడపిల్లలే దానికి స్నేహితులు."

"మీకు తెలియకుండా ఎవరయినా వుండచ్చుగా?"

"లేరు వాల్మీకిగారూ. దాని విషయం నాకు బాగా తెల్సు" అన్నాడు బాబూలాల్.

"రెండో అమ్మాయి అనిత ఏ స్కూల్లో చదువుతోంది?"

చెప్పాడు బాబూలాల్.

"మీకు తెలియకుండా మీకు శత్రువులు ఎవరయినా వుండవచ్చుగా?"

"లేరు. ఇంట్లో నేనూ, నా భార్యా, ముగ్గురు పిల్లలు, ఇద్దరు నౌకర్లు వున్నారు. నాయరు, డ్రయివరు, తోటమాలి అంతే. వాళ్ళు ఎప్పుడు కావాలంటే అప్పుడు అడిగిన డబ్బు యిస్తాను. వాళ్ళకి నేనంటే చాలా గౌరవం. పైగా చాలా సంవత్సరాలుగా నా దగ్గర పని చేస్తున్నారు."

"సరే నేను ఈ రాత్రి ముఖ్యమైన పనిమీద ఊరు వెళుతున్నాను. ఎల్లుండి మీ ఇంటికి వస్తాను" అన్నాడు వాల్మీకి.

"మరి మీ ఫీజు...." అన్నాడు బాబూలాల్.

"అవన్నీ తర్వాత" అన్నాడు సిగరెట్ యాష్ట్రేలో పడేస్తూ.

"మీరే ఎట్లాగయినా హంతకుడిని పట్టుకుని మమ్మల్ని కాపాడాలి" అంటూ రెండు చేతులూ జోడించి మరోసారి నమస్కారం పెట్టాడు బాబూలాల్.

6

వాల్మీకి తన అసిస్టెంటు వర్మతో బాబూలాల్ ఇంటికి చేరుకునేసరికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వామి. అతని బృందం. డాక్టరు హడావుడి పడటం చూసి అక్కడ మరో హత్య జరిగినట్లు వూహించుకోటానికి ఎంతోసేపు పట్టలేదు.

లోపలికి నడిచాడు వాల్మీకి.

స్వామి తనని చూసి ముఖం ముడుచుకోవటం గమనించిన వాల్మీకి లోపలే నవ్వుకున్నాడు.

అతన్ని చూసిన బాబూలాల్ "అయిపోయింది వాల్మీకి గారూ, అంతా అయిపోయింది. సర్వనాశనం జరిగిపోయింది. ఇంక నేను ఎవ్వరి కోసం బ్రతకాలి? ఏం చూసుకుని బ్రతకాలి? నా బిడ్డల్ని ముగ్గుర్ని బలి తీసుకున్న ఆ రాక్షసుడిని వదలకూడదు. ప్రాణాలతో వదలకూడదు"

అని గట్టిగా అరుస్తూ పిచ్చి పట్టినవాడిలా ఏడుస్తున్నాడు. అతన్ని ఆపటం ఎవరితరం కావటం లేదు.

వర్మతో హత్య జరిగిన ప్రదేశానికి వెళ్ళాడు వాల్మీకి. కింద విశాలమైన హాలు. తర్వాత మరో పెద్ద హాలు వుంది. అందులోంచి పైకి వెళ్ళటానికి మెట్లున్నాయి. పైన మరో పెద్దహాలు. దానికి రెండు వైపులా మూడేసి గదులున్నాయి. కుడి వైపున వున్న మూడు గదులు బాబూలాల్ పిల్లలవి. ఎడం వైపున వున్న గదులు మూడింట్లో అతని వ్యాపార సంబంధమైన పైళ్ళున్న బీరువాలున్నాయి.

వాల్మీకి, వర్మ, స్వామి, శ్యాంబాబు గదిలోకి ప్రవేశించారు.

విశాలమైన మంచంమీద శ్యాం నిద్రపోతున్నట్లు పడుకున్నాడు. కుడికాలు కొంచెం ముడిచి పెట్టుకున్నట్లుగా వుంది. గదిలో ఎక్కడి వస్తువులు అక్కడే వున్నాయి. హంతకుడికి ఆ గదిలో కావల్సిన వస్తువులు ఏం లేవు అన్నట్లు నీట్‌గా వున్న గదిని చూస్తేనే తెలుస్తోంది. ఐదు నిముషాలు శ్యాం ముఖం వంకే పరీక్షగా చూపిన వాల్మీకికి, ప్రాణం పోయేముందు ఎంతో బాధపడ్డట్లు ముఖంలో కన్పించిన మార్పులు తెలియచేస్తున్నాయి.

దిండు ముఖంమీద వుంచి ఊపిరి ఆడనీయకుండా చేయటంవల్ల చనిపోయినట్లు, రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో ప్రాణం పోయినట్లు డాక్టరు రిపోర్టులో తేలింది.

ఇంక అక్కడ వుండి చేసేదేం లేదని వెనుతిరిగారు.

"ఏమిటి ఇక్కడ హత్య జరిగిందని ఏ కర్ణపిశాచి అయినా చెప్పిందేమిటి" అంటూ హేళనగా నవ్వాడు స్వామి.

"ఆ విషయం నీకే తెలియాలి. ముందు శవాన్ని పోస్టు మార్టంకి పంపించు. లేకపోతే వాళ్ళని ఆపటం అసాధ్యం" అన్నాడు ఉదాశీనంగా వాల్మీకి.

"ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయి" అన్నాడు స్వామి.

"మిస్టర్ స్వామి! ఇంతవరకు జరిగిన హత్యల్లో అనుమానితులు ఎవరూ లేరా?"

"లేరు. పైగా హత్యలు చేసే విధానమే తికమకగా వుంది. బాబూలాల్‌గారికి గానీ, హతులకుగానీ శత్రువులు ఎవరూ లేరు. అరవింద కేరక్టర్ లూజ్ కాదు. చాలా మంచిది. అనిత చిన్నపిల్ల. అలాంటి వాళ్ళకి శత్రువులున్నారు అనుకోవటం తెలివిలేని పని."

"సరే నువ్వు అప్పుడే వెళ్ళిపోకు. నీతో మాట్లాడాలి. బాబూలాల్‌గారిని కొన్ని ప్రశ్నలు అడిగి వద్దాం పద" అంటూ కిందకి దిగసాగాడు.

బాబూలాల్ ఇంకా ఏడుస్తూనే వున్నాడు.

"మిస్టర్ బాబూలాల్ దయచేసి మీరు మాతో సహకరించి కొన్ని ప్రశ్నలకి జవాబు చెప్పాలి."

"చెప్పలేను వాల్మీకిగారూ నేనేం చెప్పలేను. ఆ దేవుడు నా కాళ్ళూ చేతులూ ఆడకుండా కట్టేశాడు."

"చూడండి, మీరెంతో ప్రాణంగా చూసుకునే ముగ్గురు పిల్లల్ని ఎవరో దారుణంగా హత్యచేశారు. ఏ కారణం లేకుండా వాళ్ళని చంపిన హంతకుడిని మీరు చూడాలి అనుకోవటం లేదా? అతడిని ఉరికంబం ఎక్కించాలని మీకు లేదా?"

బాబూలాల్ వెంటనే ఆవేశంగా లేచి, వాల్మీకిగారూ నా బిడ్డల్ని క్రూరంగా చంపిన హంతకుడెవరో తెల్సుకోవాలి. వాడి శవాన్ని నేను కళ్ళారా చూడాలి. చెప్పండి,

అందుకు నన్నేం చెయ్యమంటారో చెప్పండి" అన్నాడు ఉద్రేకంగా.

"ముందు నేను అడిగే ప్రశ్నలకి జవాబు లివ్వండి. అతి త్వరలో హంతకుడిని పట్టుకుని మీ ముందు వుంచు తాము."

ఆ మాటలు బాబూలాల్‌మీద బాగా పనిచేశాయి.

"సరే నాకు అదే కావాలి. అడగండి మీకేం వివరాలు కావాలో" అన్నాడు నిబ్బరంగా.

"ఈ వ్యాపారం మీ సొంతమేనా లేక మీ తండ్రిగారి నుంచి సంక్రమించిందా?"

"ఇదంతా నా సొంతమే వాల్మీకిగారూ. మేం ఒకప్పుడు పెద్ద స్థితిమంతులం కాదు. నా తల్లి తండ్రులకు నేను ఒక్కడినే. వాళ్ళు నా చిన్నతనంలోనే చనిపోయారు. ఏకాకిని. ఎప్పుడో నా చిన్నతనంలో మా నాన్నతో గొడవ పడి ఇంట్లోంచి పారిపోయి రంగూన్ వెళ్ళి అక్కడ వ్యాపారంలో లక్షలు గడించిన మా పినతండ్రి చనిపోతూ ఆయన ఆస్థి, కొంత డబ్బు నాకు చెందేలా వ్రాశాడు. దాంతో నేను వ్యాపారం ప్రారంభించి ఇంతవాడిని అయ్యాను."

"మీ తలిదండ్రులు చనిపోయాక మీరు ఎలా బ్రతి కారు?"

"చుట్టుపక్కల వాళ్ళ దయాదాక్షిణ్యాలమీద బ్రతికాను. పదిహేను, పదహారు సంవత్సరాల వయసు వచ్చాక చిన్న చిన్న పనులు చాలా చేసేవాడిని. మా ఇంటిదగ్గరే ఉన్న సినిమా హాల్లో కొన్నాళ్ళు పనిచేశాను. అలా జరిగి పోయింది.

"మీరు ఏ ఊళ్ళో వుండేవారు?"

"గూడూరులో."

"మీకు సోదరులు ఎవరైనా వుండేవారా?"

"లేరు. నేను ఒక్కడినే" అన్నాడు బాబూలాల్ విచారంగా.

"మీకు చెప్పుకోతగ్గ విరోధులు కానీ, శత్రువులు కానీ ఎవరైనా వున్నారా?"

"లేరు వాల్మీకిగారు. నన్ను అంతా అజాత శత్రువు అంటారు."

"బాబూలాల్‌గారూ, మీ తదనంతరం మీ ఆస్థి ఎవరికి చెందుతుంది?"

"బ్రతికుంటే నా ముగ్గురు పిల్లలకే చెందేది. ఇప్పుడు నా భార్యకే చెందుతుంది" అన్నాడు దీనంగా కళ్ళలో నీళ్లు నిండుతుంటే.

"ఆ....మరొక విషయం. మీరు ఆస్థిని గురించి ఏమైనా విల్లు రాశారా?"

"లేదు. ఇంతవరకూ అలాంటి అవసరమే లేదు."

"పోనీ మీ భార్య తరపున ఎవరైనా శత్రువులున్నారా?"

"ఊహూ....నా భార్యకి ఒక్కడే తమ్ముడు. అతను అమెరికాలో వుంటాడు. బాగా ఆస్థిపరుడు. అతను చాలా కాలంగా అక్కడే సెటిలయ్యాడు."

"పోనీ మీ పార్టనర్స్‌తో అభిప్రాయభేదాలున్నాయా. బాగా ఆలోచించి చెప్పండి" అన్నాడు వాల్మీకి అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"నో....వాళ్ళు చాలా మంచివాళ్ళు. లేకపోతే ఇన్నాళ్లు వాళ్ళతో నేనెలా బిజినెస్ చేయగలను.

తల పంకించి కాసేపు ఏదో ఆలోచించాడు వాల్మీకి.

"రాత్రి ఆఖరుసారిగా శ్యాంని ఎప్పుడు చూశారు

మీరు?"

"నిన్న ఉదయం చూశాను. ప్రతిరోజూ రాత్రి నేను వచ్చేసరికి పదిగంటలు దాటుతుంది. చిన్నవాడు కదా నిద్రకు ఆగలేక తొమ్మిదిగంటలకే పడుకుంటాడు. ప్రతిరోజులాగే రాత్రి నా భోజనం ముగిశాక వాడి గదిలోకి వెళ్ళి చూసి వచ్చాను. అంతే" అన్నాడు గద్గదస్వరంతో.

"అతని గది తలుపులు తెరిచే వుంటాయా రాత్రులు."

"దగ్గరకు వేసి వుంటాయి. ఎప్పుడూ అంతే."

"ఐసీ... వీధితలుపులు అన్నీ భద్రంగా వేసివున్నదీ లేనిదీ ఎవరు చూస్తారు."

"నౌకర్లే చూస్తారు. ఎప్పుడు చిన్న దొంగతనం కూడా జరగలేదు ఈ ఇంట్లో."

"మీ ఇంట్లో నౌకర్లు ఎంతమంది వున్నారు" అన్నాడు వాల్మీకి.

"నాయర్, ఇద్దరు నౌకర్లు, డ్రైవరు, తోటమాలి అంతే. తోటమాలి ఒట్టి చెవిటివాడు. ఈ పరిసరాలకే రాడు" అన్నాడు.

"వాళ్ళందర్నీ ఒకసారి పిలిపించండి. నేను ఒకొక్క-రితో ప్రత్యేకంగా మాట్లాడాలి."

"అలాగే" అంటూ లేచాడు బాబూలాల్.

నాయర్ భయంగా వాల్మీకి వున్న గదిలోకి ప్రవేశించాడు. అక్కడ కాకీబట్టలతో వున్న ఇన్‌స్పెక్టర్‌ని చూసి మరింత భయపడ్డాడు.

"నీ పేరు?"

"ఆర్ముగం సార్."

"మీది ఏ వూరు?"

"చెంగల్పట్ సార్."

"ఈ ఇంట్లో పనికి చేరి ఎన్నాళ్ళయింది.

"ఇరువది రెండు సంవత్సరం అయింది సార్."

"అరవింద చనిపోయిన రోజు నువ్వు ఎక్కడున్నావు?"

"ఆ దినం అయ్యగారుదా పార్టీ చెప్పి పదిమంది వంట వారిని పెట్టినారు సార్. వారికి ఏం కావాలో అందివ్వడం నా డ్యూటీ సార్. ఆ దినం అంతా నేను అక్కడే వున్నాను. రాత్రి డిన్నర్‌లో నేనుదా వడ్డించాను సార్. ఆ తర్వాతనే ఆ యమ్మ చనిపోయిన బాడీ వచ్చింది. ఆ తర్వాత పాపయ్య. వీరయ్య, నేనూ రాత్రంతా మేలుకునే వున్నాం సార్."

"వాళ్ళిద్దరూ ఎవరూ?"

"ఈ ఇంటి నౌకర్లు సార్."

"రాత్రి శ్యాం ఎన్నింటికి భోంచేశాడు."

"ప్రతిరోజులాగే ఏడున్నరకు అబ్బాయిగారు భోంచేసి పోయినారు సార్."

"నువ్వెళ్ళి పాపయ్యనీ, వీరయ్యని పంపించు" అన్నాడు వాల్మీకి.

వాళ్ళు చెప్పే ప్రతి అక్షరం ముక్కా నోట్ చేసు కుంటున్నాడు వర్మ.

వాళ్ళిద్దరూ కూడా ఆర్ముగం చెప్పిన వివరాలే చెప్పారు.

"తోటమాలిని కూడా పిలిపించండి" అన్నాడు వాల్మీకి. తోటలోంచి అతను వచ్చేసరికి అరగంట పట్టింది.

నల్లగా, కోలముఖంతో, బారెడు గడ్డంలో మురికి ఓడుతూ చాలా అసహ్యంగా వున్నాడు తోటమాలి రాముడు. జుట్టంతా పెద్ద బుట్టలాగా ఎదిగిపోయి తైల సంస్కారానికి శాశ్వతంగా గుడ్‌బై చెప్పినట్లుంది. మనిషి నుంచి దుర్గంధం నాలుగు వైపులా దూసుకు వస్తోంది.

"నీ పేరు?" అన్నాడు వాల్మీకి.

మూడుసార్లు గొంతు బ్రద్దలయ్యేలా అరిస్తేనేకానీ 'రాముడు' అని వాడి నోటినుంచి జవాబు వచ్చింది కాదు.

"నీవు ఇంతకు ముందు ఎక్కడ పనిచేసేవాడివి?"

"అడుక్కుతినే వాడిని" అన్నాడు కీచు కంఠంతో.

"ఇక్కడ చేరి ఎన్నాళ్ళయింది."

"ఏమో. బోల్డు రోజులయింది" అన్నాడు లెక్కలు తెలియక.

"నిన్న రాత్రి నువ్వు ఎక్కడున్నావు?"

"రోజూ మధ్యాహ్నమే వంటలయ్య అన్నం పెడుతాడు రెండుపూటలకి. అది తిని తోటలో చీకట్లు పడగానే తొంగుంటా" అన్నాడు తమాషా అయిన యాసతో.

అప్పటికే వాల్మీకి గొంతు పోయింది. ఇంక వెళ్ళచ్చు అన్నట్లు సైగచేశాడు.

ఆఖరిగా వచ్చాడు, డ్రైవరు సుబ్బయ్య.

అతన్నించి కూడా ఎక్కువ వివరాలు రాబట్టలేక పోయాడు వాల్మీకి.

7

సెయింట్ జోసఫ్ కాన్వెంట్ ఆవరణలో ప్రవేశించారు డిటెక్టివ్ ద్వయం. హెడ్‌మిస్ట్రెస్ దగ్గరకు వెళ్ళి అనిత మరణం గురించి క్లాస్‌టీచర్ నుంచి కొంత ఇన్‌ఫర్మేషన్ అడగటానికి వచ్చానని చెప్పాడు వాల్మీకి.

వాళ్ళని పక్కరూంలో కూర్చోమని మిస్ ఎలీజాకు కబురు పంపింది హెడ్‌మిస్ట్రెస్.

మరో ఐదు నిముషాల తర్వాత వచ్చింది ఎలీజా.

ఆమె వయసు సుమారు పాతికేళ్ళుంటాయి. తెల్లగా మల్లెపూవులాంటి దుస్తుల్లో మరింత అందంగా ఉంది

ఎలీజా. మెడలో క్రాస్ వ్రేలాడుతోంది.

మర్యాదగా వారికి విష్ చేసింది.

"మొన్న ఇన్‌స్పెక్టర్‌గారు వచ్చి ఇన్‌ఫర్మేషన్ తీసుకున్నారు" అంది తెల్లని పళ్ళు మరింత తెల్లగా కన్పించేలా నవ్వుతూ.

"ఎస్. నేను డిటెక్టివ్ వాల్మీకిని. ఇతను నా అసిస్టెంట్ వర్మ."

"గ్లాడ్ టూ సీయూ" అంది నవ్వుతూ.

"అనిత మీ క్లాసేనా."

"అవును. చాలా ఇంటలిజెంట్ గరల్."

"ఆ రోజు ఏం జరిగిందో వివరంగా చెప్పగలరా."

"ఆమె ఎప్పటిలాగే ఆ రోజు క్లాసకి వచ్చింది. మధ్యాహ్నం వాళ్ళ ఫాదర్ ఎర్లీగా రమ్మన్నారని అడిగింది. నేనే పంపించేశాను."

"ఆ అమ్మాయి ఎన్నింటికి వెళ్ళిందో తెలుసా?"

"దగ్గరగా నాలుగవుతూ వుండచ్చు."

ఆ అమ్మాయి కారులో వెళ్ళిందో నడిచి వెళ్ళిందో చెప్పగలరా?"

"నో సార్. ఎందుకంటే అనిత వెళ్ళిన ఐదు నిముషాలకి నేను క్లాస్ లీడర్‌కి అప్పగించి ఫంక్షన్ ఏర్పాట్లలో వుండిపోయాను."

"ఆ రోజు స్కూలు ఎన్నింటికి వదిలిపెట్టారు?"

"సరిగ్గా నాలుగున్నరకే వదిలేశారు. ఐదున్నరనుంచీ ఫంక్షన్ బిగినయింది."

"చాలా థాంక్స్ టీచర్. నేను అవసరం అయితే మళ్ళీ కలుస్తాను" అంటూ బైటికి వచ్చారు ఇద్దరూ.

వాల్మీకి దృష్టి గేటు పక్కగా వున్న కిళ్ళీ కొట్టుమీద

పడింది.

తనకి అవసరం లేకపోయినా వెళ్ళి సిగరెట్లు కొన్నాడు వాల్మీకి.

"నీ పేరు ఏమిటోయ్" అన్నాడు పక్కనున్న బెంచీమీద కూర్చుంటూ.

"పారయ్య అంటారండీ" అన్నాడు వినయంగా.

"కొట్టు పెట్టి ఎన్నాళ్ళయిందేమిటి?" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

వర్మ నోట్‌పుస్తకంలో ఏదో రాస్తున్నాడు.

"ఎనిమిదేళ్ళు అయింది బాబయ్యా."

"వ్యాపారం బావుందా?"

"ఏదో తవరి దయవల్ల బాబూ" అన్నాడు నసుగుతూ.

"అవునూ క్రిందటి సోమవారం నీ కొట్టు కట్టేశావు కదూ."

"లేదు బాబూ రోజంతా తెరిచే వుంచానయ్యా."

"చూడు పారయ్యా మా బంధువులమ్మాయి ఈ స్కూల్లో చదువుకుంటోంది. క్రితం సోమవారం నుంచి కన్పించటం లేదు. నీకేవన్నా తెలుసేమోనని అడుగుతున్నాం."

"అయ్యో పాపం అలాగాండీ. అయినా నా కెలా తెలుస్తుందండి. ఆ పిల్ల ఎట్లా వుందో ఏంటో."

"ఇదిగో చూడు ఈ ఫోటోలో అమ్మాయి" అన్నాడు అనిత ఫోటో చూపిస్తూ.

"ఈ అమ్మాయిగారా బాబూ. ఆరికోసం రోజూ కారు వచ్చేదిగా దాంట్లోనే ఎల్లేవారు."

"పారయ్యా క్రితం సోమవారం ఈ స్కూల్లో ఫంక్షను జరిగింది. ఆ అమ్మాయి అందరికంటే ముందే ఒక్కర్తే బయటికి వచ్చింది. ఆ రోజు నువ్వు చూశావా."

"ఆ రోజు .... ఆ రోజు.... ఆ ....అవును బాబూ" అన్నాడు పారయ్య.

"అయితే ఏం జరిగిందో చెప్పు పారయ్యా."

"ఆ రోజు నా కొట్లో ఎవరూ లేరండీ. కాళీగానే వున్నాను. అమ్మాయిగారు ఒక్కరే వచ్చి నా కొట్టు పక్కగా అదిగో ఆ రాయి దగ్గర నిలబడ్డారయ్యా. కాసేపు అయింది. ఇంకా కారు రాలేదు బాబూ ఎంసేతో. అప్పుడు దేవుడు పిలిపినట్లుగా ఆటో బండీ వచ్చి అమ్మగారి ముందు ఆగిందయ్యా. ఆడు వచ్చి "రండి అమ్మాయిగారూ పోదాం" అన్నాడండీ. ఆ యమ్మ "నేను రాను మా కారు వస్తుంది" అన్నారండీ. "సుబ్బయ్య నాన్నగారిని అదేదో పోట్టకి తీసుకు వెళ్ళారు. అందుకే నన్ను పంపారు" అన్నాడండి. అమ్మాయిగారు ఎక్కారు. ఆటోబండీ బుర్రుమంటూ ఇమానంలా ఎల్లిపోయింది."

"దాని వెనక వుండే నంబరు చూశావా నువ్వు."

"లేదండీ. నాకు అలాంటివేం తెలవ్వండి."

"పోనీ ఆ వచ్చిన ఆటో డ్రైవరు ఎట్లా వున్నాడో చెప్పగలవా?"

"మడిసి బాగానే వున్నాడండి. ముప్పైప్పైనే వుంటా యండీ ఆడి వయసు. మనిషి నా అంతే వున్నాడండీ. బాగా పౌడరు రాపి నల్ల పేంటు, ఎర్ర పువ్వులున్న నల్ల సొక్కా తొడుక్కున్నాడండీ. మొకం కొంచెం పొడుగ్గా వుందయ్యా. సిన్నంగా గడ్డంకూడా వుంది."

"కాళ్ళకి ఏం వేసుకున్నాడు."

"కాళ్ళకి మాత్రం మామూలు నల్ల సెప్పులే వున్నా యండీ."

"చేతికి గడియారం, ఉంగరం అలాంటివేమన్నా

వున్నాయా."

"లేవండీ. కానీ అయ్యగారూ చేతికి నల్లతాడు కట్టు కున్నాడండీ."

"ఆటో ఎటువైపు వెళ్ళింది."

"ఇలా ఎడంసేతివైపే వెళ్ళిందండీ."

"ఆటో వెళ్ళాక రోజూ అమ్మాయిగారి కోసం వచ్చే కారు ఎప్పుడు వచ్చింది?" అన్నాడు కుతూహలంగా.

"తెలవదయ్యా. ఈలోగా నాకు బేరాలు తగిలాయి. తర్వాత శింవాచెలం పాత అప్పు ఎగకొట్టపోతే ఆడూ నేనూ సాలాసేపు మాట్లాడుకున్నాం. తర్వాత సూస్తే కారు ఆగి వుందయ్యా. ఆ తర్వాత నేను తొందరగానే కొట్టు కట్టి సరకుకోసం ఎల్లిపోయా."

"చూడు. మళ్ళీ నీకా మనిషి ఇక్కడ ఒక్కడే కానీ, ఆటోలోకానీ కన్పిస్తే ఈ సందు చివర మందులకొట్లోకి వచ్చి చెప్పు" అంటూ పారయ్య వద్దన్నా వినకుండా పది రూపాయల నోటు అతని చేతిలో కుక్కాడు.

"బాబుగారూ రోజూ వచ్చే కారు డ్రైవరు వున్నాడే, అచ్చం అలాగే వున్నాదండీ ఆటో బండీవోడు. ఈసారి నాకు కనిపించగానే మీరు చెప్పినట్టే సేత్తాలెండి" అన్నాడు పారయ్య.

8

"బాబూలాల్‌కి చెప్పుకోతగ్గ శత్రువులు ఎవ్వరూ లేరు. చాలా మంచివాడు అంతా దేవుడని పొగుడుతారు. అంత మంచి మనిషిమీద ఎవరికి కక్ష వుందో అర్థం కావటం లేదు" అన్నాడు వర్మ.

"బాబూలాల్‌కి ఊళ్ళో పలుకుబడి వుంది. మంచిపేరు ప్రఖ్యాతులున్నాయి. ఇంట్లో నౌకర్లు చాలా సంవత్సరాలుగా

పని చేస్తున్నారు. పైగా అతనికి ఎవరితోనైనా శత్రుత్వం వుంటే అతన్ని హత్యచేసేందుకు ప్రయత్నిస్తారు కానీ, పిల్లల్ని ఇంత దారుణంగా హత్య చేయరు."

"సార్ ఘనం అరవింద హత్య కేసులో ఎంపోరియం మేనేజరు చెప్పిన వివరాలు చూస్తుంటే అతను ఆటో డ్రైవరుని చూడలేదని తెలుస్తోంది. పారయ్య చూపిన ఆటో డ్రైవరు, ఇతనూ ఇద్దరూ ఒక్కరే కావచ్చు. ఆటో నెంబరు గురించి మనం ఎంక్వయిరీ చేస్తే అసలా నెంబరు గల ఆటో లేదని తేలింది. పోతే బాబూలాల్‌ని మనం వివరాలు అడిగినపుడు లాజరస్ ఎవరో తనకు తెలియ దన్నాడు. శ్యామ్ హత్య కేసులో మాత్రం ఆటో డ్రైవరే లేడు" అన్నాడు వర్మ.

"దీన్నిబట్టి చూస్తుంటే హంతకుడు బయటి మనిషి కాకపోవచ్చు అన్పిస్తోంది. వేసిన తలుపులు వేసినట్లే వున్నాయి, ఇంట్లో హత్య జరిగిందంటే హంతకుడు బయటినుంచి రాకపోవటం అన్నా జరగాలి, లేకపోతే ఇంట్లో వాళ్ళెవరో అతనికి సహాయంచేసి వుండాలి. అరవిందని తీసుకువెళ్ళిన ఆటో డ్రైవరు, అనితని తీసుకువెళ్ళి హత్యచేసిన ఆటోడ్రైవరు, లాజరస్ ముగ్గురూ ఒక్కరే అయి వుండాలి. జలాల్ చెప్పిన లాజరస్ పోలికలు, పారయ్య చెప్పిన ఆటోడ్రైవరు పోలికలు ఒక్కటిగానే వున్నాయి. హంతకుడు తెలివైనవాడు కనుక ఆటో నెంబర్లు మార్చి సునాయాసంగా హత్యలుచేశాడు" అన్నాడు వాల్మీకి.

"హతులు ముగ్గురు పిల్లలే సర్. ఎంత ఆలోచించినా ఆయన్ని వదలి పిల్లల్ని హత్యచేయటం చూస్తుంటే వింతగానే వుంది" అన్నాడు తల గోక్కుంటూ వర్మ.

"దీన్నిబట్టి చూస్తుంటే హంతకుడు బయటి మనిషి కాకపోవచ్చు. పారయ్యా చెప్పిన డ్రైవరు పోలికలున్న మనిషి బాబూలాల్ కారు డ్రైవరు సుబ్బయ్య ఒక్కడే కన్పిస్తున్నాడు. కానీ మొదటి హత్యకేసులో సుబ్బయ్యకు బలమైన సాక్ష్యం వుంది. అతను ఇంట్లోనే వున్నట్లు. అనిత హత్య కేసులో అతన్ని అనుమానించేందుకు ఆస్కారం వుంది. శ్యాం హత్య జరిగినపుడు అతను ఇంట్లో లేడు. కేసుని తప్పుదారి పట్టించటానికే మూడో హత్య ఇంట్లో జరిగింది."

"సార్, నాకో చిన్న అనుమానం సార్."

"ఏమిటది?" అన్నాడు వాల్మీకి.

"అసలు బాబూలాలే ఒకవేళ ఈ హత్యలు చేశాడేమో."

"వర్మా నీ మెదడు ఏమైనా మొద్దుబారిపోయిందా. చనిపోయిన పిల్లలకు అతను తండ్రి."

"అవుననుకోండి. కానీ వాళ్ళు నిజంగా బాబూలాల్‌కి పుట్టిన పిల్లలేనా? అని నా అనుమానం సార్. ఎందుకంటే అరవింద వెడుతుంటే ఎక్కడికి అని ఆయన అడిగాడు, కనుక ఆ పిల్ల ఎక్కడికి వెళ్ళిందో ఆయనకు తెల్సు. అనితను తీసుకురమ్మని మనిషిని పంపిందీ ఆయనే. శ్యాం ఇంట్లోనే హత్య చేయబడ్డాడు కనుక ఆయనకి ఆ పని చేయటం మరీ తేలిక."

"వర్మా నువ్వన్నట్లు కొన్ని కేసుల్లో అలాంటిఅవకాశాలు లేకపోలేదు. కానీ వాళ్ళు బాబూలాల్ పిల్లలు కాకపోతే అసలు కేసు మనవరకూ రాదు. పోలీసులే నాలుగురోజులు తిరిగి హంతకుడు దొరక్క నోర్మూసుకుని ఊరుకుంటారు.

కేసు మనకి అప్పగించాడంటే అంత తెలివి తక్కువ పనీ చేయడు."

"బాబూలాల్ కాకపోతే ఆ మనిషెవరిరో అతనికి బాగా తెల్సినవాడయి వుండాలి సార్."

"కానీ అతను మననుంచి ఏదో దాస్తున్నాడు వర్మా."

"అతను వాళ్ళ బాబాయి నుంచి ఆస్థి వచ్చిందన్నాడు కదా, ఆయన ద్వారా ఆస్థికోసం ఎదురుచూపిన వాళ్ళు ఈ హత్యలు చెయ్యవచ్చుగా."

"కావచ్చు. కానీ వాళ్ళు ఇంతకాలం ఆలస్యం ఎందుకు చేస్తారు. వెంటనే ఏదో ఒకటి చేస్తారు కానీ. నాకు ఎందుకో అదే అనుమానం కల్గుతోంది" అన్నాడు ఫైలుని మరోసారి తిరగేస్తూ.

"వర్మా" ఉత్సాహంగా పిలిచాడు వాల్మీకి.

"ఏం సార్" అన్నాడు కుతూహలంగా.

"మనం ఈ రాత్రికే గూడూరు వెళ్ళాలి. బాబూలాల్ మననుంచి ఏదైనా రహస్యం దాస్తే అక్కడ బైటపడచ్చు. నువ్వు వెంటనే ఇన్‌స్పెక్టర్ స్వామికి ఫోన్‌చేసి అరడజను మంది కానిస్టేబుల్స్‌ని బాబూలాల్ ఇంటి రక్షణకి పంప మను. లేకపోతే హంతకుడు మరిన్ని హత్యలుచేసే అవ కాశం వుంది."

"అలాగే సార్. కానీ ఆయన గూడూరులో ఏ ప్రాంతంలో వుండేది చెప్పలేదుగా."

"అదంతా అక్కడికి వెళ్ళాక తెలుస్తుంది. మనం త్వరగా బైలుదేరాలి" అన్నాడు వాల్మీకి.

9

"ఇంతవరకూ ఊళ్ళో వున్న సినిమాహాళ్ళన్నీ ఎంక్వ యిరీ చేశాం. ఇంక ఇదే చివరి థియేటర్ సార్. ఇక్కడ

కూడా మనకి వివరాలు తెలియదంటే మన శ్రమ అంతా వృధాయే" అన్నాడు వర్మ నీరసంగా.

ఆఫీసు రూంవైపు నడిచారు ఇద్దరూ.

"సారీ సార్ సెకండ్‌షో టిక్కెట్లు అడ్వాన్స్ బుకింగ్ అరగంట క్రితమే అయిపోయింది" అన్నాడు నడివయసు మనిషి.

"ఈ థియేటర్ మేనేజరు మీరేనా?" అన్నాడు వాల్మీకి అతని వంకే చూస్తూ.

"అవును" అన్నాడతను.

"మేం సినిమా టిక్కెట్లకోసం రాలేదు. మీతో పర్స నల్‌గా మాట్లాడాలి" అంటూ జేబులోంచి తన విజిటింగ్ కార్డ్ తీసి అతని కిచ్చాడు.

"మీరాసార్....నమస్కారం. రండి లోపలకు వెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు మర్యాదగా.

ఆఫీసు బాయ్‌ని కాఫీలు తెమ్మని చెప్పాడు.

"మీరీ థియేటర్‌కి ఎన్నాళ్ళనుంచీ మేనేజర్‌గా వుంటు న్నారు?" అన్నాడు వాల్మీకి.

"దాదాపు ముప్ఫై సంవత్సరాలుగా ఉంటున్నాను. ఈ థియేటర్ నా సొంతం" అన్నాడు వినయంగా.

"అలాగా. మీ థియేటర్లో ఇరవై సంవత్సరాల క్రిందట బాబూలాల్ అనే వ్యక్తి పనిచేశాడా?"

"బాబూలాల్ అనే మనిషా...." అంటూ కొద్దిసేపు ఆలోచించాడు మేనేజరు.

"ఆ....బాబూలాల్ కదూ సార్....గేట్ కీపరుగా ఉండే వాడుసార్" అన్నాడు బాయ్ తెచ్చిన కాఫీలు తలొకటీ ఇస్తూ.

"అతను ఎలాంటివాడో చెప్పగలరా?"

"ఆ ఒట్టి జులాయి సార్. కొంచెం రౌడీఇజం వున్న మనిషి. మూడు నెలలు మాత్రం మా దగ్గర పని చేశాడు. స్థిరంలేని మనిషి. చివరికి మానేశాడు."

"అతను ఎక్కడ వుండేవాడో అప్పట్లో మీకేమైనా తెలుసా?"

"అలా మెయిన్ రోడ్డు ఎక్కాక ఎడంచేతివైపు నాలుగు సందులుంటాయి. మూడో సందులోకి వెడితే కుడివైపు పసుపురంగు డాబా కన్పిస్తుంది. దానిపక్కనుండే గుడిశలో వుండేవాడు. కానీ యిప్పుడు అక్కడున్నాడో లేదో తెలియదు సార్."

"చాలా థాంక్స్. మీరు చాలా వివరాలు చెప్పారు" అంటూ అక్కడి నుంచి శలవు తీసుకుని మెయిన్ రోడ్డు ఎక్కారు యిద్దరు.

"అయితే గతంలో బాబూలాల్ రౌడీ, జులాయి అన్న మాట" అన్నాడు వర్మ ఆశ్చర్యంగా.

"గొప్పవాళ్ళ వ్యక్తిగత జీవితాల్లో యిలాంటివెన్నో వుంటాయి. వెడుతున్నాంగా ఇంకెన్ని వివరాలు తెలుస్తాయో చూద్దాం" అన్నాడు వాల్మీకి.

ఇద్దరూ కొంతదూరం మౌనంగా నడక సాగించారు.

"ఇదిగో సార్ యిదే మూడో సందు."

"రైట్ పద" అన్నాడు ముందుకు నడుస్తూ.

హాలు మేనేజరు చెప్పినట్లే సందులో ఐదు ఆరు ఇళ్ళు దాటాక పెద్ద డాబా పసుపు రంగుది కన్పించింది. దాని తలుపులు మూసి వున్నాయి. పక్కన గుడిశలాంటిదేంలేదు. కానీ దాని స్థానంలో చిన్నపాటి అందమైన పెంకుటిల్లు వుంది. ఒకసారి చుట్టూ చూశాడు వాల్మీకి. డాబా ఎదురుగా పాతకాలం నాటి మరో పెంకుటిల్లు వుంది. ముందు గదిలో

ఎవరో వొక ముసలాయన పడక కుర్చీలో కూర్చుని వీధి వైపే చూస్తున్నాడు. ఇద్దరూ ఆ యింటివైపు నడిచారు.

ఎవరో అపరిచితులు తన యింటికేసి రావటం చూసి....

"ఎవరి కోసం?" అన్నాడు ముసలాయన యెగాదిగా చూస్తూ.

"మీతో కొంచెం పనుండి వచ్చాం తాతగారూ" అంటూ వరస కలిపాడు వాల్మీకి.

"లోపలికి రండి" అని పక్కనున్న రెండు బల్లలు చూపించాడు కూర్చోమన్నట్లు.

"మీ పేరేమిటి?" అన్నాడు వాల్మీకి.

"నా పేరు రామనాథం. ఒకప్పుడు ఎలిమెంట్రీ స్కూల్లో టీచర్ని.

"మీరు యెన్నాళ్ళనుంచీ యిక్కడ వుంటున్నారు?"

కుతూహలంగా వింటున్నాడు వర్మ.

"పాతికేళ్ళుగా యిక్కడే వుంటున్నాను. ఉన్న ఒక్క కొడుకూ మిలట్రీలోకి వెళ్ళిపోయాడు. నెల నెలా కొంత డబ్బు పంపుతాడు. కూతురు పెళ్ళయిపోయింది. నాకు చీకూ చింతాలేదు. అన్నట్లు నాతో మాట్లాడాలి అన్నారు ఏం పని" అన్నాడు కళ్ళజోడు సవరించుకుంటూ.

"రామనాథంగారూ, సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం బాబూలాల్ అనే మనిషి మీ యింటికి ఎదురుగా వుండేవాడు మీకు గుర్తుందా? అతన్ని గురించి మాకు కొన్ని వివరాలు కావాలి" అన్నాడు వాల్మీకి ఆయన ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"బాబూలాల్...." అనుకుంటూ కొన్ని క్షణాలు యోచించిన రామనాథం ముఖంలో హటాత్తుగా రంగులు మారాయి. ముఖం కఠినంగా మారిపోయింది.

"ఆ దుర్మార్గుడా! వాడి సంగతి మీ కెందుకు. వాణ్ణి ఊళ్ళోవాళ్ళు మర్చిపోయి చాలా కాలం అయింది."

"అహ మరేంలేదు, మేం రంగూన్ నుంచి వస్తున్నాం. వాళ్ళ బంధువు వొకాయన అక్కడే వుండేవాడు. ఆయన బాబూలాల్ యెలా వున్నాడో చూసిరమ్మంటే వచ్చాం"

"ఉన్నాడో చచ్చాడో యెవరికి తెల్సు. పోతూ పోతూ బంగారంలాంటి దశరథరామయ్య సంసారాన్ని కూల్చి మరీ పోయాడు. పింజారీ వెధవ" అన్నాడు అక్కసుగా.

"అదేమిటి, దశరథరామయ్యగారి సంసారాన్ని కూల్చే శాడా. మీరేం అంటున్నారో మాకేం అర్థం కావటంలేదు. వివరంగా చెప్పండి రామనాధంగారూ" అన్నాడు వాల్మీకి.

"చెప్పేందుకు ఏం మిగిలిందని. అదంతా ఒక కథలా జరిగిపోయింది. ఆ కన్పించే ఎదురింట్లోనే దశరథరామయ్య వుండేవాడు. వాడు నాకు ప్రాణస్నేహితుడు. భార్య చాలా కాలం క్రిందటే చనిపోయింది. ఆయనకి ముగ్గురు ఆడ పిల్లలు. బంగారు బొమ్మల్లాగా వుండేవారు. చిట్టచివరికి మగపిల్లాడు మధు. ఆడపిల్లలకి పెళ్ళిసంబంధాలు చూస్తూండే వాడు.

అదే సమయంలో మేడ పక్కనే వున్న గుడిశలోకి కొత్తగా బాబూలాల్‌గాడు తగలబడ్డాడు. వాడు చాలా దుష్టుడు. జులాయి వెధవ. తాగుడు, తిరుగుళ్ళు అన్నీ దుర్గుణాలే. వాడి దృష్టి పక్కింటి ఆడపిల్లలమీద పడింది. ఓ రోజు దశరథరామయ్య యింటికి వెళ్ళి పెద్దపిల్లని తన కిచ్చి పెళ్ళి చెయ్యమని అడిగాడు. ఆయన కాదన్నాడు. కొంచెం ఘర్షణ జరిగింది. ఆ పిల్లని తనకిచ్చి పెళ్ళి చెయ్యకపోతే నీ కూతుళ్ళకి సంబంధాలే రాకుండా చేస్తానని బెదిరించాడు. అయినా దశరథరామయ్య వీల్లేదన్నాడు.

తర్వాత నాలుగు నెలలు గడిచాయి. నేను పనిమీద విశాఖ పట్నం వెళ్ళాను. తర్వాత విషయాలు పక్కవాళ్ళు చెబితే విన్నాను."

"ఏం జరిగిందిట?" ఆసక్తిగా అడిగాడు వాల్మీకి.

"ఆ రోజు ఉదయం దశరథరామయ్య పిల్లాడిని తీసుకుని ఉదయమే ఏదో పనిమీద ఊరు వెళ్ళాడుట. ఆడ పిల్లలు ముగ్గురూ ఎగ్జిబిషన్‌కి వెళ్ళటానికి సిద్ధం అయ్యారట. ఇంతలో బాబూలాల్‌గాడు ఏడుస్తూ వచ్చి. 'మీ నాన్నకి జంక్షన్ దగ్గర లారీ ఏక్సిడెంట్ అయింది. చావుబ్రతుకుల్లో వున్నాడు' అని చెప్పాడుట. దాంతో ఆ పిల్లలు ముగ్గురూ గుండెలు బాదుకుంటూ అతని వెంట వెళ్ళారు. అంతే రెండు గంటల తర్వాత ఇంటికి వచ్చిన నా స్నేహితుడు ఈ వార్త వినగానే గుండె ఆగి చనిపోయాడు. ఆ కుర్రవెధవ దిక్కు లేని అనాథ అయ్యాడు. కొద్ది రోజులు మా యింట్లోనే వున్నాడు. తర్వాత ఎటో వెళ్ళిపోయాడు. ఇప్పటి దాకా వాళ్ళ ఆచూకీ ఏం తెలియదు" అన్నాడు భారంగా నిట్టూరుస్తూ.

"అప్పటికి ఆ కుఱ్ఱవాడి వయస్సెంత?" అన్నాడు వాల్మీకి.

"మధు వయస్సు పన్నెండు సంవత్సరాలే."

కాసేపు ఏదో ఆలోచించాడు వాల్మీకి.

"ఆ తర్వాత ఆ యింట్లో వస్తువులు ఏమయ్యాయి?"

"ఆ, ఎవరికి చిక్కినవి వాళ్ళు పట్టుకుపోయారు. తర్వాత ఎవరో ఆ యిల్లు ఆక్రమించుకున్నారు.

"మధు ఎలా వుండేవాడో కొంచెం చెప్పగలరా?"

"ఎప్పుడో మా పిల్లాడితో స్కూల్లో కల్సి తీయించుకున్న ఫోటో వుంది. తెస్తానుండండి" అని లోపలికి వెళ్ళ

కొన్ని పాతఫోటోలు తెచ్చాడు రామనాథం.

"ఇదిగో వీడే మధు. వాళ్ళ నాన్నముద్ర. గడ్డంకింద కందిగింజంత పుట్టుమచ్చ కూడా వుంది...."

వాల్మీకి ఫోటోలు చూస్తూ కళ్ళతోనే ఏదో సైగచేశాడు వర్మకి.

"ఆ తర్వాత బాబూలాల్ యెప్పటికీ కన్పించలేదన్న మాట."

"లేదు. ఆ దుర్మార్గుడు మళ్ళీ రాకపోవటమే నయం. పచ్చినెత్తురు తాగే రౌడీవెధవ."

"అతనికి వాళ్ళ బాబాయి ద్వారా ఆస్తి వచ్చినట్లు విన్నాం లెండి."

"అదేంలేదు. వాడికి చుట్టపక్కాలు ఎవరూలేరు. జులాయిస్నేహితులు తప్ప."

"అయితే మేం వస్తాం రామనాధంగారూ. ఇంకా అతను ఇక్కడే వున్నాడేమో అనుకున్నాం. మనిషి మంచివాడు కాకపోయాడు. ఎటుపోతే మనకేం" అంటూ శలవు తీసుకుని బైటికి వచ్చారు ఇద్దరూ.

"ఇదన్నమాట బాబూలాల్ గతచరిత్ర. పాపం ఆ ఆడపిల్లలు ఏమయ్యారో, మధు బ్రతికివున్నాడో లేదో ఎవ్వరికీ తెలియదు" అన్నాడు వర్మ.

"బాబూలాల్ అతనికి మాత్రం కీడు తలపెట్టలేదన్న నమ్మకం ఏంలేదు. ఒకవేళ అతను బ్రతికే వుంటే జరిగిన విషయాన్ని గుర్తుంచుకుని ప్రతీకారం తీర్చుకోవడం సులభమే."

"నాకో అనుమానం సార్. బాబూలాల్ ద్వారా వంచించబడ్డ ఆడపిల్లలే యిలా చేస్తున్నారేమో."

"మనం అలా అనుకున్నా యిద్దరు ఆడపిల్లలు బైటే

చంపబడ్డారు. శ్యాం యింట్లోనే చంపబడ్డాడు. పోతే అతని యింట్లో పనిమనుషులు అంతా మగవాళ్ళే. ఎంతైనా ఆడది తెగించి గుండె ధైర్యంతో రాక్షసంగా చంపలేదు."

"పోనీ నౌకర్లు ఎవరైనా బైటవాళ్ళని సహకరిస్తున్నారా అంటే అంతా విశ్వాస పాత్రులే.

"కంగారుపడకు వర్మా! ఏ చిన్న ఆధారం దొరికినా హంతకుడు చిక్కిపోతాడు."

"మనకి ఆధారాలేం వున్నాయిసార్. కనీసం వేలి ముద్రలు కూడా లేవుగా."

"కావచ్చు. మనం వెంటనే బాబూలాల్ యింటికి వెళ్ళి మరోసారి వాళ్ళ పనివాళ్ళందర్నీ కల్సుకోవాలి వర్మా. ఈ సారి హంతకుడు తప్పక బైటపడితీరుతాడు."

10

పాపయ్యనీ, వీరయ్యనీ, నాయర్‌నీ జాగ్రత్తగా పరిశీలించాడు వాల్మీకి. డ్రైవర్ సుబ్బయ్యని పిలిపించాడు.

నీట్‌గా డ్రస్ చేసుకున్నాడు సుబ్బయ్య. చిన్నపాటి గడ్డం పెంచాడు. గడ్డం మధ్యలో ప్లస్ ఆకారంలో చిన్న ప్లాస్టర్ వేసివుంది.

"సుబ్బయ్య గడ్డం కింద ఏమైంది?"

"అదాసార్....అది....అది నిన్నరాత్రి ఇంటికి వెడుతూ చీకట్లో రాళ్ళ గుట్టమీద పడ్డాను సార్. గెడ్డం కింద రాయి గుచ్చుకుంది" అన్నాడు ఖంగారుగా.

"మరి గెడ్డం పెంచావెందుకు?" అన్నాడు అనుమానంగా.

"తిరపతి మొక్కు."

"అలాగా....ఆ సుబ్బయా నిన్ను ఎక్కడో గూడూరులో చూపినట్లు అన్పిస్తోందోయ్" అన్నాడు, వర్మ రామ

నాధం నుంచి తెచ్చిన మధు ఫోటోలోని పోలికల్ని తలుచు కుంటూ వాల్మీకి.

"అ....అదా సార్....అది ...ఆ ...మేం చిన్నప్పుడు గూడూరులోనే వుండేవాళ్ళం" అన్నాడు తడబాటుగా.

"అలాగా, మాదీ గూడూరేలే.... అప్పుడు నిన్ను చూసి వుంటాం. మీరు ఎక్కడుండేవాళ్ళు అప్పుడు?"

చెప్పాడు సుబ్బయ్య.

దారిలో పడుతున్నాడు అనుకున్నాడు వాల్మీకి.

"అవునూ నీ గెడ్డం కింద మందేసిన డాక్టర్ ఎవరు?"

"ఆ....ఆ....అదేసార్ డాక్టరంటే డాక్టరు కాదు. మా పక్కింట్లో గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేసే నర్సమ్మ వుంది సార్. ఆమే దీన్ని వేసింది" అన్నాడు తెల్లపోయిన ముఖంతో.

"ఐ.సీ." అంటూ తల పంకించి అతన్ని వెళ్ళమని సైగచేశాడు వాల్మీకి.

తోటమాలిని కల్సుకోవటానికి తోటవైపు నడిచారు వర్మా, వాల్మీకి బాబూలాల్‌తోపాటు.

అది చాలా విశాలమైన తోట. బంగళానుంచి విసిరివేసి నట్లుగా బాగా దూరంగా వుంది. చుట్టూ తీగెలతో అందంగా ఫెన్సింగ్ వేసివుంది. తోటలో రకరకాల పూలమొక్కలు, కూరగాయలు, ఫలవృక్షాలు తలో పక్కగా నేర్పుగా పెంచ బడి వున్నాయి. ఇంకా కొన్ని మొక్కలకి గోతులు తవ్వ బడి వున్నాయి.

"ఏమో అనుకున్నానుగానీ తోట చాలా పెద్దదే" అన్నాడు వాల్మీకి మొద్దులాంటి చెవిటి రాముడి పనితనానికి అబ్బురపడుతూ.

వర్మ, వాల్మీకి గొయ్యి తవ్వుతున్న రాముణ్ణి సమీ

పించారు.

నాలుగుసార్లు చప్పట్లు కొడితేగానీ వెనక్కి తిరిగి చూడ లేదు రాముడు.

"ఏమిటి?" అన్నట్లు తల ఎగరేశాడు పని ఆపకుండా.

"నీ పని ఆపేసి కాసేపు ఇటు రా" అన్నాడు గట్టిగా వాల్మీకి.

పలుగు అవతల పారేసి చేతులు పంచెకి తుడుచుకుని వాళ్ళకి కాస్త దూరంలో నిలబడ్డాడు రాముడు.

"రాముడూ నీకు ఎవరూ లేరా?"

"లేరు. అయ్యా, అన్న రంగంలో కూలీ సేస్తారు?"

"డ్రైవరు సుబ్బయ్య ఎట్లాంటి వాడు?" అన్నాడు కారు చక్రం తిప్పినట్లు నటించి చూపుతూ.

"నాకు తెలవదండీ."

"నువ్వేం చదువుకోలేదా?"

"లేదు" అన్నట్లు తల ఆడించాడు.

"నువ్వు ఆ మేడ దగ్గరికి ఎప్పుడూ పోవా?"

"పోతాను. కూరగాయలు, పళ్ళు, పూలు తీసుకుపోయి అక్కడ ఇచ్చేత్తాను అంతే."

"మరి నీ భోజనం" అన్నాడు సైగచేసి వర్మ.

"వంటాయన మద్దేనం రెండుసార్లకీ ఇత్తాడు" అన్నాడు యికిలిస్తూ.

"వీడికి బండ చెవుడు. పైగా దుర్గంధం. గొంతు బ్రద్దలయ్యేలా వుంది. ఎప్పుడో ఓసారి మేడ దగ్గరికి పోయి తోట్లో పండినవన్నీ అక్కడ యిచ్చిరావటమే వీడి పని సార్. అందుకే వీడికేం తెలియదు. ఇంక పదండి" అన్నాడు వర్మ.

"నిజమే వీడిని ప్రశ్నించడం వృధాప్రయాస. వీడితో

అరిచేసరికి గొంతు ఆర్చుకుపోయింది."

"అదిగో సార్ తోటలో పంపు. మంచినీళ్ళు తాగండి" అన్నాడు వర్మ.

ఇంకా అక్కడే నిలబడ్డ రాముడిని వెళ్ళమని సైగచేసి చేతిగడియారం తీసి మామిడిచెట్టు చుట్టూ కట్టిన గట్టుమీద పెట్టి ముఖం కడుక్కుని మంచినీళ్ళు తాగాడు వాల్మీకి.

ప్రపంచంతో సంబంధం లేనట్లు తన పని చేసుకుపోతున్నాడు రాముడు.

కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ నడుస్తూ మాట్లాడుకోసాగారు యిద్దరు. "సార్ మీరా సుబ్బయ్యని వెంటనే అరెస్ట్‌చేసి వుండాల్సింది. అతనే హంతకుడని ఋజువు అయిందిగా" అన్నాడు వర్మ.

"తొందరపడకు వర్మా. అలా చేస్తే మనకి అతడే హంతకుడని ఆధారాలు ఏం వున్నాయి. అతడు డ్యూటీలో వున్నప్పుడు అతని ఇంటికి వెళ్ళాలి. నువ్వు సాయంత్రమే ఆ పని ప్రారంభించు. శ్యాం హత్య జరిగిన రాత్రి అతను ఇంట్లో వున్నదీ లేనిదీ చుట్టుపక్కల ఎంక్వయిరీ చెయ్యి."

"అలాగే సార్."

"వర్మా. మనం ఎల్లుండిలోపు సాక్ష్యాలు సేకరించి సుబ్బయ్యని పట్టుకోవాలి. అతనికి తెలియకుండా వెంబడించి నిజాన్ని తెల్సుకో. నేను ఓ సారి స్వామిని కల్సుకుని వస్తాను."

"అలాగే సార్."

"అరె నా వాచీ తోటలోనే మర్చిపోయాను వర్మ. నువ్వు ఇక్కడే వుండు వెనక్కి వెళ్ళి తెచ్చుకుని వచ్చేస్తాను" అని వడివడిగా తోటలోకి నడిచాడు వాల్మీకి.

11

అర్ధరాత్రి దాటింది.

నిండా నల్లని ముసుగు వేసుకున్న ఆకారం కాంపౌండ్‌లో దట్టంగా వున్న చెట్ల మధ్య నుంచి మెల్లగా నడిచి సందుగుండా దొడ్డి వైపు చేరుకుంది. మొదటి ఆకారాన్ని మరి రెండు ఆకారాలు వెంబడించటం గమనించ లేదు.

మొదటి ముసుగుమనిషి చుట్టూ పరికించి చూసి దొడ్లో వున్న మామిడిచెట్టు చివరికి గబగబా చేరుకుని అక్కడి నుంచి తాడుకు వుచ్చువేసి మేడపైనున్న ఇనుప కడ్డీవైపు గురిచూపి విసిరింది. తాడు బడ్డీకి బలంగా బిగుసుకోవటంతో దాని ఆధారంతో మేడపైకి చేరుకున్నాడు. వెనుక ఆకారాలు దాన్ని జాగ్రత్తగా వెంబడించసాగాయి.

ముసుగుమనిషి చకచకా లోపల హాల్లో వున్న మెట్ల ద్వారా వెనక హాల్లోంచి మధ్య హాల్లో ప్రవేశించి బాబూలాల్ గది తలుపులు తోసిచూశాడు. తలుపులు లోపల బోల్టు వేసి వుండటంవల్ల వెంటనే తెరుచుకోలేదు. ఒక్కక్షణం నలువైపులా పరికించి మెరుపులా చిట్ట చివరి గది పక్క సందులోకి ప్రవేశించాడు! వెనుక ఆకారాలు అతని కంట పడకుండా తప్పించుకుంటూ గది వెనుకభాగానికి చేరుకున్నాయి.

ముసుగుమనిషి యెవ్వరూ ఊహించనంత వేగంగా తెరచివున్న వెంటిలేషన్ ద్వారా అతి చాకచక్యంగా బాబూలాల్ గదిలో ప్రవేశించాడు. ఆ వెంటనే వెంటిలేషన్ మూసేశాడు.

మరుక్షణం....

"వర్మా! నువ్వు వెంటనే ఏదో ఒక ఆయుధం పట్రా

క్విక్. హంతకుడు బాబూలాల్ గదిలో దూరి వెంటిలేషన్ మూసేశాడు," అనటంతో వర్మ చటుక్కున పరుగెత్తి చేతికి అందిన రాయిలాంటి యినుప వస్తువు తేవటం దాంతో వాల్మీకి గాజు వెంటిలేషన్ పగలకొట్టి చెయ్యి లోపలికి పోనిచ్చి బోల్టు తీశాదోలేదో, 'కెవ్వు'మంటూ వెర్రికేక విన్పించింది.

అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది.

ముసుగు మనిషి చేతుల్లో రక్తంతో తడిసిన పెద్ద కసాయి కత్తి వుంది. రక్తం మడుగులో రెండు కాళ్ళు తెగిన బాబూలాల్ గిలగిలా తన్నుకుంటూ వెర్రికేకలు పెడుతున్నాడు.

వాల్మీకి వెనుకనుంచి చటుక్కున ఆ మనిషిని వాటేసుకున్నాడు. అతను యెంత గింజుకున్నా ఉక్కు చేతుల బంధం నుంచి తప్పించుకోలేకపోయాడు.

అప్పటికే యింట్లో నౌకర్లు, కుసుమ, అంతా చేరి ఆ దృశ్యం చూపి స్థాణువుల్లా నిలబడిపోయారు.

వెంటనే డాక్టర్లకి మరికొంతమంది ముఖ్యులకి ఫోన్‌లు వెళ్ళాయి.

వాల్మీకి ఒకచేత్తో అతన్ని బంధించే మరోచేత్తో అతని ముసుగు తొలగించాడు.

"అరె....రాముడు రాముడు...." అంటూ అంతా అరిచారు.

"ఒరే బాబూలాల్! నీ అంతం చూడాలనుకున్నారా. వీళ్ళు అడ్డం రాకుండా వుంటే నీ చేతులు కూడా నరికి నీ మొండాన్ని చూపి మరింతగా ఆనందించేవాణ్ణిరా. నువ్వు నా వాళ్ళకెంత ద్రోహం చేశావో దానికి ప్రతీకారం తీర్చుకున్నానురా. నీ వంశాన్ని నాశనం చేశానురా. నా కిప్పుడు

తృప్తిగా వుందిరా. నిన్ను చూసి హాయిగా, ఆనందంగా గుండెలు పగిలేలా నవ్వుకుంటానురా — బాబూలాల్," అంటూ వికృతంగా నవ్వుతున్నాడు.

అప్పుడే దిగింది పోలీసు బలగం.

"మిస్టర్, యూ ఆర్ అండర్ అరస్ట్," అంటూ యిన్‌స్పెక్టర్ స్వామి అతని రెండు చేతులకూ బేడీలు వేశాడు.

"ఎవరు? ఎవరు నువ్వు? నేను నీకేం అపకారం చేశాను. మామీద యెందుకింత కక్ష కట్టావు?" అన్నాడు బాబూలాల్ అతి ప్రయాసతో పళ్ళ బిగువున బాధను భరిస్తూ.

"మిస్టర్ బాబూలాల్ ముందు మీకు వైద్యసహాయం అవసరం. అవన్నీ తర్వాత వినవచ్చు. మీరు ఎక్కువగా మాట్లాడకండి. ముందు హాస్పిటలుకి వెడుదాం" అంటున్న వాల్మీకితో....

"లేదు వాల్మీకిగారూ, ముందు నేను వాడి నోటినుంచి వెలువడే ప్రతీమాటా వినితీరాలి. ఆ తర్వాత....ఆ తర్వాత నేను చచ్చిపోయినా ఫర్వాలేదు," అన్నాడు ఆయాస పడుతూ.

"మిస్టర్....నువ్వు యిన్ని హత్యలు చేయటానికి కారణం ఏమిటి?"

అప్పటికే బాబూలాల్ స్నేహితులు, వ్యాపారస్తులు అంతా కారుల్లో వచ్చేశారు. రాముడి నోటి నుంచి ఏం వస్తుందో అన్నట్లు కుతూహలంగా వినసాగారు.

"నా పేరు రాముడు కాదు మధు. ఈ దుర్మార్గుడు బాబూలాల్ యెంత నీచుడో మీకుతెలియదు. మేం గూడూరులో వుండేవాళ్ళం. అప్పట్లో వీడు జులాయి, తాగుబోతు

తిరుగుపోతు. మా యింటి పక్కనే వుండేవాడు. నాకు ముగ్గురు అక్కలు, నాన్న వుండేవారు. అమ్మ చిన్నప్పుడే పోయింది.

ఓనాడు వీడు మా పెద్దక్కను తనకిచ్చి పెళ్ళి చేయమని అడిగాడు. అటువంటి వ్యసనపరుడికి తన కూతుర్ని యిచ్చి చెయ్యనని నాన్న చెప్పాడు. దాంతో మా కుటుంబం మీద కక్షకట్టి ఓ రోజు మా నాన్న ఊరు వెళ్ళినపుడు, ఆయనకు యాక్సిడెంటయినట్లు మా ముగ్గురు అక్కలను నమ్మించి తీసుకుపోయి వాళ్ళను నాశనం చేశాడు. పెద్ద అక్క యెదురుతిరిగిందని దాన్ని మిగిలినవాళ్ళ కళ్ళెదుటే పొడిచి చంపేశాడు. మిగతా యిద్దరినీ భోగం కొంపల్లో అమ్మేశాడు.

తన పిల్లలు వాడి చేతిల్లో చిక్కినట్లు తెల్సి నాన్న వెంటనే గుండె ఆగి చనిపోయాడు. అక్కయ్యలు, నాన్న లేని నేను ఆ ఊళ్ళో వుండలేక పారిపోయాను. సరిగా ఐదుయేళ్ళ క్రితం మా రెండో అక్క హీనస్థితిలో చనిపోయేముందు కన్పించి, నన్నో ప్లాటుఫారంమీద గుర్తుపట్టి వీడి సంగతిచెప్పి వీడి ఫోటో యిచ్చి యెక్కడున్నా కసి తీర్చుకోమని చెప్పి నా చేతుల్లోనే చనిపోయింది. నల్గురి జీవితాలు నాశనంచేసిన వీడిని అంతం చేస్తేకానీ నా ఆవేశం చల్లారదు.

అదే ఆశయంతో వీడు ఇక్కడున్నట్లు తెల్సుకున్నాను. నావాళ్ళను బలితీసుకున్న వీడు తనవాళ్ళతో సుఖసంతోషాలతో వుండటం చూసి నాలో అగ్నిజ్వాల మరింత విజృంభించింది. వీడికి యిష్టమైన పిల్లల్ని చంపి వీడి ఏడుపు కళ్ళారా చూడాలనుకున్నాను. ఆ విధంగానే అరవిందని, అనితని ఆటోలో తీసుకెళ్ళి తోటలో చంపేశాను. తోట

మాలిగా చేరిన రోజు అదే నాకు అనువయిన చోటుగా తెల్సుకొన్నాను. శ్యాంని మాత్రం యింట్లోనే చంపాను........"

"వేసిన తలుపులు వేసినట్లున్నాయి. ఎప్పుడూ ఇంటికి రాని నువ్వు యెలా శ్యాంని హత్య చెయ్యగలిగావు?" అన్నాడు యిన్స్పెక్టర్ స్వామి.

"ఆ రోజు సాయంత్రం గులాబి అంట్లు కుండీల్లో పెట్ట టానికి రమ్మని వీడిపెళ్ళాం నౌకర్ల చేత కబురు పెట్టింది. ఆ పని ముగించేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది. నౌక ర్లంతా దొడ్లో వున్నారు. పని అయ్యాక నేను వెడుతున్నా నని చెప్పాను. ఆవిడ సరేనని నన్ను చూడకుండానే లోప లికి వెళ్ళిపోయింది.

అవకాశంకోసం చూస్తున్న నేను చటుక్కున స్టోర్ రూంలో దాక్కున్నాను. ఆ రాత్రే శ్యాంని చంపేశాను. వీణ్ణి కూడా చంపి నా పగ తీర్చుకునేలోపల వీళ్ళు నన్ను పట్టు కున్నారు."

"మిస్టర్ వధూ చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవటం అన్యాయం. మీరు చేసిన అన్యాయాలకు చట్టం ఏ శిక్ష విధి స్తుందో మీకు తెలుసా!" అన్నాడు స్వామి.

"తెల్సు. కానీ నా ఆవేశం, పగ మీకు అర్థంకావు. న్యాయస్థానానికి సాక్ష్యాధారాలు కావాలి. వాడు చేసిన అన్యాయాలను నిరూపించేందుకు అవి నా దగ్గర లేవు. ఈ నేరాలకు నాకు ఉరిశిక్షే పడచ్చు. కానీ నేను చచ్చేలోగా ప్రతీకారం తీర్చుకున్నాను." అన్నాడు ఆవేశంగా.

అప్పటికే బాబూలాల్కి స్పృహ తప్పింది. వెంటనే డాక్టర్లు ఆయన్ని తీసుకువెళ్ళారు.

"వాల్మీకిగారూ! మాకు యెవ్వరికీ రాని అనుమానం అతనిమీద మీ కెందుకు వచ్చింది?" అన్నాడు స్వామి.

"నేను మొదట్లో ఇతన్ని అనుమానించలేదు. కానీ నాకు మొదటినుంచీ బాబూలాల్ ఏదో దాచిపెట్టి చెప్తున్నట్లు అనుమానంగానే వుంది. ఎంతో బలమైన కారణా లుంటే తప్ప ఎవ్వరూ కావాలని హత్యలు చేయరు. బాబూలాల్ మాటల మధ్య అతని స్వస్థలం గూడూరు అన్న విషయం తెల్సుకుని అక్కడికి వెళ్ళాం. అక్కడ యితని గురించిన వివరాలు తెలిశాయి.

ఒకవేళ మధు బ్రతికివుంటే గనుక ఈ హత్యలు చేయటానికి ఆస్కారం వుంది. అది కేవలం మా ఊహ మాత్రమే. మధుని గుర్తించే ఒకేఒక ఆధారం గడ్డంక్రింద వున్న పుట్టుమచ్చ. అటువంటి పుట్టుమచ్చ డ్రైవర్ సుబ్బయ్యకి వుండటం, అతని స్వస్థలం గూడూరే కావటంతో అతన్ని మేం అనుమానించాం.

మొన్న మేం తోటలోకి వెళ్ళి రాముణ్ణి కల్సుకున్నాం. కానీ అతను అనుమానితుళ్ళా కన్పించలేదు. అప్పుడే నేను మంచినీళ్ళు తాగుతూ చేతిగడియారం మర్చిపోయాను. కొంతదూరం వచ్చాక ఆ విషయం తెల్సుకుని అది తెచ్చుకోటానికి వెనక్కి వెళ్ళి, అతడు తోటలో లేడని మామూలు అనుమానంతోనే గుడిశలోకి వెళ్ళాను.

అక్కడ అతని పెట్టెలో రక్తంతో తడిసిన గుడ్డలు, సాక్షుల్లో వొకరైన పారయ్య చెప్పిన డ్రైవర్ వేషంలో ధరించిన నల్ల ఫేంటు, ఎర్రపూల నల్లచొక్కా, బాబూలాల్ ఫోటో కన్పించాయి. మా అనుమానం ప్రకారం మధు పట్టుబడ్డాడు. కానీ మేం బాబూలాల్‌ని మాత్రం కాపాడలేకపోయాం," అని ముగించాడు వాల్మీకి.

సకలగుణాభిరాముడు



బి. రాజేశ్వరి

‘‘డిటెక్టివ్ వాసు అండ్ శేషుల్లో మీ పేరు....?'' ఆ వ్యక్తి టేబిలు ముందుకి వంగి నవ్వుతూ అడిగాడు.

‘‘డిటెక్టివ్ శేషు! వాసుగారు ఊరెళ్ళారు!''

‘‘నా పేరు పరాంకుశం. లోకల్‌గా పెద్ద వేరుశెనగ నూనెమిల్లుంది.''

‘‘సంతోషం. మీరొచ్చిన పని....?''

"అదే చెప్పబోతున్నాను. నాకో వేలుపిడిచిన మేనల్లుడున్నాడు. వాడికి నా కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. అల్లుడు సకలగుణాభిరాముడని కర్ణాకర్ణి కగా విన్నాను. ఎంతవరకు నిజమో తెలీదు. ఆడపిల్లనిచ్చే ముందు యోగ్యుడో, కాదో నిర్ధారణ చేసుకోవాలి కదండీ....ఎంత మేనల్లుడయితే మాత్రం!? నూరేళ్ళ బతుకాయె...."

"అవునవును! అవన్నీ చూసుకున్నాకనే అమ్మాయినిచ్చుకోవాలండి మొహమాటం మంచిదికాదు!"

"అందుకే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను!"

"చెప్పండి, వాట్ కెన్ ఐ డూ ఫర్ యు?"

"మా అల్లుడి గురించి-అదే కాబోయే అల్లుడిగురించి-అతని కేరక్టర్ విషయం ఎ టు జడ్ వివరంగా రిపోర్టు కావాలి నాకు! దానిమీద ఆధారపడి ఏం చెయ్యాలో నేను నిర్ణయించుకుంటాను!"

"సరే, మా పార్టనర్ మిస్టర్ వాసు వచ్చాక మీకు కబురు చేస్తాను. దయచేసి మీ వివరాలు, మీ అల్లుడిగారి వివరాలు చెప్పండి సార్....!"

"క్షమించాలి! నాకు యీ విషయం చాలా అర్జంటుగా తేలిపోవాలి. మరో నాలుగురోజులకి మూఢమి వచ్చేస్తుంది. ముహూర్తాలు లేవు. ఎల్లుండి నాకు వివరాలు తెలియాల్సి వుంది. మీ వాసుగారొచ్చేవరకు ఆగాలంటే పుణ్యకాలం కాస్తా పోతుంది!"

"మరీ అంత దగ్గరగా పెట్టేసుకున్నారా ముహూర్తం? మీకు నేను వివరాలు ఎంక్వయిరీచేసి చెప్పటానికే దాదాపు వారంరోజులు పడుతుంది. కనీసం! మీకు అనుకూలంగా వుంటే ఆ తర్వాత కదా ముహూర్తాలు పెట్టుకోవలసి

వుంటుంది....!? యింత అర్జంటుంగా చెప్పమంటే యెలా గండీ!"

"సారీ ఫర్ ది ట్రబుల్. అసలు యీ ముహూర్తాలు నెలరోజుల క్రితమే పెట్టుకోవటం జరిగిపోయిందండి. అప్పటికి మా మేనల్లుడి గురించి నాకుగాని మా కుటుంబంలో యెవరిగాని యెలాంటి అనుమానాలు లేవు! సరిగ్గా రెండు రోజుల క్రితం తెలిపింది—మా మేనల్లుడికి ఇదివరకే ఎవరో అమ్మాయితో సంబంధముందని, రేసులకి కూడా వెడతాడని, పేకాటవంటి జూదంపిచ్చి వుందనీను. అయితే ఆ విషయాలు నిజమో కాదో తెలుసుకోకుండా అతన్నెలా నిలదీపి అడగను? అందుకే మీ దగ్గరకొచ్చాను. ముహూర్తం చూడబోతే మూడే రోజులుంది! నేను విన్నవి కేవలం అబద్ధాలు అని రుజువయితే ముహూర్తం మార్చుకోవలసిన అవసరం లేదుకదండీ! అందుకే యింతగా మిమ్మల్ని వొత్తిడి చేయాల్సి వచ్చింది!"

"ఆల్ రైట్! నా శక్తివంచన లేకుండా యీ మూడు రోజుల్లోను మీ మేనల్లుడి గురించిన పూర్తి వివరాలు సేకరించటానికి ప్రయత్నిస్తాను. ఎల్లుండి మా పార్ట్‌నర్ యెటూ వస్తున్నాడు. అతనొచ్చాక మీకు ఫైనల్ రిపోర్టిస్తాను."

పరాంకుశం రెండు నోట్లకట్టలు టేబులుమీద పెట్టి, ప్రస్తుతం యీ రెండువేలు అడ్వాన్స్‌గా వుంచండి. తర్వాత మీరెంత బిల్ చేస్తే అంతా తెల్లిస్తాను. అర్జంటు కేస్ కాబట్టి అదనంగా చెల్లించమన్నా సిద్ధం?" అన్నాడు.

శేషు ముఖం ఆనందంతో వికసించింది. వాసు రాగానే సర్‌ప్రయిజ్ చెయ్యాలి!

శేషు నోట్ల కట్టలు డ్రాయరు సొరుగులోపెట్టి, "సరే,

మూడు రోజుల్లో మీక్కావలసిన యిన్ఫర్మేషన్ అన్ని ఆధారాలతోను మీకు అందచేస్తాను!" అన్నాడు.

పరాంకుశం ఆనందంగా తలాడించాడు.

"మీ అడ్రసు. తక్కిన వివరాలు చెప్పండి!....మీ మేనల్లుడు మీతోనే వుంటున్నాడా? అతనేం చేస్తుం టాడు?...."

పరాంకుశం తమ యింటి అడ్రస్. మిల్లు అడ్రస్ చెప్పి, "నా మేనల్లుడి పేరు జగదీష్. ఇరవై మూడు సంవత్సరాలు. మా యింట్లో మాతోనే వుంటున్నాడు. అయితే వాళ్ళకి ఈ వూళ్ళోనే స్వంత యిల్లుంది. పెళ్ళిముహూర్తాలు పెట్టు కున్నాక వాళ్ళింట్లోనే వుంటున్నారు. పీటలమీదగాని మళ్ళీ మా అమ్మాయిని చూడకూడదని పురోహితులు ఆంక్ష విధించటంవల్ల!" అన్నాడు.

శేషు జగదీష్‌వాళ్ళ యింటి అడ్రస్ కూడా నోట్ చేసుకున్నాడు.

"మా జగదీష్ నాతోనే, మా ఆయిల్‌మిల్లు వ్యవహా రాలు చూసుకొంటున్నాడు ప్రస్తుతం! జగదీష్‌కి తల్లి అంటే మా చెల్లెలు—తప్ప మరెవరూ లేరు!" అన్నాడు పరాంకుశం.

శేషు వివరా లన్నీ రాసుకొన్నాక ఆయన వెళ్ళి పోయాడు.

2

చాలా సేపట్నించీ శేషు ఆ యింటిముందే నిఘా వేసు కొని చూస్తున్నాడు.

ఆయిల్‌మిల్లునించి జగదీష్‌ని వెంటాడుతూ వచ్చాడు. మిల్లునుంచి బయల్దేరిన జగదీష్ సరాసరి యింటికే వచ్చే శాడు. మళ్ళీ బయటికి రాలేదు.

రాత్రి యెనిమిదిగంటల సమయం.

జగదీష్ బయటికొచ్చాడు. శేషు అంతదాకా పాన్‌షాపు ముందు పరిశోధన పత్రిక చదువుతూ ఓ కన్ను జగదీష్ మీదనే వేసివుంచాడు.

జగదీష్ రిక్షా పిలిపించి యెక్కాడు, యెటూ చూడకుండా.

రిక్షా బయల్దేరింది.

ఆ వెనకనే శేషు బయల్దేరాడు. నాలుగడుగులు వేసి పోతున్న రిక్షాని ఆపాడు.

"ఆ రిక్షా వెనకనే పోనియ్యి!...." అన్నాడు రిక్షా వాడితో.

"ఎక్కడికి బాబయ్యా?" అన్నాడు వాడు.

"ఆ రిక్షా యెక్కడికిపోతే అక్కడికి!"

"అదెలా బాబయ్యా, యెక్కడికో తెలీకపోతే బేరం కుదిరేదెట్లాగా?"

"నేను నీతో బేరమాడలేదుకదా! వెళ్ళిన దూరాన్నిబట్టి నీకు న్యాయమైన రేటిస్తాన్లే!"

"అదెట్లా బాబయ్యా...." రిక్షావాడింకా ఏదో సణుగుతునేవున్నాడు. శేషు చటుక్కున పదిరూపాయల నోటు వాడి చేతిలో కుక్కి "మాటలు మాని ముందు ఆ రిక్షా వెంట పోనియ్! అప్పుడే అది చాలా దూరం పోయింది, చూశావా?" అన్నాడు.

"కేసరదమయిపోనాది బాబయ్యా, ఇక పిటికెలో ఇమానంలా ఎల్లిపోతా సూస్కోండి" రిక్షావాడిలో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. నోటుని బనీను లోపలిజేబులో పదిలపరచి, రిక్షాని గాల్లో తేలించేశాడు.

"తొందరొద్దు. ఆ రిక్షా దగ్గిరయింది. స్లో చెయ్యి, డాష్

యిచ్చేయగలవు!" శేషు రిక్షా వాడి స్పీడుకి తట్టుకోలేక పోతున్నాడు.

ఎదుటి రిక్షా ఆగింది. శేషు తన రిక్షా ఆపించాడు.

జగదీష్ రిక్షా దిగాడు.

శేషు పరిసరాలని పరీక్షగా చూశాడు. ఆ లొకాలిటీ అంత మంచిది కాదు. రాత్రిళ్ళు అక్కడ తాగుబోతుల మయం! రహస్య వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయని చెప్పుకోవటం తను విన్నాడు. పరువుగల పెద్దమనుషులు పగలు రావటానికి సంకోచించే ప్రాంతమది!

పరాంకుశం అనుమానం నిజమే కావచ్చు!

"ఓ అరగంట తర్వాత జగదీష్ బయటి కొచ్చాడు. అతని వెనుక ఓ అందమైన అమ్మాయి గుమ్మంవరకు వచ్చి నమస్కరించింది. జగదీష్ ఆమెతో ఏదో చెపుతు న్నట్టు పెదాల కదలికవల్ల తెలిసింది. ఆమె ముఖం సరిగ్గా గుర్తు తెలీటంలేదు.

జగదీష్ వచ్చి తనకోసం కాచుకునివున్న రిక్షా ఎక్కాడు. ఎటూ చూడటంలేదు. రిక్షా మళ్ళీ ముందుకు సాగింది.

పరాంకుశం తనతో చెప్పిన తక్కిన విషయాలు మననం చేసుకున్నాడు శేషు. తాగుడు, జూదం అలవాటుండవచ్చు జగదీష్‌కి.

శేషుకి తన యిన్వెస్టిగేషన్ చాలా తేలికగా పూర్తవు తున్నందుకు సంతోషం కలిగింది. వాసు వచ్చేలోపలే తనీ కేసు పరిష్కరించగిలడు. వాసు ఆనందాశ్చర్యాలతో ఉక్కిరి బిక్కిరయిపోతాడు. వాసుని మనోఫలకంమీద వూహించుకుంటున్నాడు శేషు.

"రిక్షా వెనక పోవాలా బాబయ్యా...." అన్న రిక్షావాడి పిలుపుతో యీ లోకంలోకి వచ్చాడు శేషు.

"ఆ....ఆ పోనివ్వు!" అన్నాడు.

రిక్షా మళ్ళీ ప్రయాణం సాగించింది.

జగదీష్ రిక్షా మెయిన్ రోడ్‌లోకి తిరిగింది. ఓ మందుల షాపు ముందాగింది. అందులో ఇంగ్లీషు మందులతోబాటు బ్రాందీ, విస్కీ సీసాలు బయటికి తొంగి చూస్తున్నాయి.

జగదీష్ పదిహేను నిమిషాల తర్వాత ఓ చిన్న అట్ట పెట్టెతో బయటికి వచ్చాడు. బ్రాందీ విస్కీ సీసాలు నింపుకొని వస్తున్నాడన్న మాట! మొత్తానికి పరాంకుశం చెప్పినట్టు సకలగుణాభిరాముడిలానే వున్నాడు.

ఆ తర్వాత జగదీష్ రిక్షా సరాసరి వాళ్ళింటివైపు దూసుకుపోయింది. శేషు రిక్షా కూడా దాని వెనుకనే అనుసరించి వెళ్ళింది. జగదీష్ సరాసరి యింట్లోకి వెళ్ళటం చూశాక రిక్షాను తమ యింటికి పోనివ్వమన్నాడు శేషు.

3

శేషు వాచీ చూసుకున్నాడు.

ఉదయం పదకొండు గంటలయింది. 'ఇప్పుడు జగదీష్ ఆయిల్ మిల్లు దగ్గర వుంటాడు. సాయంత్రం వరకు అక్కడే గడుపుతాడు. ఈ సమయంలో అతన్ని ఫాలో కావలసిన పనిలేదు! సాయంత్రమయ్యాకనే అతని చర్యలు గమనించాలి!' అనుకున్నాడు.

శేషు ఆలోచనల మధ్య వుండగానే కాకీ దుస్తులు వేసుకున్న ఓ మధ్యవయస్కుడు లోనికొచ్చి అతనికి నమస్కరించాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు శేషు.

"తమరు డిటెక్టివ్ శేషుగారేనా?" అడిగాడతను.

"అవును ఏం కావాలి?"

"మా అయ్యగారు తమరికి కబురెట్టారు అర్జంటుగా

రమ్మని!"

"ఎవరు మీ అయ్యగారు?"

"పరాంకుశంగారు."

"అలాగా, ఎక్కడున్నారు?"

"జగదీసు బాబింట్లో. ఆళ్ళమ్మగార్తో మాట్లాడు తుండారు."

"నన్నెక్కడికి రమ్మన్నారు?"

"జగదీసు బాబింటికే! ఆరిల్లు మీకు తెలుసంటగందా!"

"ఆ. తెలుసు! ఇప్పుడే రమ్మన్నారా?"

"అవునయ్యా. ఉన్నపళంగా రమ్మన్నారు."

"సరే, నువ్వెళ్ళు!"

శేషు హడావుడిగా లేచాడు. పరాంకుశంగారు తనని యిక్కడ కల్సుకోకుండా జగదీష్ యింట్లో ఎందుకు కలుసుకోమన్నట్టు? బహుశా జగదీష్ తల్లితో అసలు సంగతి చెప్పేశాడేమో! అందుకు తనని సాక్ష్యం వేసుకుంటున్నాడేమో!

శేషు ఆలోచనల మధ్య ఆఫీసుకి తాళంవేసి రిక్షా పిలిచి కూర్చున్నాడు. అనుకోకుండా వాడు నిన్న తనకి కిరాయి కట్టినవాడే! వాడి బనీను, నెత్తిమీది టోపీ అంతా తనకు గుర్తే!

"ఏమిటోయ్, నువ్వేనా? అన్నాడు పలకరింపుగా.

"అవును బాబయ్యా, ఎక్కడికి పొమ్మంటారు? ఎదర రిక్షా ఏదీ లేదండి?" అన్నాడు వాడు.

వాడి సమయస్ఫూర్తికి మెచ్చుకోకుండా వుండలేక పోయాడు శేషు.

"పోనీవోయ్, చెప్తాను!" అన్నాడు శేషు.

"అలాగే బాబయ్యా, కష్టం తెలిసినోరు, మీతో బేరా

లాడను, ఎక్కడికో అడగను!" రిక్షా వాడికి నిన్న తీసుకున్న పదిరూపాయలు కళ్ళముందు కనిపిస్తున్నాయి.

సరాసరి జగదీష్ యింటి ముందాపి రిక్షా దిగాడు శేషు.

"ఉండమంటారా, పొమ్మంటారా బాబయ్యా!" అన్నాడు రిక్షావాడు.

"ఉండు వచ్చేస్తాను" అంటూ లోపలికి అడుగు పెట్టాడు శేషు.

అంతటా నిశ్శబ్దంగా వుంది!

అది మూడు నాలుగ్గదుల డాబా యిల్లు. ఎదుర హాలు. హాల్లోంచి అటు యిటు రెండు గదులు బయటికే కనిపిస్తున్నాయి.

"పరాంకుశంగారూ!" అని పిలుస్తూ హాల్లోకి అడుగు పెట్టాడు శేషు. హాల్లో యెవరూ లేరు! బహుశా ఆయన లోపల యెక్కడో తన చెల్లెలుతో మాట్లాడి వుండివుండొచ్చు అనుకొంటూ కుడిపక్క నున్న గదిలోకి అడుగు పెట్టాడు శేషు!

అంతే, వెనక నుంచి యెవరో తలుపు గొళ్ళెం పెట్టేశారు.

"ఎవరది?...." అంటూ చివుక్కున గుమ్మంవైపు తిరిగాడు శేషు! అప్పటికే తలుపులు మూసుకుపోయాయి!

ఆ గదికి మరో తలుపులేదు.

శేషు కంగారుగా తలుపు దగ్గరకు పరుగెత్తి లాగి చూశాడు. తలుపు రాలేదు.

విస్మయంతో గదిలోకి పరీక్షగా చూసిన శేషు గగుర్పాటుతోను, భయంతోను బిగుసుకుపోయాడు.

గదిలో మంచంమీద జగదీష్ రక్తంమడుగులో పడి వున్నాడు. అతని గుండెల్లో పొడవాటి కత్తి! రక్తం

యింకా ప్రవహిస్తూనే వున్నట్టుంది। అతని ప్రాణం పోయి కూడా ఎంతోసేపు కానట్టుంది।

శేష విభ్రాంతినుండి తేరుకోకముందే యింటి బయట సైరన్ శబ్దం, జీపు ఆగిన సవ్వడి వినిపించింది.

ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తన బలగంతో ఇంటిమెట్లెక్కుతున్నాడు.

4

"అయామ్ సారీ మిస్టర్ వాసూ। ఆధారాలన్నీ మీ శేష హంతకుడని రుజువు చేస్తున్నాయి. ఐ కాంట్ హెల్ప్ యిట్।" అన్నాడు యిన్‌స్పెక్టర్ శ్రీకాంత్.

అతని కెదురుగా డిటెక్టివ్ వాసు కూచుని వున్నాడు. ఆ ఉదయమే అతను బంధువుల యింట్లో పెళ్ళికి హాజరై వచ్చాడు. విజయవాడలో పెళ్ళి। తిరిగొచ్చేసరికి శేషను అరెస్టు చేసిన విషయం తెలిసింది. ఎకాఎకిన పోలీస్‌స్టేషన్ కొచ్చేశాడు.

"మా శేష అలాంటివాడు కాదని మీకు తెలియదా ఇన్‌స్పెక్టర్। నేరస్తుల్ని పట్టి చట్టానికి అప్పగించటమే గాని నేరస్తుడిగా చట్టంముందు యెన్నడూ నిలబడ్డదిలేదు. మొదటిసారిగా అతన్ని మీరు నేరస్తుడిగా పట్టుకున్నారు" వాసు కంఠంలో విచారం ధ్వనించింది.

"ఒక్కోసారి అనుకోకుండా ఆవేశానికి లోనై హత్య చేసిన మహానుభావు లెందరో। అప్పటిదాకా యెలాంటి మచ్చలేనివాళ్ళు అకస్మాత్తుగా హంతకులుగా మారిన సంఘటనలు చాలా వున్నాయి" అన్నాడు శ్రీకాంత్.

"ఏ ఆధారాలతో మా శేషని నిర్బంధించారు?" వాసు అడిగాడు.

"ఆధారాల్లేకుండా ఓ పెద్దమనిషిని అరెస్టు చెయ్యం

మిస్టర్ వాసూ! గూండాలు, పాత కేడీల విషయం అయితే వేరే సంగతి! చెపుతాను వినండి. మొదటి ఆధారం—మీ శేషు దగ్గిర దొరికిన రెండువేల రూపాయలు నంబర్లతో బాటు సరిగ్గా సరిపోయాయి. ఆ డబ్బు నిన్ననే పరాంకుశం గారు అతనికిచ్చి మిల్ టాక్సు కట్టిరమ్మని జగదీష్‌ని పంపారు. జగదీష్ యింటికొచ్చి వెళ్ళేలోపల శేషు అతన్ని ఫాలో అయి అతన్ని చంపి ఆ డబ్బు కాజేశాడు. మీ ఏజెన్సీ ఆఫీస్‌గదిలో డ్రాయరు సొరుగులో డబ్బు దొరికింది!"

"అబద్ధం రెండువేల రూపాయలకోసం ఓ మనిషిని నిలువునా చంపాల్సిన అవసరం, అగత్యం, మా శేషుకి లేవు. అతను డబ్బుమనిషి కాదు. డబ్బుని లెక్కచేసే మనిషికాదు" అరిచాడు వాసు.

"ఆవేశపడొద్దు. నంబర్ టూ! రెండు రోజులు వరసగా జగదీష్ చర్యల్ని శేషు ఓ రిక్షాలో అతన్ని వెంబడించి తెల్సుకున్నాడు. రిక్షావాడు యిచ్చిన సాక్ష్యం అందుకు సరిగ్గా సరిపోయింది. మేము స్పాట్‌కొచ్చేసరికి అదే రిక్షావాడు జగదీష్ యింటి ముందు నిల్చుని వున్నాడు! ఎందుకురా అంటే, లోపలికి ఓ బాబు వెళ్ళాడు. వస్తాను వుండమన్నాడు" అని చెప్పాడు. తర్వాత వాడి నుంచి తక్కిన విషయాలు రాబట్టాం! శేషుని బాగా గుర్తుపట్టాడు వాడు."

వాసు తల విదిలించి, "జగదీష్‌ని ఫాలో కావలసిన అవసరం శేషు కేముంది?" అన్నాడు.

"ఆనుపానులు తెల్సుకుని, అతని డబ్బు చేజిక్కించుకోవటానికి!" శ్రీకాంత్ నవ్వాడు.

"ఇంకా ఏ ఆధారాలున్నాయి మీ వద్ద?"

"జగదీష్ యింటిముందున్న పాన్‌షాపు అతను ఓ రాత్రి సమయంలో శేషు జగదీష్ యింటివైపు కనిపెట్టి చూడటం, తర్వాత జగదీష్‌ని శేషు రిక్షాలో ఫాలో కావటం చూశాడు. ఇవన్నీ యెందుకు? హత్యచేస్తూ హతుడి పక్కనే శేషు దొరికాక అంతకన్న ప్రత్యక్ష సాక్ష్యం ఏం కావాలి?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ 'ఇక మీరు వెళ్లొచ్చు' అన్న ధోరణిలో.

వాసు డీలా పడిపోయాడు. "కొద్దిక్షణాలు శేషుతో మాట్లాడవచ్చునా?" అనడిగాడు.

"దానిదేం భాగ్యం? అలాగే మాట్లాడండి! కాని బెయిల్ కోసం ప్రయత్నించటం అనవసరం! శాంక్షన్ చెయ్యం?" అన్నాడు శ్రీకాంత్.

వాసు లేచి శేషుని రిమాండ్ చేసిన సెల్‌వైపు నడి నాడు.

5

పరాంకుశం పెద్దగా నవ్వాడు.

"ఇదో కొత్త ప్లానా? అసలు జగదీష్‌ని నా కూతిరికిచ్చి చెయ్యటమా? నా కూతురికి యెప్పుడో పెళ్ళయిపోయింది. ఇంకో కూతురు పెళ్ళి కెదికి వుంటేకదా! కొడుకున్నాడు. ఇంకా చదువుకొంటున్నాడు!" అన్నాడు పడి పడి నవ్వుతూ.

వాసుకు కోపమొచ్చినా నిగ్రహించుకున్నాడు.

"మీరు మా శేషుదగ్గరికొచ్చి జగదీష్‌ని గురించి ఎంక్వయిరీ చెయ్యమన్నారు. ఫీజుగా రెండువేల రూపాయ లిచ్చారు. జగదీష్‌ని ఫాలో అయి, అతని అలవాట్లు తెలు సుకోవటానికి శేషుని నియోగించారు. నిన్న మీ మిల్లులో పనిచేసే మనిషిచేత మా శేషుని జగదీష్ యింటికి రప్పిం చారు. అక్కడ జగదీష్ అప్పటికే హత్య చేయబడి

వున్నాడు శేషుని హంతకుడిగా యిరికించేశారు" అన్నాడు వాసు.

"ఎవరు యిరికించారు? నాకా అవసరం లేదే! నాకు కూతురు లేదు. పెళ్ళి ప్రయత్నాలు, ముహూర్తాలు మొదలే లేవు. జగదీష్‌కి తల్లిలేదు. జగదీష్ నా మేనల్లుడు అసలే కాదు! అతను తాగితే నాకేం, జూదాలాడితే నాకేం, వేశ్యావాటికకు పోతే నాకేం? నా మిల్లులో అతనో గుమాస్తాగా నా పనులు చేస్తాడు, జీతం తీసుకుంటాడు. అంతే. మా యిద్దరికీ కనెక్షను!" అన్నాడు పరాంకుశం.

వాసు తల్లక్రిందులై పోయాడు. ఇంతసేపూ శేషును విడిపించటానికి బలమైన ఆధారాలు వున్నాయని ధైర్యంగా వున్నాడు. కాని యిప్పుడు కేసంతా తారుమారయి పోయింది.

ఆ తర్వాత, పరాంకుశం చెప్పిన విషయాలన్నీ కరక్టే నని వాసు ఎంక్వయిరీలో తేలిపోయింది! పరాంకుశానికి యిద్దరే పిల్లలు. కూతురు, కొడుకు! కూతురుకి అయిదేళ్ళ క్రితమే పెళ్ళయిపోయింది!

జగదీష్ పరాంకుశం ఆయిలు మిల్లులో కేవలం గుమాస్తా! స్టాకులు లెక్కలు చూసుకోవటం, బ్యాంకులో డబ్బు కట్టడం, టాక్సులు బిల్లులు వగయిరా చూడటం, ఏజెంట్లకు సరుకు రవాణా ఏర్పాట్లు చూడటం వగయిరా పనులు చూస్తుంటాడు! పరాంకుశానికి ఏ విధంగానూ బంధువు కాడు!

ఇకపోతే పరాంకుశం శేషుని కలిసి మాట్లాడటంగాని, అతనికి డబ్బివ్వటంగాని చూపినవాళ్ళు లేరు! ఏ విధంగానూ శేషుని రక్షించటానికి ఆధారాల్లేవు.

శేషు దురదృష్టవంతుడు. పరాంకుశం పన్నిన వలలో

అమాంతం తగులుకునిపోయాడు। పరాంకుశం తనకి కేసు అప్పగించినపుడు కనీసం జగదీష్ ఎవరో పరాంకుశం యింట్లో నిజంగా పెళ్ళి ఏర్పాట్లు జరుగుతున్నాయో లేదో, తెలుసుకుని వుండాల్సింది పరానకి జగదీష్‌ని వెంబడించ టంతో తన ఎంక్వయిరీ ప్రారంభించాడు. కనీసం పరాం కుశం అడ్రసు తన దగ్గిరుంది కదా పోయి ఓసారి వెరిఫై చేసుకోనన్నా చేసుకోలేదు।

జగదీష్‌ని హత్యచేసింది ఎవరైనా దానికి కారకుడు పరాంకుశం। అతనే చేసి వుండొచ్చు. లేదా చేయించి వుండొచ్చు। కాని అది నిరూపించటానికి ఎలాంటి ఆధా రమూ లేకుండా శేషుని చాలా తెలివిగా ట్రాప్ చేశాడు।

వాసు ఆఫీసులో కూచుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. డ్రాయిరు సొరుగు తీసి, మూసి అస్తవ్యస్తమైన పనులు చేస్తున్నాడు. కాసేపు కూచుంటున్నాడు. కాసేపు లేచి అటు యిటు తిరుగుతున్నాడు. శేషు లేని లోటు కొట్టొచ్చి నట్టు కనిపిస్తోంది. ఖాళీ కుర్చీ అతన్నిచూసి వెక్కిరిస్తోంది.

డ్రాయిరు మూయబోతూ చటుక్కున ఆగాడు. శ్రీకాంత్ మాటలు గుర్తొచ్చాయి. డబ్బుకోసమే జగదీష్‌ని శేషు హత్యచేశాడని రెట్టిస్తున్నాడు. కాని డబ్బు డ్రాయిరు సొరుగు నుంచి స్వాధీనం చేసుకున్నామని శ్రీకాంత్ చెప్పాడు. జగదీష్‌ని డబ్బుకోసమే శేషు హత్య చేశాడని ఆరోపించాడు. మరి అలాంటపుడు డబ్బు స్పాట్‌లోనే శేషు జేబులో దొరికి వుండాలి। అప్పటి కప్పుడు శేషు డబ్బును ఆఫీసులోని డ్రాయిరు సొరుగులో ఎలా పెట్టగలి గాడు?

చక్కటి పాయింట్ దొరికింది. కాని యిదొక్కటే చాలదు, శేషు నిర్దోషి అని నిరూపించుకోవటానికి। పరాం

కుశం పన్నాగం బయటపెట్టాలి! అతనే యీ హత్యకు కారకుడని నిరూపించాలి!

ఎలా....ఎలా?....

6

వాసు ప్రతి నౌఖరును, జగదీష్ విషయం ఆరాతీసి అడిగాడు. ఎవరి మటుకు వాళ్ళు జగదీష్ చాలా మంచి వాడని, యజమాని చెప్పిన పనులన్నీ చాలా బాధ్యతా యుతంగా చేసేవాడనీ చెప్పారు.

ఒకరిద్దరు నౌకర్లు—మిల్లులో పనిచేసే వాళ్ళు—ఆసక్తి కరమైన విషయాలు చెప్పారు.

జగదీష్ ప్రతిరోజు ఖరీదైన బ్రాందీ విస్కీలు తాగుతాడు. అప్పుడప్పుడు గుర్రప్పందాలకు వెళతాడు. స్త్రీలోలుడు. పెళ్ళి కాలేదని ఒకరు, అయిందిగాని భార్య అతన్ని వదిలేసిపోయిందని ఒకరు—యిలా అతనిగురించి భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసినా ఆ యిద్దరు జగదీష్ గురించి చాలా ముఖ్యమైన విషయాలు చెప్పారు.

అయితే సామాన్య గుమాస్తా అయిన జగదీష్‌కి యీ విలాసాలకు, వ్యసనాలకు డబ్బెక్కడినుంచి వచ్చేది? జగదీష్ వుంటున్న డాబా యిల్లు ఎవరిది? అతనిదేనా? దాంట్లో అతనొక్కడేనా, ఎవరయినా వుంటున్నారా?

వాసు ఆ విషయం వెంటనే ఆరాతీశాడు. అంతక్రితం అది పరాంకుశం ఆధీనంలోనే వుండేది! చుట్టుపక్కల వారు, యిరుగుపొరుగువాళ్ళు ఆ డాబా పరాంకుశానిదేనని, తక్కిన వివరాలు తమకు తెలీవని చెప్పారు.

మునిసిపల్ రికార్డ్సు నుంచి, తాలూకా ఆఫీసు రికార్డ్సు నుంచి, ఆ యిల్లు జగదీష్ పేర రాయబడి వున్న నిజాన్ని

తెలుసుకున్నాడు వాసు. అదికూడా జరిగి రెండు నెలలు పూర్తయింది. అంతే!

వాసుకి మంచుతెరలు ఒకటొకటి విడిపోతున్నాయి. ఏదో విషయంలో జగదీష్ చేతిలో చిక్కాడు పరాంకుశం. అందుకు ప్రతిఫలంగా తన యింటి నౌకదాన్ని జగదీష్ పరం చేశాడు. మరి యింతలోనే ఏదో జరిగి వుండాలి! అందుకే జగదీష్‌ని శాశ్వతంగా పైలోకానికి పంపించేశాడు పరాంకుశం!

ఏమిటా చిదంబర రహస్యం? పరాంకుశాన్ని తనవశం చేసుకోగల ఆ రహస్యం ఏమిటి?

వాసు వెంటనే ఆఫీసుకు తాళంపెట్టి ఎక్కడికో బయలు దేరాడు.

ఇల్లు తేలిగ్గానే కనిపెట్టాడు వాసు.

పట్టపగలు పెద్దమనిషి ఆ వీధిలోకి రావటాన్ని కొంత ఆసక్తిగా మరికొంత చిత్రంగా చూస్తున్నారు వీధిలోని జనం.

వాసుకి బెరుగ్గా వుంది. అయినా వెనుకంజ వెయ్యదలచ లేదు. శేషు చెప్పిన గుర్తుల్ని బట్టి సరాసరి యింటిగుమ్మం ఎక్కి ఒక్క అంగలో లోపలికి వెళ్ళాడు.

ఓ యిరవయ్యేళ్ళ అమ్మాయి అతని కెదురు వచ్చింది.

"ఎవరు కావాలండీ?" అన్నది సౌమ్యంగా.

వాసు కొంచెం తడబడి, "అదే జగదీష్ విషయం మాట్లాడాలని వచ్చాను. ఇక్కడ అతనికి తెలిసినవాళ్ళెవరో వున్నారని తెలిసి...." అంటూ ఆమెనే చూడసాగాడు.

ఆమె జగదీష్ పేరు వింటూనే, "ఆఁ! చెప్పండి నేనే!" అన్నది పొడిగా.

వాసు రెండు క్షణాలు తటపటాయించి, "జగదీష్

నెవరో చంపేశారు!" అన్నాడు.

ఆమె షాక్ తిన్నట్టు చూసింది. కాసేపటివరకు ఏం మాట్లాడలేక పోయింది.

"ఏమిటి మీరు చెప్పేది? జగదీష్‌ని చంపేశారా?" అనుకోకుండానే ఆమె కళ్ళవెంట కన్నీరు ధార కట్టింది.

"అవును. రెండు రోజులయింది. అతని హత్య విషయం నేను పరిశోధిస్తున్నాను. నేను డిటెక్టివ్‌ని. మీ నుంచి ఏమైనా వివరాలు తెలుస్తాయని వచ్చాను."

ఆమె కన్నీరు తుడుచుకుని, "ఇది జగదీష్ యజమాని పరాంకుశం పనే అయివుంటుందండి. పరాంకుశం అతని మీద పగబట్టాడు" అన్నది.

"కారణం మీకు తెలుసా?"

"కొంచెం తెలుసు. పరాంకుశం బయటిదేశం నుంచి ఎక్కడ్నుంచో వచ్చే నూనె డబ్బాలని తన గోడౌన్‌లో దాచి తన మిల్లులోని వేరుశనగ నూనెలో కలిపి హెచ్చులాభాలు గడిస్తున్నాడు. ఈ సంగతి జగదీష్‌కి తెలుసు. అతను తిన్నగా వుండక పరాంకుశాన్ని యీ విషయం బయటపెడతానని బెదిరించి డబ్బు సంపాదిస్తున్నాడు. అతని బాధపడలేక జగదీష్‌ని చంపేసుంటాడు."

వాసుకి సమస్య విడిపోయింది.

"పరాంకుశం జగదీష్‌కి యిల్లు రాపిన విషయం మీకు తెలుసా?"

"తెలుసు. అదంతా జగదీష్‌ని తనవైపు తిప్పుకోవటానికి పరాంకుశం ఆడిన నాటకం! ఇల్లు రాపినట్టే రాసి ఆ దస్తావేజులు తనదగ్గరే దాచుకున్నాడు. జగదీష్ తన సంగతి బయటపెట్టడని తనకు నమ్మకం కలిగాకనే అవి అతని కిస్తానని బేరం పెట్టాడు. ఆ యిల్లు నాకు రాస్తానని

జగదీష్ అంటుండేవాడు. అందుకని ఆ సంగతి నాకు తెలిపింది!''

"చాలా సంతోషం అమ్మా! మంచి సంగతులు చెప్పావు. ఇక పరాంకుశం సంగతి నేను చూసుకుంటాను'' అంటూ వాసు చరచర బయటికి వచ్చాడు.

వాసు సరాసరి ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ని కల్సుకోవటానికి స్టేషన్‌కి వెళ్ళాడు.

7

"మీ పార్టనర్‌ని మీ కప్పగిస్తున్నాను. సారీ ఫర్ ది ట్రబుల్! లోకం కళ్ళుగప్పి కల్తీ వ్యాపారంమీద లక్షలు గడించిన పరాంకుశాన్ని మా కప్పగించటమేగాక, మీ శేషుని కాపాడుకున్నారు. ఎంతయినా మీది డిటెక్టివ్ బుర్ర!'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాసువంక ప్రశంసగా చూస్తూ.

శేషు, వాసుని ఆప్యాయంగా కౌగలించుకొని, "థాంక్యూ వెరీమచ్! తెలివి తక్కువగా కేసు ఒప్పుకుని హత్య కేసులో యిరుక్కుపోయాను. నువ్వు సమయానికి ఆదుకున్నావు!'' అన్నాడు.

వాసు సహాయంతో యిన్‌స్పెక్టర్ శ్రీకాంత్, పరాంకుశం గొడౌన్‌మీద అకస్మాత్తుగా దాడి జరిపాడు. గోడౌన్‌లో రహస్యంగా దాచిన నూనె డబ్బాలు బయటపడ్డాయి. అవి ఓ అంతర్జాతీయ సంస్థ భారతదేశంలోని పసిపిల్లలకు పౌష్టికాహార పథకం కింద ఉచితంగా సరఫరా చేస్తున్న సోయాబీన్ నూన్ డబ్బాలు! వాటిని అధికారులు నూనె వ్యాపారస్థులకు చవగ్గా అమ్మేసి పిల్లల పొట్టలుకొట్టి డబ్బు సంపాదిస్తుంటే వ్యాపారులు అధిక లాభాలకు తమ వేరుశనగ నూనెతో ఆ నూనెను కల్తీచేసి లక్షలు ఆర్జిస్తున్నారు.

పరాంకుశం వాళ్ళలో ఒకడు!

పరాంకుశం నేరం మామూలు కత్తీ నేరం కాదు! దాని కన్న చాలా పెద్దది. దేశద్రోహంతో సమానం. చాలా పెద్ద శిక్ష పడుతుంది. అదిగాక హత్యానేరం!

"ఈ పరాంకుశం లోకంమీద యింకెవరూ లేనట్టు నన్నే యీ హత్యలో ఎందుకు యిరికించాడో అర్థంకాలేదు" అన్నాడు శేషు.

వాసు చిన్నగా నవ్వి "నువ్వయితే కేసు పరిశోధన నిమిత్తం జగదీష్‌ని వెంబడించి తిరుగుతావని, తద్వారా నలుగురి దృష్టిలోనూ పడి, నువ్వే హంతకుడివని నిరూపించటానికి సాక్ష్యాలు తేలిగ్గా రుజువవుతాయని ప్లాన్ చేశాడు పరాంకుశం! అందుకే కేసు కూడా అందుకు అనుకూలంగా అల్లుకుని నిన్ను తప్పుదారి పట్టించాడు!" అన్నాడు. □

కామిక్స్ హీరోలు!!



హంతకులకు హంతకుడు



కె.వి.రమణ

చుట్టూ దట్టమైన అడవులతో కూడిన పర్వత పంక్తుల మధ్య మునిపల్లె ఓ చిన్న గిరిజన గ్రామం. గిరిజనుల అలవాట్లూ, ఆచార వ్యవహారాలూ నాగరికుల మనుకునే వారికి విచిత్రంగా ఒకోసారి మరీ అర్ధరహితంగా వుంటుం

టాయి. వారికి గల ఆప్యాయత, ఆవేశాల విషయమూ అంతే! ఒక పట్టాన అర్థంకానివి.

మునిపల్లెవాసులు అయ్యన్న పడాల్, వీరన్న పడాల్, ఇద్దరూ ఒకే తల్లి కడుపున పుట్టిన అన్నదమ్ములు. అయినా తలిదండ్రులు గతించాక వచ్చిన ఆస్థి తగాదాలో అన్న దమ్ములిద్దరూ బద్ధ శత్రువులయ్యారు. వారిద్దరి మధ్యా పచ్చగడ్డి కాదుగదా పచ్చి గంగైనా వేస్తే భగ్గుమనేది.

అయ్యన్న తనకున్న కొద్దిపాటి పొలంలోనూ కాయ గూరలు పండించి వాటిని సంతలకు తోలే దళారీలకు అమ్మేవాడు. వీరన్న వున్న పొలాన్ని కాస్తా అమ్మి పారేసి తన స్వభావానికి తగ్గట్టు పశువుల వ్యాపారంలో దిగాడు.

కొండ ప్రాంతాలలో ప్రతిరోజూ ఏదో ఒకచోటు సంత జరుగుతూ వుంటుంది. అటువంటి సంతలలో పశువులను అమ్ముతూ, కొత్తవి కొంటూ తన జీవనోపాధి సాగిస్తు న్నాడు వీరన్న. నిరంతరం సంతల మూలంగా వూళ్ళు పట్టుకు తిరిగే వీరన్న తన స్వగ్రామమైన మునిపల్లెలో నెలకు ఏ నాలుగైదు రోజులో గడిపేవాడు.

వీరన్న ఒక సంతలో నలుగురు వ్యక్తులతో తగాదా పడ్డాడు. వీరన్న వ్యాపార దృష్టితో వాళ్ళతో ఎంతగా సర్దుకుపోవాలని ప్రయత్నించినా వాళ్ళు తగాదాకే వచ్చారు. వీరన్నను కొట్టేందుకు నలుగురూ కలిసి అతనిపై కలియ బడ్డారు.

వీరన్న తక్కువ తిన్నవాడేం కాదు. చిన్నతనంనుండీ సాముగరిడీలు సాధనలో ఆరితేరిన వజ్ర శరీరమతడిది. మంచితనానికి ఇక అది సమయంకాదని ఆ నలుగురికీ నాలుగు ముఖాలుగా సమాధానమిచ్చాడు వీరన్న పడాల్.

ప్రత్యర్థుల మొహాలు క్షణాలమీద వాడిపోయాయి. ఆ సరికి తగాదాలు దేనికని చుట్టుప్రక్కల వున్న పదిమందీ చేరి విడదీయకపోతే ఆ నలుగురూ తమ యిళ్ళకు నడిచి వెళ్ళడం సాధ్యపడేదే కాదు.

సంత ముగిసాక ఆ రోజుకు స్వగ్రామమైన మునిపల్లెకు మిగిలిన పశువులతోబాటు దారిపట్టాడు వీరన్న. ఆకాశాన్ని అంటే పర్వత శిఖరాలు, ఎటుచూపినా రాక్షసుల్లాంటి వృక్షాలు భయంకరమైన ప్రాంతమది. అయినా వీరన్న ఆ ప్రకృతి ఒడిలోనే పుట్టి పెరిగాడు. భయానికి అర్థం తెలియని మనిషి అతడు.

చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి. కూనిరాగాలు తీస్తూ ముందుకు సాగిపోతున్నాడు వీరన్న చేతిలో కర్రతో పశువుల్ని అదలిస్తూ.

ఇంతలో వికారంగా పళ్ళికిలిస్తూ చేతుల్లో గొడ్డళ్ళూ, బరిసెలూ ధరించిన నలుగురు వ్యక్తులు చెట్ల చాటునుండి వచ్చి వీరన్న తోవకడ్డంగా నిలిచారు.

ఆ నలుగురూ సంతలో వీరన్నతో కొట్లాటకు దిగి తన్నులు తిన్నవారే. వారు నలుగురూ నాలుగు ఇరుగు పొరుగు గ్రామాలకు చెందినవారు. వారి సంగతులన్నీ వీరన్నకు తెలుసు.

వీరన్న చిరునవ్వుతో "ఏందిరా తిరిగి వచ్చారు! ఇంకా కావాల్నా పిడికొట్టుడు!" అన్నాడు వెటకారంగా.

"అదేరా ఈరన్నా అదిగదే తేల్చేందుకొచ్చినం" అంటూ నలుగురూ వీరన్నమీద ఆయుధాలతో విరుచుకు పడ్డారు. వీరన్న కూడా వారి దూకుడుకు ఏమాత్రం జంకక చేతిలో వున్న కర్రను గిర్రున తిప్పుతూ వారి మధ్యకు దూకాడు.

పోరు ఘోరంగా సాగింది. వీరన్న మృగరాజులా విజృంభించాడు. అయినా ఆయుధపాణులయిన నలుగురు శతృవులను ఏకకాలంలో యెదుర్కోవలసి రావడంతో వీరన్న పడాల్ దెబ్బ తినక తప్పలేదు. కింద పడిన వీరన్నను ఆ నలుగురూ కసిదీరా తమ ఆయుధాలతో చీల్చి చెండాడి ఆనక వీరన్నను అలాగే వదలి పారిపోయారు.

సంతనుండి తిరిగివస్తున్న మునిపల్లె వాస్తవ్యులైన గిరిజనులు కొందరు కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న వీరన్నను చూడడం జరిగింది. జరిగిన విషయం చెప్పి ప్రాణాలు విడిచాడు వీరన్న. వారందరూ కలపి వీరన్న శవాన్ని వెంటనే మునిపల్లెకు చేర్చారు. ఈ వార్త క్షణాల మీద మునిపల్లె అంతటా వ్యాపించింది.

ఆ సరికి అయ్యన్న పడాల్ రాత్రి భోజనం చేస్తున్నాడు. గ్రామస్థు డొకడు అయ్యన్నపడాల్ వద్దకు వచ్చి "మీ తమ్ముణ్ణి ఫలానావారు చంపేసార్రా శవాన్ని చూడ్డానికి రా!" అన్నాడు.

అయ్యన్న "అలాగా" అంటూ తల పంకించాడు. అన్నం తినడం పూర్తిచేసి మూతి తుడుచుకుంటూ మూల నున్న కర్ర తీసి "నేను పొలంలోకి పోతున్నా యిల్లు జాగ్రత్త!" అని పెళ్ళాన్ని కేకేసి కిర్రు చెప్పులతో పొలం కేసి నడిచాడు. అయ్యన్నకు వీరన్న చావును గురించి చెప్పిన గ్రామస్థు ముక్కున వేలేసుకుంటూ "ఎంత వైరం అయితే మాత్రం" అనుకున్నాడు ఆశ్చర్యంగా.

2

అర్ధరాత్రి గడిచింది. వీరన్న శవాన్ని వాకిట్లో పెట్టు కొని అతడి భార్య అదేపనిగా రోదిస్తున్నది. పిల్లలు ఏడ్చీ ఏడ్చీ అలాగే నిద్రలోకి జారుకున్నారు.

"అన్నకే పట్టనిది మన కెందుకు? అదేదో వుదయం చూడొచ్చులే" అని యిరుగుపొరుగువారు నెమ్మదిగా ఒక రొకరే జారుకున్నారు. ఆ నిశ్శబ్దనిశీధిలో సన్ననిగొంతుతో వీరన్నభార్య ఏడుపు తప్ప మరేంలేదు.

వీరన్న యింటిముందు ఒంటినిండా దుప్పటి కప్పుకొని ఒక మానవాకారం నిలుచుని వుంది. దీపం వెలుతురులో ఆ ఆకారాన్ని గుర్తించిన వీరన్నభార్య ఏడుపు మరింత పెద్దదయింది. ఆ వ్యక్తి వులుకూ పలుకూ లేకుండా వీరన్న శవాన్ని సమీపించాడు.

దీక్షగా శవాన్ని కొద్ది క్షణాలు చూపిన ఆ వ్యక్తి చేతులు క్రమంగా బిగుసుకోసాగాయి. వీరన్న శరీరంపై గాయంలేని చోటు లేదు చిత్రవధ! ఆ వ్యక్తి కళ్ళలో నీళ్ళు సుడులుతిరిగాయి.

వీరన్న తలను ఆప్యాయంగా స్పృశించి నెమ్మదిగా చీకట్లో కలసిపోయాడు అయ్యన్నపడాల్.

ఇంటికి చేరిన అయ్యన్న చూరులో దోపిన వేటుకత్తిని బయటకు లాగాడు. తెల్లవారి కట్టెలు కొట్టి తెచ్చేందుకని సాయంత్రమే పదునుపెట్టాడు దానికి. చీకటిలో సయితం కత్తి అంచులు తళతళ మెరిసేలాగున్నాయ్.

ఊరిబయట చెట్టంత దేవతా విగ్రహం ముందు వేటు కత్తిని వుంచి మోకాళ్ళమీద కూర్చొని కొద్ది క్షణాలు ధ్యానంలో వుండిపోయాడు అయ్యన్న. చీకటి పడినాక ఆ ఛాయలకు మనిషల్లె ప్రజలెవరూ రారు. రాత్రివేళలో అక్కడ దేవి తిరుగుతూ వుంటుందనీ, ఆ సమయంలో కంటపడిన వాళ్ళను దేవి బ్రతకనియ్యదనీ అందరూ చెప్పు కుంటారు.

అయ్యన్న కనులు తెరచి దేవి పాదాలమీద వున్న

కుంకుమను అరచితితో నొసట అద్దుకున్నాడు. వేటుకత్తిని అందుకొని తలెత్తి ఆకాశంవంక చూసాడు.

ఆ క్షణంలో అయ్యన్న మృత్యుదేవత ఆజ్ఞను పాటించే భృత్యుడిలా అగుపిస్తున్నాడు. ఆకాశంలోని నక్షత్రాలనుబట్టి సమయాన్ని అంచనా వేసాడు. సమయం యెక్కువలేదు. తెల్లారేందుకు నాలుగైదు గంటల సమయం మాత్రమే వుంది. ఈలోగా తాను చాలా దూరం పయనించాల్సి వుంది.

ప్రత్యర్ధులు నలుగురూ నాలుగుగ్రామాలకు చెందినవారు. ఒక్కొక్క గ్రామానికీ దాదాపు పదిమైళ్ళ దూరం. తెల్లారే లోగా ఈ కార్యాన్ని తాను సాధించగలడా? సాధించి తీరాలి! అదే అతడి పట్టుదల.

అయ్యన్న యిక ఏ మాత్రం జాగు చేయకుండా వేటుకత్తిని జారిపోని విధంగా వీపున కట్టుకున్నాడు. మనసార దేవిని ధ్యానించి దుష్టశిక్షణలో తనకు అండగా వుండమని ప్రార్థించి ఒక్కసారిగా పరుగు ప్రారంభించాడు.

కొండదారులలో రాళ్ళను, గోతులను, చెట్టుచేమలను అతి లాఘవంగా అధిగమిస్తూ వాయువేగంతో ముందుకు సాగిపోతున్నాడు అయ్యన్న. నల్లని అయ్యన్న మరింత నల్లని ఆ నిశీధిలో ఆహారాన్ని తరుముకుపోయే నల్ల చిరుతలా వున్నాడు.

అయ్యన్న అదృష్టంగా కాలం చెల్లిన వీరన్న హంతకులు ఒకరొకరే తమ నివాసాలవద్ద అయ్యన్న చేతిలో హతమైపోయారు. నలుగురు ప్రత్యర్ధులలోనూ ఇద్దరు ఆరుబయట చల్లగాలిలో నిద్రిస్తూ తమకు తెలియకుండానే అయ్యన్న చేతిలోని వేటుకత్తికి బలైపోయారు. మిగిలిన ఇద్దర్నీ ఇంట్లో నిద్రిస్తున్నవాళ్ళనే ఎవరో పిలుస్తున్నట్టుగా

పిలిచి బయటకు వచ్చీరాగానే ఒక వేటుతో తన పని పూర్తి చేసాడు అయ్యన్న.

ఈ మారణహోమంలో మానుపల్లి అనే గ్రామాన మాత్రం అయ్యన్న హత్య చేస్తుండగా ఒకరుచూసి కేకలు వేయడం జరిగింది. ఏది ఏమైనా అయ్యన్న తన మారణ హోమం పూర్తయేంతవరకూ ఆగలేదు.

అయ్యన్న తన పనిని దిగ్విజయంగా ముగించి ఇంకా కొద్దిపాటి చీకటి వుండగానే తన గ్రామం పొలిమేరలలో ప్రవహిస్తున్న వాగును చేరుకున్నాడు.

రక్తపితమైన బట్టలను ముక్కలుగా చించి వాగునీటిలో పారేసాడు. వేటుకత్తిని వాగులోకి విసిరేసాడు. వాగులోకి దిగి శుభ్రంగా స్నానంచేసి ఎవరికంటా పడకుండా యిల్లు చేరుకున్నాడు. ఇంతా చేసి అయ్యన్న ఒంటిమీద చిన్న గాయం కూడా లేదు!

ఇంట్లో ప్రవేశిస్తూనే అయ్యన్న గదిలో ఒక మూల నేలను త్రవ్వి ఒక ఇత్తడి బిందెపైనున్న మూతను తొలగించాడు. తళతళ లాడుతూ పురాతనమయిన వెండి రూపాయలు దర్శనమిచ్చాయి.

కొండజాతికి వెండి ప్రాణంతో సమానం. వెండికిచ్చే విలువ బంగారానికూ్కడా యివ్వరు. అయ్యన్న వెండి రూపాయలను ఒక గుడ్డలో పోసి మూటకట్టి, ఆ మూటను చద్దిమూటలా ఒక కర్రకు కట్టి కట్టెలకోసం అడవికి వెళ్ళే వాడికిమల్లే బయలుదేరాడు.

దారిలో అతనికి కులపెద్ద ఎదురై "అదేంరా అయ్యన్నా! నువు నీ మానాన అడవికి బోతే ఆడ నీ తమ్ముడి శవం సంగతి చూసేదెవడ్రా. విరోధముంటే అది ఆడి చావుతోనే మాసిపోవాల మరి!" అన్నాడు.

అయ్యన్న కులపెద్దకు ఏ సమాధానమూ యివ్వకుండా ముందుకు సాగిపోయాడు. వెనుతిరిగి అయ్యన్ననే చూస్తూ తనలో ఏదో గొణుక్కుంటూ వూళ్ళోకి నడిచాడు ఆ శత వృద్ధు.

అడవిలో ప్రవేశించిన అయ్యన్న గొడ్డలి ఒకచోట దాచి మూటను పట్టుకొని యెవరి కంటా పడకుండా అడవికి ప్రక్కగా వున్న హైవేను చేరాడు. ఆ హైవేమీదుగా ప్రతి నాలుగైదు నిముషాలకూ యేదో ఒక లారీ వెళుతూనే వుంటుంది.

సరుకులతో వెళుతున్న ఒక లారీని ఆపి అక్కడికి సుమారు పాతికమైళ్ళ దూరంలో వున్న పట్టణానికి బయ ల్దేరాడు అయ్యన్న. ముప్పావుగంటలో అయ్యన్నను పట్ట ణంలో దింపి తన దారిన పోయింది లారీ. డ్రైవరుచేతిలో ఐదు రూపాయలుంచాడు అయ్యన్న.

3

అయ్యన్న పట్టణంలో పేరుమోపిన క్రిమినల్ లాయర్ రంగనాధం యింటికి వెళ్ళాడు. కొన్నాళ్ళ క్రిందట వూళ్ళో జరిగిన గొడవల్లో అయ్యన్న కోర్టుకు రావడం జరిగింది. అప్పుడు రంగనాధమే వారి తరపున ప్లీడర్.

రంగనాధం అఖండుడు. నిజాన్ని నిజంగా ఒప్పించడం కంటే అబద్ధాన్ని నిజంగా నిరూపించడమే అతడికి సులభం. కోర్టులో యువరానర్ అంటూనే చేతిలో చిట్టెలుకను చూపిస్తూ యిది ఆఫ్రికా ఏనుగు అని తన వాదనతో నెగ్గుతాడు. అదీ రంగనాధంలో వున్న గొప్పతనం.

అయ్యన్న వెళ్ళిన సమయానికి రంగనాధం తీరుబడిగా యింట్లోనే వున్నాడు. అయ్యన్నను చూస్తూనే "ఏరా! అయ్యా! వూర్లో అందరూ కులాసాయేనా? ఏంటీ సూర్యుడు

పుదయించక ముందే వచ్చేసాప్!" అన్నాడు రంగనాధం చనువుగా. అదే రంగనాధంలో వున్న ప్రత్యేకత. ఒకసారి తెలిసిన మనిషి పూరూ పేరుతో సహా అతని బుర్రలో వుండిపోవలసిందే.

అయ్యన్న "చిత్తం" అంటూ మరే మాట లేకుండా మూటగట్టిన బిందెడు వెండి నాణాలు అతడిముందు రాశి పోశాడు. కిటికీలో నుండి గదిలో పడుతున్న సీరెండలో తెల్లని వెండిరూపాయలు కళ్ళు మిరుమిట్లు గొలిపేలా ప్రకాశిస్తున్నాయి. రంగనాధం యిదంతా దేనికో అర్ధంకాక తన ముందున్న వెండిగుట్టనే నిలువుగుడ్లేసుకు చూస్తూ వుండిపోయాడు.

"బాబుగారూ! ఇవి యెన్ని కాసులో ఈటి విలువెంతో నాకు తెల్దు. నాకున్న ఆస్థంతా యిదే. తక్కువే కానీండి యెక్కువే కానీండి ఇది మీది. నేను గొప్ప నేరం చేశాను. అందుకు నాకు ఉరిశిక్ష ఖాయం. చచ్చిపోతాననే భయం నాకు లేదు. నా పిల్లలకోసం నేను బతకాలి. అంతే! ఆ పైన మీ దయ! ఆ దేవుడి దయ" అన్నాడు అయ్యన్న.

రంగనాధం వెండికుప్పను మరొకమారు తనివితీరా చూసి కాళ్ళు పైకెత్తి సోఫామీద పెడుతూ "ఒరేయ్! ముందు అవన్నీ మూటకట్టి, ఇలా సోఫాకింద తోసేయ్" అన్నాడు.

అయ్యన్న అలాగే చేసాడు. అప్పుడు రంగనాధం సోఫాలో బాసింపట్టువేసి "ఇప్పుడు చెప్పరా! నువ్వు యేం చేసివచ్చినా ఫరవాలేదు. ఎన్ని పీకలు కోసినా భయంలేదు. కనీసం సూది దూరే సందు నాకివ్వు! మిగతాది నే చూసుకుంటాను!" అన్నాడు.

అయ్యన్న తన సంగతి యావత్తూ అంటే తనకూ

వీరన్నకూ గల వైరం లగాయితూ వీరన్న చావూ, అతని చావుకు కారకులయినవారిని తను చంపడం అంతా విశదంగా రంగనాధం ముందుంచాడు.

అంతా విని రంగనాధం రెండు మూడు నిముషాలు కళ్లు మూసుకొని ఏకదీక్షగా ఆలోచిస్తూ వుండిపోయాడు. ఆనక నెమ్మదిగా కనులు తెరచి, "ఒరేయ్ అయ్యన్నా! నువ్వు నా దగ్గరికి రావడం చూసిన వాళ్ళెవరన్నా వున్నారా?" అన్నాడు. అయ్యన్న "లేరు!" అన్నట్టుగా తల అడ్డంగా వూపాడు.

"మంచిది! వెళ్ళేటప్పుడు కూడా అదే జాగ్రత్తలో వుండు మునుపల్లి ప్రత్యక్ష సాక్షివల్లనూ, వీరన్న తరపున ప్రతీకారం తీర్చుకునేందుకు అవకాశం వున్న వ్యక్తివి నువ్వొక్కడవే అయిన కారణంగానూ పోలీసులు నిన్ను అరెస్టు చేసేందుకు అవకాశాలు వున్నాయ్. అరెస్టుచేస్తారు కూడా! అయినా నువ్వేం కంగారుపడి పెదవి విప్పకు. నిన్ను అరెస్టుచేసిన వెంటనే ఆ కబురు ఏదోలా నాకు అందజెయ్! మిగతా సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు రంగనాధం.

అయ్యన్న రంగనాధంవద్ద సెలవు పుచ్చుకొని లారీమీద తిరిగి అడవి చేరాడు. ఆ సరికి సూర్యుడు నడినెత్తిన వున్నాడు. త్వర త్వరగా అడవిలో తాను గొడ్డలి దాచిన ప్రదేశాన్ని చేరి చేతికి అందిన చెట్టుకొమ్మను నాలుగు ముక్కలుగా నరికి మోపుకట్టి వాటితో వూరుదారి పట్టాడు అయ్యన్న.

అయ్యన్న యింటికి చేరేసరికి పోలీసులు వాకిట్లో బేడీలతో సయితం సిద్ధంగా వున్నారు. పోలీసులు అయ్యన్నను అరెస్టుచేసి తీసుకుపోయారు.

4

విచారణ ప్రారంభమయింది.

అయ్యన్న తరపున క్రిమినల్ లాయర్ రంగనాథం కోర్టుకు హాజరయ్యాడు. కోర్టు జనంతో క్రిక్కిరిసి పోయింది.

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ముద్దాయి తమ్ముడైన వీరన్నను, ముద్దాయి అయ్యన్న చేతిలో దారుణంగా చంప బడ్డ నలుగురూ, సంతలో జరిగిన తగాదా కారణంగా, సంత ముగిసిన తరవాత దారికాచి చంపడం జరిగింది. ఆ కార ణంగా ముద్దాయి అయ్యన్న తన తమ్ముణ్ణి చంపిన నలుగురి పైనా, కక్షగట్టి అదేరోజు రాత్రి 1 గం॥ నుండి ఐదు గంటల లోపున, ఆ నలుగురినీ ఘోరాతిఘోరంగా కత్తితో నరికి చంపాడు. ప్రాసిక్యూటర్ శివయ్య ముద్దాయి అయ్యన్నపై పై విధంగా నేరారోపణచేస్తూ తమ తరపున ఏకైక సాక్షిగా మానుపల్లి వాస్తవ్యుడయిన రాజయ్యను కోర్టులో ప్రవేశపెట్టాడు.

రాజయ్య "తాను నలుగురు హతులలోనూ ఒకడయిన గురవయ్యకు పొరుగువాడిననీ, గురవయ్య హత్య జరిగిన నాటి రాత్రి యెప్పటిలాగే భోంచేసి ఆరుబయట పడుకున్నా ననీ, తాను నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూ వుండగా సుమారు పదిగంటల ప్రాంతంలో గురవయ్య కూడా తన మంచం ప్రక్కనే వేరొక మంచం వేసుకు పడుకున్నాడనీ, ఇద్దరం కాసేపు ఆ మాటా ఈ మాటా అనుకొని నిద్ర పోయామనీ సుమారు రెండూ మూడూగంటల ప్రాంతంలో ఏదో అలికిడికి కళ్ళు తెరచిన తనకు ప్రక్క మంచంమీద కాళ్ళూ చేతులూ కొట్టుకుంటున్న గురవయ్యా, చేతిలో పెద్ద కత్తితో పారిపోతున్న అయ్యన్నా కనుపించారనీ తాను

భయంతో కేకలు వేసానని" చెప్పాడు.

రంగనాథం క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు రాజయ్య ముందుకు వచ్చాడు. కళ్ళజోడు సవరించుకొంటూ "మాడు బాబూ! నీ పేరేంటన్నావ్?" ప్రశ్నించాడు రంగనాథం.

"రాజయ్యండి!" వినయంగా జవాబిచ్చాడు రాజయ్య.

"ఆఁ! చూడు రాజయ్యా నీకూ అయ్యన్నకూ ఏవన్నా విరోధా లున్నాయా?"

"అబ్బే? అలాంటివేం లేవండీ! నాకు గురవయ్యెంతో అయ్యన్నా అంతే! కాకపోతే చూసింది చూసినట్టుగా చెబుతున్నానంతే! అదేం తప్పుగాదు గదండీ!"

"ఎంతమాత్రం కాదు! అలాగే నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను. నీకు తెలిసింది తెలిసినట్టే చెప్పాలి. ఏం!"

"తప్పకుండా నండి!"

"ఆఁ! అలా వుండాలి నిజాయితీ అంటే. అదిసరే! ఆ రోజు జరిగిన సంతలో వీరన్నా నలుగురు వ్యక్తులూ తగాదాపడిన విషయం నీకు తెలుసా?"

"ఎందుకు తెలవదండీ! ఆ నలుగురిలో గురవయ్య కూడా వున్నాడుగదండీ!"

"మరయితే తరవాత వీరన్నను దారికాపి చంపిన నలుగురిలోనూ గురవయ్య వున్నాడని నీకు తెలుసా?"

రాజయ్య కొంచెం ఇబ్బందిగా బుర్ర గోక్కున్నాడు. ప్రాసిక్యూటర్ శివయ్య కుర్చీలో అటునుండి యిటు ఒత్తిగిల్లాడు అసహనంగా.

"చెప్పు! నీకు తెలిసింది తెలిసినట్టేచెబుతానన్నావుగా?" రెట్టించాడు రంగనాథం.

"అంత ఖచ్చితంగా తెలీదుగానండీ! ఆ నలుగురూ ఆ

రోజు సంతలో వీరన్నతో గొడవపడినవాళ్ళే అని అందరూ అనుకోవడం మాత్రం విన్నాను.”

“హత్యకు ముందు గురవయ్యా నువ్వూ ఏవో మాట్లాడు కున్నా రన్నావుగా అప్పుడు యీ విషయాలేమయినా మాట్లాడారా?”

“అందరూ వీరన్నను చంపిన వాళ్ళలో నువ్వూ వున్నా వని అనుకుంటున్నారు. ఆ మాట ఎంతవరకూ నిజం” అని అడిగాను అన్నాడు రాజయ్య.

“ఆ మాటకు అతనేం చెప్పాడు.”

“నవ్వి వూరుకున్నాడంతే!”

అప్పుడు నీకేవనిపించింది. గురవయ్య వారిలో ఒకడనే భావన నీకు కలిగిందా?”

ఆ ప్రశ్నకు శివయ్య తీవ్రంగా అభ్యంతరం తెలుపుతూ “యువరానర్! డిఫెన్సు లాయరుగారు తలా తోకా లేని ప్రశ్నలు వేస్తూ సాక్షిని కన్ఫ్యూజ్ చేయాలని ప్రయత్ని స్తున్నారు. ఇప్పుడు విచారిస్తున్నది గురవయ్య హత్యను గురించి. విరన్న హత్యను గురించి సాక్షి ఏమనుకున్నా దానికీ దీనికీ ఎటువంటి సంబంధమూ లేదు” అన్నాడు.

జడ్జి రంగనాథం మొహంలోకి ప్రశ్నార్థకంగా చూశారు.

రంగనాథం వినయంగా తల వంచుతూ “వున్నది యువరానర్! ఈ కేసులో ఏకైక ప్రత్యక్ష సాక్షిగా రాజయ్య ప్రవేశపెట్టబడ్డాడు. అతడు అన్నదానికీ అనుకున్న దానికీ ఈ కేసులో ఎంతో ప్రాధాన్యం వుంది. ఆ విష యాన్ని నేను ఇక కొద్ది నిముషాల్లో తెలియపర్చగలను” అన్నాడు.

“అబ్జక్షన్ ఓవర్ రూల్డు! యూ కెన్ ప్రొసీడ్!” అన్నాడు జడ్జి.

"థాంక్యూ యువరానర్!" అంటూ "చెప్పు రాజయ్యా ఆ నలుగురిలోనూ గురవయ్య వున్నాడని నీకనిపించిందా?"

రాజయ్య తిరిగి బుర్ర గోక్కుంటూ "అవునండి! గురవయ్య నవ్విన తీరు నాకలాగే అనిపించిందండి" అన్నాడు.

రంగనాథం చిరునవ్వుతో ఇప్పుడేమంటావ్ అన్నట్టు శివయ్యను చూసాడు. శివయ్య బదులుగా అప్పుడే ఏమయింది అన్నట్టు మందహాసం చేసాడు.

రంగనాథం తిరిగి రాజయ్యను ప్రశ్నిస్తూ "రాజయ్యా! గురువయ్య హత్య జరిగిన సమయంలో బాగా వెన్నెల కాస్తోందా!" అన్నాడు తాపీగా.

"అబ్బే బాగా చీకటేనండి!"

"మరయితే చీకటిలో నువు చూసిన వ్యక్తి అయ్యన్నే అని అంత స్పష్టంగా ఎలా చెప్పగలవు?"

ఆ ప్రశ్నకు రాజయ్య కొంచెం తడబడుతూ "అబ్బే చీకటంటే మనిషిని పోల్చలేనంతటి చీకటి కాదండి అదీగాక నే నతణ్ణి కొంచెం దగ్గరగానే చూసానండి!" అన్నాడు.

"మరి అంత దగ్గరలో వున్న వ్యక్తిని నువ్వెందుకు పట్టుకోలేదు. కనీసం ఆపేందుకయినా ఎందుకు ప్రయత్నించలేదు?"

"ఏదండీ! అతణ్ణి నేను చూసింది ఒకే వొక క్షణం. యిలా కనిపించి అలా మెరుపులామాయమయిపోయాడు."

"అంటే కటిక చీకట్లో ఒకే ఒకక్షణం నిద్ర కళ్ళతో చూసిన వ్యక్తి ఫలానా అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?" ఈసారి చాలా గట్టిగా ప్రశ్నించాడు రంగనాథం.

రాజయ్య దిక్కులుచూస్తూ తల వంచుకుని "మరి నాకా క్షణంలో అతడు అయ్యన్నలాగే అనిపించాడండి" అన్నాడు

నెమ్మదిగా.

రంగనాథం వెంటనే "యువరానర్! ప్లీజ్ నోట్ దిస్ పాయింట్! దట్సాల్!" అంటూ తన సీట్లోకి పోయి కూర్చున్నాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివయ్య లేచి "యువరానర్! ప్రత్యక్ష సాక్ష్యం ఆధారంగా మానుపల్లిలో గురువయ్యను ముద్దాయి హత్యచేసినట్టుగా రుజువవుతోంది. మిగిలిన మూడు హత్యలనూ అదేమాదిరి ఇదే ముద్దాయి చేసాడు. అందుకు తగిన కారణాలు మనకు కనిపిస్తూనే వున్నాయి.

హతులు నలుగురూ ముద్దాయి తమ్ముడయిన వీరన్నను చిత్రహింసల పాల్జేసి ఘోరంగా చంపి వుండవచ్చుగాక! అంతమాత్రాన ప్రతీకారం పేరిట ఎవడికి తోచిన విధంగా వాడు చేసుకుపోతే ఇక ఈ పోలీసులూ, ఈ చట్టం ఇదంతా దేనికోసం. ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు ప్రతిహింస సమస్యకు పరిష్కారం కారాదు. అందుచేత చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలనుకునే ఇటువంటి నేరస్థులను తీవ్రంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా వుందని కోర్టు వారికి విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ తన వాదన ముగించాడు.

రంగనాథం సీట్లోనుండి లేచి తన గొంతూ కళ్ళజోడూ ఒకేసారి సవరించుకుంటూ "యువరానర్! ప్రాసిక్యూటర్ వారు చెప్పినట్టు చట్టాన్ని గౌరవించడంలో ఎవరికీ ఎటువంటి అభ్యంతరమూ వుండదు. వుండకూడదు. కాని నా క్లయింటు అయ్యన్న పూర్తిగా నిర్దోషి. అతనిపై మోపబడిన హత్యానేరం అవాస్తవం, అభూతకల్పన.

ప్రాసిక్యూషన్‌వారు నేరం చేయడంలో ముద్దాయికి గల సాధ్యాసాధ్యాల విషయం ఏమాత్రం పట్టించుకోక

పోవడం అత్యంత శోచనీయం. హతులు నలుగురూ నాలుగు గ్రామాలకు చెందినవారు. హత్యలు రాత్రి ఒంటి గంట నుండి ఐదుగంటలలోపున జరిగినట్టు పోలీసుల రిపోర్టులవలన తెలుస్తోంది.

అంటే కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే ఆ నాలుగు హత్యలూ జరిగాయన్న మాట. ఒకే వ్యక్తి మొదటి హత్య ప్రారంభించి నాలుగు హత్యలూ పూర్తిచేసి తిరిగి తన గ్రామాన్ని చేరేందుకు నలభై మైళ్ళకు మించి ప్రయాణం చేయాల్సి వుంది. కారు చీకటిలో చెట్టు పుట్ట లతో కూడిన అడవి మార్గాన నాలుగే నాలుగు గంటలలో నలభై మైళ్ళ దూరాన్ని కాలి సత్తువున పూర్తిచేయడం ఒలింపిగ్ ఆటగాడికైనా అసాధ్యమని నేను ఘంటాపథంగా చెప్పగలను.

యువరానర్! అంతేగాకుండా ఈ కేసు నడిపిన పోలీసు వారికి సరయిన వాస్తవ దృక్పథం సయితం లేకపోవడం మరీ విచారించ దగ్గ విషయం. నా క్లయింటు అయ్యన్నకూ అతని తమ్ముడు వీరన్నకూ ఏమాత్రం సరిపడని విషయం జగద్విదితం. ఆ సంగతిని మునిపల్లెలో ముక్కు మూసుకు కూర్చున్న మునీశ్వరుడయినా చెప్పగలడు. హత్యచేయ బడిన తర్వాత వీరన్న శవాన్ని చూసేందుకైనా వెళ్ళని వ్యక్తి అతడి తరపున నే నున్నానంటూ ప్రతీకారంగా ఇంతటి ప్రమాదకరమైన పని చేయగలడని ఎవరైనా నమ్ముతారా?

యువరానర్! ఇక మిగిలిందల్లా మానుపల్లి ప్రత్యక్ష సాక్షి రాజయ్య సాక్ష్యాన్ని పరికిస్తే అదీ నమ్మతగిందికాదు. నిద్ర మత్తులో హఠాత్తుగా లేచిన రాజయ్య ఆ చీకటిలో ఒకే ఒక క్షణం కనబడిన మొహాన్ని చూపి అయ్యన్నదిలా

వుందని అస్థిరత్వపు అంచులమీద నిలబడి సాక్ష్యమిచ్చాడు. ఇక్కడ మనం మరొక విషయాన్ని జాగ్రత్తగా ఆలోచించాలి.

మానుపల్లి హతుడయిన గురవయ్యా ఆ రోజున సంతలో వీరన్నతో తగాదాపడిన వారిలో ఒకడని రాజయ్యా గురవయ్యా హత్యకు ముందే తెలుసు. ఇంతకు మునుపు రాజయ్యా కోర్టులో చెప్పిన విషయాన్ని బట్టి వీరన్నను హత్యచేసిన వారిలో, గురవయ్యా ఒకడని రాజయ్యా భావిస్తున్నట్టు మనకు తెలుస్తోంది. ఈ కారణంగా గురవయ్యాను హత్యచేసి పారిపోతున్న వ్యక్తిని, తన తమ్ముడి చావుకు ప్రతీకారం చేయవచ్చిన అయ్యన్నగా రాజయ్యా భ్రమపడడంలో వింతేమీ లేదు. అదొక సైకలాజికల్ ఫీలింగ్! అంతే!

యువరానర్! తొలినుండీ ఈ కేసును పరిశీలించుకుపోతే పోలీసులు ఈ కేసులో అపోహలతో కూడిన అర్ధరహిత విచారణతో ముద్దాయి చుట్టూ ఒక కథను అల్లుకుపోయారు, అంతే తప్ప వీరి ఆరోపణలో ఏమాత్రం సత్యం లేదు, పగ అంతకన్నా లేదు. కావున ధర్మాధర్మ విచక్షణ చేసి నిర్దోషి అయిన నా క్లయింటును విడిపించవలసిందిగా న్యాయమూర్తులను కోరుతున్నాను" అంటూ తన తరపున వాదన ముగించాడు రంగనాథం.

ఇరువురి వాదనలూ విన్నమీదట, ముద్దాయి అయ్యన్న నేరం చేసినట్టుగా ప్రాసిక్యూషన్ సరయిన ఋజువులు చూపలేకపోయిన కారణంగానూ, వున్న ఆ కొద్దిపాటి సాక్ష్యాధారాలూ లోపభూయిష్టంగా వుండిన కారణంగానూ, డిఫెన్సు వాదనతో ఏకీభవిస్తూ ముద్దాయిని విడిచి పుచ్చారు న్యాయమూర్తి. □

భజనబృందం

ప్రతాప రవిశంకర్

డాబామీద కుర్చీ వేసుక్కూర్చున్నాను. రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. డాబామీద చీకటిగా వున్నది.

నా వేళ్ళమధ్య సిగరెట్ ఎర్రగా కాలుతోన్నది. నా కళ్లు ఎదురుగా వున్న మేడమీదికే వున్నాయి. అది రెండతస్థుల మేడ. ఆ మేడలో కంట్రాక్టరు కనకలింగం వుంటున్నాడు.

అతను మంచి ధనికుడు. అతడి కొడుకు అమెరికాలో చదువుతున్నాడు.

కూతురు ఇక్కడే మెడిసన్ చదువుతోంది. ఆ అమ్మాయి పేరు రాణి. చాలా అందంగా వుంటుంది. ఆమె అందం నన్ను ఎప్పుడూ కలవరపరుస్తూ వుంటుంది. ఒక్కసారి ఆమె పెదవులమీద సున్నితంగా ముద్దు పెట్టుకోగలిగే అదృష్టం నాకు కలుగుతోందా అని ఎప్పుడూ ఆలోచిస్తూ వుండేవాడిని.

ఆమె తండ్రికి రాణి అంటే ప్రాణం. ఆమె సంతోషం కోసం అతను ఏ పని చెయ్యటానికయినా సిద్ధపడతాడని నాకు తెలుసు.

కనకలింగం లావుగా—పొడుగ్గా వుంటాడు. అతను ఎప్పుడూ ఖరీదైన బట్టలు వేసుకుంటాడు. మూడైదుల సిగరెట్టు పెట్టె—లైటర్ అతని చేతిలో ఎప్పుడూ వుంటాయి.

అతనికి దైవభక్తి బాగానే ఎక్కువ. అందుకు అతని ఇంట్లో ప్రతి శనివారం జరిగే భజనే గొప్ప నిదర్శనం.

కనకలింగం ఇంట్లో ప్రతి శనివారం భజన జరుగుతుంది. ఆ భజనకు చాలామంది బాబాలు హాజరు అవుతారు.

రాత్రి ఎనిమిది గంటలనించి పది గంటల వరకు భజన జరుగుతుంది. ఆ తర్వాత ప్రసాదం పంచిపెడతాడు బాబా అందరికీ గురువైన ఒక ముసలి బాబా. తర్వాత ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు.

రెండు నెలల క్రితం నేను ఆ గదిలోకి అద్దెకు దిగాను. అప్పటినించీ ప్రతి శనివారం ఆ బాబాల భజనని డాబామీద నించి చూస్తూనే వున్నాను.

ఎనిమిది గంటలు దాటుతూ వున్నప్పుడు బాబాలందరూ భజనకు చేరుకున్నారు.

భజన మొదలయ్యింది.

ముందుగా ముసలి బాబా కృష్ణుడిమీద ఒక పాటను అందుకున్నాడు. మిగిలిన బాబాలందరూ తాళాలు మోగిస్తూ దాన్ని పాడుతున్నారు.

తెరచివున్న తలుపుల్లో నించి ఆ బాబాల భజన నాకు క్లియర్‌గానే కనిపిస్తోంది.

కనకలింగం కూడా పట్టు బట్టలు కట్టుకుని తన్మయంగా భజనలో మునిగిపోయాడు.

భజన చూస్తున్నాను.

నా దగ్గర వున్న సిగరెట్లు అయిపోయాయి.

కిందికి వెళ్ళి తెచ్చుకుందామనుకున్నాను. కాని వెళ్ళా లనిపించలేదు. ఎందుకంటే నాకు ఎదురుగా ఓ ఆడ బాబా వూగిపోతూ భజన చేస్తోంది. ఆ భజన బృందంలో ఇద్దరు ఆడవాళ్ళుకూడా వున్నారు. ఇద్దరూ మంచి వయసులో వున్నవాళ్ళు.

పాతికేళ్ళ వయసు. బుగ్గలు నున్నగా నిగనిగలాడుతూ వున్నాయి. ఆ కాషాయ రంగు బట్టలు తీసేసి మామూలు దుస్తులు వేసుకుంటే ఆమె అందం మగాళ్ళను మత్తెక్కించ గలదనిపించింది.

ఆ భజన బృందాన్ని చూస్తుంటే నాకు ఒక్క విషయం ఆశ్చర్యాన్ని కలిగించింది. బాబాలు కాకుండా వేరే మను షులు ఆ భజనకు హాజరు కావటంలేదు.

ఎందువల్ల?

కనకలింగం అంతస్తుకు భయపడి ఎవ్వరూ ఆ భజనకు రావటంలేదేమో అనుకున్నాను. అంతే అయివుంటుంది.

భజన జోరుగా సాగుతోంది.

వాచీకేసి చూసుకున్నాను. తొమ్మిది గంటలు కావస్తోంది. బాగా ఆకలిగా వున్నది.

లేచి నిలుచున్నాను.

అప్పటికే రోడ్డంతా నిశ్శబ్దంగా వున్నది. అది ఊరికి కొంచెం దూరంగా వున్న కాలనీ అవటంతో అంతగా రద్దీ వుండదు ఎప్పుడూ.

కిందికి వచ్చాను.

రెండు నిముషాల తర్వాత రోడ్డుమీద నడవటం మొదలు పెట్టాను.

నేను ప్రయివేటు కంపెనీలో ఎక్కౌంటెంటుగా ఉద్యోగం చేస్తున్నాను. ఇంకా పెళ్ళికాలేదు.

అందువల్లనే అనుకుంటాను — కొంచెం అందంగా వున్న అమ్మాయి కనపడితే నాగుండె అదోలా కొట్టుకుంటూ వుంటుంది.

పది నిముషాల తర్వాత మెస్ దగ్గరకు వెళ్ళాను. అప్పటికే చాలామంది భోజనాలుచేసి వెళ్ళిపోయారు.

అక్కడక్కడ నలుగురు మనుషులు కూర్చుని తిండి తింటున్నారు.

భోజనం చేస్తున్నంతసేపూ నాకు ఆ ఆడబాబా అందమైన రూపమే కళ్ళముందు కదిలింది. అంత చిన్న వయసులో ఆ యువతి యెందుకు ఈ బాబాల్లో చేరిపోయిందో?

గదికి వచ్చాను.

పది గంటలు కావస్తున్నప్పుడు భజన పూర్తయ్యింది. ముందుగా అందరికీ తీర్థం ఇచ్చాడు ముసలిబాబా. ఆ తర్వాత ప్రసాదం పంచిపెట్టాడు. అయితే ఆ ప్రసాదం

ఏదో ప్యాకెట్లలో వున్నది. అందరూ ఆ ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకుని తమ భుజాలకు వేల్లాడుతున్న జోలెల్లో వేసుకున్నారు.

తలుపులు తెరుచుకున్నాయి.

ఒక్కొక్కరే వెళ్ళిపోవటం మొదలుపెట్టారు. చూస్తూనే వున్నాను.

అంతా వెళ్ళిపోయారు.

కాని—ఆ ఆడబాబా మాత్రం వెళ్ళిపోలేదు.

అంటే?

ఆ యువతి రాత్రికి కనకలింగం ఇంట్లోనే వుండి పోతుందా? ఉండి ఏం చేస్తుంది?

నవ్వొచ్చింది....

ఒక ఆడది ఓ మగాడికి ఎందుకు ఉపయోగపడుతుంది?

ఆ మగాడు కనకలింగం. అతనికి భార్యలేదు. అతను మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. అయితే భజన తర్వాత జరుగు తున్న కార్యక్రమం ఇదా?!

ఈ విషయం తేల్చుకోవాలనుకున్నాను.

ఆ రాత్రి పన్నెండు గంటల సమయంలో గదిలోనించి బయటకు వచ్చి గోడ దూకి కనకలింగం ఇంట్లోకి వెళ్ళాను.

సీటిగొట్టం పట్టుకుని పైకి వెళ్ళాను. వెనుకవున్న గది విండో గ్లాసులు కొంచెంగా తెరచి వున్నాయి. అదే కనక లింగం పడక గది.

లోపలకు తొంగి చూశాను.

బెడ్ మీద ఆడబాబా నగ్నంగా కనకం గుండెమీద వాలి పోయి వున్నది.

కొంచెంసేపు అక్కడే నిల్చుని ఆ శృంగారం చూడలేక

తిరిగి వచ్చేశాను. ఆ యువతి రూపం నా గుండెల్లో ముద్ర పడిపోయింది.

2

శనివారం.

సాయంత్రం ఆరు గంటలు కావస్తోంది.

బీచ్‌లో కూర్చున్నాను. సముద్రం ఘోషపెడుతోంది. నురుగులు కక్కుతోంది.

అక్కడక్కడ మనుషులు కూర్చుని కబుర్లలో మునిగిపోయి వున్నారు.

వేరుశనగలు కొనుక్కుని తింటున్నాను.

ఆఫీసునించి గదికి వెళ్ళకుండా బీచ్‌కి వచ్చాను. ఏవారమైనా బీచ్‌కి అందమైన యువతులు వస్తూవుంటారు. అందుకే నాకు బీచ్‌కి రావటం అంటే ఇష్టం.

ఉన్నట్టుండి నా దృష్టి సముద్రానికి దగ్గర్లో ఒంటరిగా కూర్చున్న ఓ యువతిమీద పడింది. రెండు నిమిషాలు ఆ యువతిని చూసిన తర్వాత ఉలిక్కిపడ్డాను.

ఆ యువతి — అవును. ఆమె....భజన బృందంలో యువతి.

నీలిరంగు చీర కట్టుకున్నది. తెల్లని జాకెట్టు. ఎంతో అందంగా వున్నది.

ఆమె పెదవికింద నల్లని పుట్టుమచ్చ ఆమెని సులభంగా గుర్తించేలా చేసింది.

అయితే ఈ యువతి నిజంగా బాబా కాదని అర్థమైపోయింది. అంటే ఆమె కాల్‌గర్ల్ అయివుండాలి. ఆ బాబాలు తమకు ఆశ్రయం ఇచ్చిన గృహ యజమానులకు ఇలాంటి యువతులను ఎరగా వేస్తున్నారు.

ఆమె ఒంటరిగా కూర్చుని పరుగులు తీస్తూ వస్తున్న

కెరటాలను చూస్తోంది.

ఆరున్నర కావస్తుండగా ఆమె చేతినున్న వాచీకేసి చూసుకుని లేచి నిల్చున్నది. తర్వాత నా ముందునించే గబ గబా వెళ్ళిపోయింది.

ఆమె కొంచెం దూరం వెళ్ళిన తర్వాత నేనుకూడా లేచి నిల్చున్నాను.

ఆమెను వెంటాడటం మొదలుపెట్టాను.

ఆ యువతి ఎడ్రసు తెలుసుకోవాలి. తర్వాత ఆమెను కలుసుకోవాలి. నా కోరిక తీర్చుకోవాలి.

ఆ రోజు ఎలాగయినా కుదరదు. ఎందుకంటే ఎనిమిది గంటలకు ఆ యువతి కనకలింగం ఇంట్లో భజనకు హాజ రవుతుంది. అందువల్ల మరోరోజు ఆమెను కలుసుకుని మాట్లాడాలి.

ఆ యువతికి తనని మరో మనిషి వెంటాడుతున్నాడన్న అనుమానమే లేదు. అందుకే వెనక్కి తిరిగి చూడకుండా నడుస్తోంది.

పావుగంట తర్వాత ఆమె ఓ చిన్న సందులోకి ప్రవేశిం చింది. నిమిషం తర్వాత ఓ ఇంటి ముందు ఆగి తాళంతీసి లోపల ప్రవేశించింది. ఆ తర్వాత ఆ ఇంటి తలుపులు మూసుకున్నాయి.

ఆ ఇంటిముందు నించి నడుస్తూ చూశాను. ఆ ఇంటి నెంబరు నూట ఇరవై ఆరు.

3

రాత్రి పదిన్నరయింది. అప్పటికే కనకలింగం ఇంట్లో భజన అయిపోయింది. అంతా వెళ్ళిపోయారు.

బెడ్ మీద పడుకున్నాను.

నా కళ్ళముందు ఆ యువతి రూపమే కదులుతోంది.

రేపు సాయంత్రం ఆ యువతిని కలుసుకుని మాట్లాడాలి. ఎంత డబ్బయినా ఇచ్చి ఆమెని పొందాలి.

సిగరెట్టు కాల్చా లనిపించింది.

టేబిల్‌మీది సిగరెట్టు ప్యాకెట్‌ను తీశాను.

అందులో ఒక్క సిగరెట్టు కూడా లేదు. తప్పదు. సెంటర్ వరకు వెళ్ళి సిగరెట్టుపెట్టె తెచ్చుకోవలసిందే.... ఎందుకంటే రాత్రివేళ మెలకువ వచ్చినపుడు సిగరెట్ కాల్చటం నాకు బాగా అలవాటు.

లేచి నిల్చుని స్కూటర్ బయటపెట్టాను.

గదికి తాళంపెట్టి స్కూటర్ స్టార్టుచేసి ముందుకు దూకించాను.

రాత్రి ఎనిమిది గంటలు దాటిందంటే మా కాలనీలో వుండే కిల్లీషాపులన్నీ మూసేస్తారు.

కొంచెం దూరం వెళ్ళిన తర్వాత స్కూటర్ లైటు వెలుతురులో రోడ్డుమీద అడ్డంగా పడివున్న ఓ ఎర్ర రంగు ప్యాకెట్ కనిపించింది.

దాన్ని ఈజీగానేగుర్తించాను. అదే కనకలింగం యింట్లో భజన తర్వాత ముసలి బాబా యిచ్చే ప్రసాదం ప్యాకెట్టు.

అందులోవుండే ప్రసాదం ఏమిటో చూడాలనిపించింది. స్కూటరాపి ఆ ప్యాకెట్టును చేతిలోకి తీసుకొన్నాను.

వీధి దీపం వెలుతురు మసగ్గా పడుతోంది.

ప్యాకెట్లో చెయ్యిపెట్టి ప్రసాదాన్ని బయటకు తీశాను. ఒక్కసారిగా నా కళ్ళు జిగేలుమన్నాయి. వేయించిన సెనగల మధ్య రెండు ఖరీదయిన వజ్రాలు కనిపించాయి.

నా చెయ్యి వణికింది.

గబగబా ఆ ప్యాకెట్టును జేబులో పెట్టుకుని స్కూటర్ని వేగంగా ముందుకు పోనిచ్చాను.

కనకలింగం యింట్లో యీ భజన బృందం చేస్తున్న పని ఇదా?

ఆశ్చర్యమైంది.

ఎవడో బాబా జోలెలోనించి జారి పడిపోయివుంటుంది ఈ ప్రసాదం ప్యాకెట్టు....”

సెంటర్లో సిగరెట్టు ప్యాకెట్టు కొని ఓ సిగరెట్ వెలిగించుకుని కొంచెంసేపు ఆలోచించి స్కూటర్ని పోలీస్ స్టేషన్‌కి పోనిచ్చాను.

ఇన్‌స్పెక్టర్ అప్పుడే యింటికి వెళ్ళబోతున్నాడు.

అతడిని కలుసుకుని జరిగిందంతా చెప్పి ఆ వజ్రాలు చూపించాను.

“మైగాడ్....అయితే వాళ్ళంతా బాబాల రూపంలో స్మగ్లింగ్ చేస్తున్నారు. వెంటనే పట్టుకోవాలి” అన్నాడు ఇన్‌స్పెక్టర్.

“అవును....కాని వాళ్ళంతా వెళ్ళిపోయారు. అంతా ఒక్కచోట వుండటంలేదు. కనకలింగాన్ని పట్టుకుంటే వాళ్ళందరి అడ్రస్‌లూ తెలుస్తాయి” అన్నాను.

“కనకలింగం వెంటనే మనకు అందరి ఎడ్రస్‌లూ చెప్పాలి. ఏ మాత్రం ఆలస్యం జరిగినా వాళ్ళలో ఏ ఒక్కరికి ఈ విషయం తెలిసినా అంతా పారిపోతారు. ఒక్కరు కూడా దొరకరు” అన్నాడు ఇన్‌స్పెక్టర్.

“నిజమే ...అయినా మరో మార్గం వుంది. ఆ భజన బృందంతో ఓ యువతి వుండే నివాసం నాకు తెలుసు. ఆమెను పట్టుకుని బెదిరిస్తే ఆడది కాబట్టి భయపడిపోయి వెంటనే మిగిలిన బాబాల ఎడ్రసులు చెబుతుంది.”

“గుడ్....అయితే వెంటనే బయల్దేరుదాం. దాదాపు పాతికమందిని ఒక్కసారిగా అరెస్టు చెయ్యాలంటే మనకు

చాలా బలగం కావాలి. అందువల్ల మనం వెంటనే ఐ.జి.ని కలుసుకుని ఈ విషయం చెప్పాలి. రండి....నా మోటార్ బైకుమీద వెళదాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నా స్కూటర్ని అక్కడే వదిలి ఇన్‌స్పెక్టర్‌తో ఐ.జి. ఇంటికి వెళ్ళాము. గొప్ప స్మగ్లింగ్ ముఠాని ప్రభుత్వానికి పట్టించబోతున్నందుకు నా కెంతో సంతోషంగా వున్నది.

ఇన్‌స్పెక్టర్ విషయాన్ని ఐ.జి.కి చెప్పాడు.

ఆయన అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడి ఎవరెవరికో ఏవో ఆజ్ఞలు జారీచేశాడు. ఏం చెయ్యవలసిందీ ఇన్‌స్పెక్టర్‌కి సూచనలు ఇచ్చాడు.

ఆ తర్వాత యిద్దరం వాళ్ళ స్టేషన్‌కు వచ్చి నలుగురు పోలీసులతో బీచ్‌కి దగ్గర్లోవున్న నూటయిరవై ఆరో నెంబర్ యింటికి వెళ్ళాము. ఆమె అందరితోపాటు వెళ్ళిపోవటం నేను చూశాను ఐపోగానే—

ఆ ఇంట్లో ఆ యువతితోపాటు మరో బాబాకూడా దొరికి పోయాడు. వాళ్ళిద్దరి దగ్గరా నాలుగు వజ్రాలు దొరికాయి.

ఓ పావుగంట బెదిరించిన తర్వాత ఆ యువతి—బాబా యిద్దరూ ప్రాణాలకు భయపడి మిగిలిన బాబాల ఎడ్రస్‌లన్నీ చెప్పేశారు.

వాళ్ళిద్దరు కాకుండా ఇంకో ఇరవైనాలుగుమంది వున్నారు. ముసలిబాబా వాళ్ళ నాయకుడు. కనకలింగం కూడా ఆ ముఠా సభ్యుడే.

మేము స్టేషనుకు వెళ్ళేసరికి అక్కడ ఓ యాభై మంది రహస్య పోలీసులు వచ్చివున్నారు.

అప్పటికప్పుడే ఇన్‌స్పెక్టర్ ఆ బాబాల ఎడ్రస్‌ల లిస్టును వాళ్ళ నాయకుడికి అందచేశాడు.

తర్వాత అతను నాకు థాంక్స్ చెప్పి "ఇక మీరు వెళ్ళ

పొండి. మీరు చేసిన ఈ సహాయం చాలా గొప్పది.... ప్రభుత్వం మిమ్మల్ని ఘనంగా సత్కరిస్తుంది. కొంచెం సేపట్లో నేను నా బలగంతో కనకలింగం యింటిమీద దాడి చెయ్యబోతున్నాను. మీరు జాగ్రత్తగా వెళ్ళండి...." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను కూడా మీతో వస్తాను" అన్నాను.

సరేనన్నాడు.

పోలీసుజీపు వెనుకే నా స్కూటర్ని పోనిచ్చాను.

పదినిముషాల తర్వాత కనకలింగం ఇంటిమీద పోలీసులు దాడిచేశారు.

కనకలింగం లొంగిపోయాడు. అతడి యింట్లో ఎనిమిది వజ్రాలు దొరికాయి.

తండ్రిని అరెస్టు చెయ్యటంతో అతని కూతురు రాణి దుఃఖించటం మొదలుపెట్టింది. నాకు జాలి కలిగింది.

"క్షమించండి. మీకు ఈ స్థితి కలగటానికి నేనే కారణం" అన్నాను.

"మీరా!" ఆశ్చర్యంగా అన్నది.

అవునంటూ అంతా చెప్పేశాను.

"ఇందులో మీ తప్పులేదు. మా నాన్న ఇలాంటి చీడ పురుగని నాకు తెలీదు. నేరస్తులు శిక్షింపబడాలి. కాని నేనిప్పుడు ఒంటరిదాన్ని" అంటూ ఆమె విచారపడింది.

"మీరు ఒంటరి మనిషి కాదు మీకు అభ్యంతరం లేకపోతే మీకు తోడు నేను వుంటాను."

అంతే. అలా అనగానే ఆమె ఒక్కసారిగా నా గుండెల మీద వాలిపోయింది. నాకు రాణి తోడు చాలు. ఇక ఏ ప్రభుత్వ సత్కారమూ అవసరంలేదు. □

గుడ్డి దర్బారు

వసుంధర సీరియల్

సింహపురి గ్రామం పట్నానికి, నాగరతకు దూరంగానూ- అరణ్యానికి కాస్త దగ్గర్లోనూ వున్నది. అక్కడి ప్రజలందరూ వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్నారు.

ఆ ఊరికి ప్రభుత్వపు గుర్తింపు వున్నదన్న సూచనగా ఓ కరణం, మునసబు, పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు

వున్నారు. ప్రెసిడెంటు పదవికి ఎన్నికలూ జరుగుతూంటాయి. అయితే రాజకీయాలు మాత్రం లేవు.

ఊరంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో వుంటారు. అందుకు కారణం ఊరు చిన్నది కావడం కావచ్చు. అరణ్య ప్రాంతాల నుంచి వచ్చే బందిపోట్లు బెదద కావచ్చు. లేదా గ్రామంలోని రామదాసు కుటుంబం కావచ్చు.

రామదాసుకా ఊళ్ళో నాలుగెకరాల భూమి వున్నది. భార్య సరస్వతి. కొడుకు రాంబాబు. కూతురు గౌరి. ఆయనకు దర్జాగానే గడిచిపోతున్నది. అంతమాత్రాన ఆయన ఊరికే కూర్చోడు. అందరికీ సాయపడడం ఆయన హాబీ. ఎవరు విచారంగా వున్నా ఆయన చూడ లేడు. ఊళ్ళో ఎవరికీ భేదాభిప్రాయాలు వచ్చినా అవి తేలిపోయేవరకూ రామదాసు మనసుకు స్థిమితముండదు.

మనిషిని మనిషి అర్థం చేసుకోవడం కష్టం. కానీ అపార్థం చేసుకొనడానికి క్షణంకూడా పట్టదు. అపార్థాలను తొలగించేవారికంటె ఎగదోసేవారే ఎక్కువగా వుంటారు.

కృతజ్ఞతలు

ఈ రచన చేయడంలో నాకు సహకరించిన పంజాబీ మిత్రుడు 'దిలీప్' కి కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు. ఈ రచనపై అన్ని హక్కులూ అతడికీ వున్నాయి—

'వసుంధర'

ఆ విధంగా చూస్తే రామదాసు ఉనికి ఆ ఊరికి పెట్టని గోడగా వున్నదనవచ్చు. గత పదిసంవత్సరాలుగా గ్రామం వైపు బందిపోట్లు కన్నెత్తి అయినా చూడలేదంటే అందుకు రామదాసే కారణమని కొందరనుకుంటూంటారు.

గ్రామానికి మైలు దూరంలో బస్స్టాండు వున్నది. పట్నం వెళ్ళడానికి అక్కణ్ణించి బస్సులుంటాయి. బస్స్టాండు జగన్నాధపురానికి దగ్గర్లో వున్నది. ఆ బస్స్టాండు ఏ ఊరికి చెందాలీ అన్న విషయంలో పెద్ద గొడవవచ్చి రెండు గ్రామాలమధ్యా కలతలు రేగాయి.

జగన్నాధపురం చిన్న గ్రామం. సింహపురి జగన్నాధపురం కంటే పెద్దది. రామదాసు సద్దిచెప్పడం వల్లనే బస్స్టాండ్ జగన్నాధపురానికి చెందితే సింహపురి ప్రజలు సహించగలిగారు

ఊళ్ళో ఎవరికి ఏ సమస్య వచ్చినా రామదాసుగారితో చెప్పుకోవాలనుకోవడం మామూలు.

ఊళ్ళో పోలీస్ స్టేషను లేదు. అక్కడికి ఎనిమిదిమైళ్ళ దూరంలో వున్న కోనవరంలో వున్నది పోలీస్ స్టేషన్. అయితే రామదాసుండగా ఆ ఊరి ప్రజలకు పోలీస్ స్టేషన్ అవసరం రాలేదు.

చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునే అవసరం రామదాసు కుటుంబానికి లేదు. వాళ్ళింట్లో అందరూ మంచివాళ్ళే! అందరూ ఊరి అభిమానం సంపాదించుకున్నవారే!

భర్తకున్న చొరవ లేకపోయినా సరస్వతి మనసు మంచిది. కొడుకు రాంబాబు అక్షరజ్ఞానం సంపాదించి తండ్రికి వ్యవసాయంలో సాయంచేయడం ప్రారంభించాడు. అతడు ముక్కుకు సూటిగా పోయే మనిషి. తన పనేదో తను చూసుకుంటాడు తప్పితే ఇతరుల జోలి, శొంఠి అవ

సరం లేదు. అతడు కాస్త అమాయకుడనికూడా అంతా అనుకుంటూంటారు.

ఇక కూతురు గౌరి మాత్రం అన్నకు పూర్తిగా వ్యతిరేకం. ఆమె చలాకీతనం అంతా యింతా అని చెప్పలేము. పరుగు పందేల్లో యువకుల్ని ఓడించిందామె. పరులకు సాయం చెయ్యడంలో తండ్రి గుణాలే పుణికిపుచ్చుకున్నదని అంతా ఆమెగురించి చెప్పుకునేవారు.

ఆమె తెలివితేటలకు రామదాసే ఆశ్చర్యపోతూ—"నా బంగారుతల్లి ఏదో ఒకరోజున ఈ దేశాన్నేలినా ఏలవచ్చు" అని ముచ్చటపడుతూండేవాడు.

ఆడపిల్లల్లో గౌరికి ముఖ్య స్నేహితురాలు పద్మావతీదేవి. ఆమె ప్రెసిడెంటుగారమ్మాయి. గౌరికంటే వయసులో కాస్త పెద్దది.

గౌరికి మగపిల్లల్లోనూ స్నేహితులున్నారు.

మోహన్ ఆమె వయసువాడే! కానీ చూడ్డానికి ఆమె కంటె చాలా పెద్దవాడిలా వుంటాడు. ఇంట్లో వ్యాయామం చేస్తాడేమో కండలు తిరిగి వుంటాయి. ఊళ్ళో తనకు మించిన బలశాలి లేడంటాడు. అతగాణ్ణి సవాలు చేసిన వారూ లేరు. గౌరిమీద ఈగవాలినా సహించడతడు.

బాబు సన్నగా పొడుగ్గా వుంటాడు. ఇతగాడి జ్ఞాపకశక్తి అద్భుతం. అపూర్వం. ఏవైనా ఒక్కసారి చదివితే అది మళ్ళీ మర్చిపోడు. ఒకసారి అతడు కాశీమజిలీకథలు పదకొండవ భాగం చదివి మొత్తమంతా ఒక్క అక్షరం కూడా పొల్లుపోకుండా మిత్రులకు అప్పజెప్పాడు. స్నేహితులందరూ తరచుగా బాబుచేత కథలు చెప్పించుకుంటూండేవారు. కథలు చెప్పడం బాబుకీ ఇష్టమే!

నాని గౌరికంటె ఓ ఏడాది పెద్దవాడు. కానీ చూడ్డానికి

ఆమెకంటె రెండేళ్ళు చిన్నవాడిలాగుంటాడు. ఇతగాడికి సమయానుకూలంగా వర్తించి ఆపదల నుంచి తప్పించుకునే తెలివితేటలున్నాయి. మనిషి మాత్రం బక్కపలచగా వుంటాడు.

పద్మావతీదేవి, గౌరి, మోహన్, బాబు, నాని—ఇదంతా ఒక బృందంగా వుండేది. ఈ బృందానికి నాయకురాలు పద్మావతీదేవి అయితే గౌరి ప్రాణంగా వుండేది.

దీపావళి సమయంలో గౌరి తన స్నేహితులకు బాణా సంచా తయారుచేసేది.

గౌరి బాణాసంచాలో ఓ ప్రత్యేకత వుంటుంది. ఆమె కొత్తరకం బాంబులు తయారు చేస్తుంది. ఏటా కొత్త ప్రయోగాలు చేస్తూంటుంది. అవంటే ఆమె స్నేహితులకు ప్రత్యేకాకర్షణ. బాబు సంగతి ఎలా వున్నా మిగతా అంతా కలిపి ఆమెకు ఎంతో కొంత డబ్బిస్తారు. మిగతా డబ్బు గౌరి తను వేసుకుంటుంది. ఇందులో ఒకరి కోసం ఇంత అయిందని వేరే పద్దులు, లెక్కలు వుండవు.

దీపావళి బాణాసంచా తయారీకోసం గౌరి ఆలోచన సంక్రాంతి నుంచే ప్రారంభమవుతుంది. దీపావళికి ముందు రెండు వారాలూ ఆమెకు ఎంతో హడావుడి.

గౌరిది చిన్న డాబాయిల్లు. డాబామీద ఒకే ఒక చిన్న గది. దీపావళికి ముందు రెండు వారాలూ ఆ గదిపై సర్వ హక్కులూ గౌరివి. మరింకెవ్వరూ ఆ గదిని ఆ రోజుల్లో వాడకూడదు.

ఇప్పుడు రామదాసు లేడు. గౌరికి పన్నెండేళ్ళ వయసప్పుడు ఆయన మరణించాడు. ఆయన పోయినప్పుడు ఊరు ఊరంతా విలపించింది. అంత దుఃఖంలోనూ గౌరికి ఆ విషయం సంతోషం కలిగించింది.

"నా తండ్రి ఎంత గొప్పవాడు? నేనూ ఒకరోజున ఇంత పేరు సంపాదించుకోగలనా?" అని అనుకోకుండా వుండలేకపోయిందామె.

గౌరి సంగతి యెలా వున్నప్పటికీ పదహారేళ్ళ వయసు లోనే ఆమె అన్న రాంబాబుకు యింటి బాధ్యతలు తగులు కున్నాయి. అయితే తన బాధ్యతను ఎంతో శ్రద్ధగా నిర్వ హిస్తున్నాడతను.

2

దీపావళికింక పదిహేను రోజులున్నది.

గౌరి హడావుడి చెప్పనలవికాకుండా వున్నది.

అంతా ఎవరికి వారు చేసుకుంటుంటే, గౌరి ఎప్పటిలాగే తనకూ, తన స్నేహితులందరకూ బాణాసంచా తయారు చేస్తున్నది. ఆమె మకాం ఇరవైనాలుగు గంటలూ డాబా మీది గదిలోనే!

స్నేహితులతో ఆటపాటలు మానేయడం వరకూ బాగానే వున్నది. ఆమెకు భోజనం చేయడానికి కూడా తీరిక వుండడం లేదు.

కూతురలా కష్టపడుతూంటే సరస్వతికి కోపం, జాలి కూడా కలిగాయి.

"ఏమే-ఊరందరి పనీ నీదేనా? నీకు విశ్రాంతి అక్క ర్లేదా? అసలు నీ గురించి ఎవరైనా పట్టించుకుంటున్నారేమో ఆలోచించావా?" అన్నదామె.

"ఊరందరి పనీ నేనెందుకు చేస్తానమ్మా—నీ అను మానంగానీ! దేవి వుందా - అది అన్నం కలుపుకుంటేనే చేయి కందిపోతుందని వాళ్ళ నాన్న భయం. లేకపోతే అది తప్పకుండా నాకు సాయం చేయడానికి వచ్చేది. అది సాయం చేయడానికి రాలేదని దానికి బాణాసంచా లేకుండా

చేయగలనా? నానిగాడేమో పనిదొంగ. చేసినవన్నీ కొల్చ డానికి సిద్ధం. కాస్త మందు నూరరా అంటే కనిపించడు. అయితే నేను ఫోంచేయనంటే నువ్వూరుకున్నావా-కంచం యిక్కడికే తీసుకురాలేదూ—అలాగే నానిగాడి విషయంలో నేనూను! మరి బాబు సంగతి.... వాడు నలుగురిమీదా ఆధార పడి బ్రతుకుతున్నాడు. నోరారా అక్కా అని పిలుస్తాడు. నాకూ తమ్ముళ్ళులేరు. ఉన్న ఒక్క తమ్ముణ్ణీ యెలా వదులుకోగలను....?"

గౌరి చెప్పుకుపోతూంటే సరస్వతి "అన్నీ ఆ తండ్రి బుద్ధులే నీవి!" అన్నది. అలా అనడంలో కోపంలేదు. ముచ్చట వుంది.

"నాన్నకూ నాకూ పోలికలేమిటమ్మా" అని గౌరి ఏదో అనబోతూండగా అక్కడికి రాంబాబు వచ్చి "ఇక్కడున్నారా ఇంట్లో ఎక్కడా ఎవరూ కనిపించడంలేదు—ఏమయ్యారా అనుకుంటున్నాను" అన్నాడు.

"అమ్మా పొలంలో చిన్న పనుంది. త్వరగా భోజనం పెడితే...." అని రాంబాబు ఏదో అనబోతూండగా—

"అన్నయ్యా నీ సాయం కావాలి నాకు" అన్నది గౌరి. ఆమె స్వరంలో అర్థింపుకంటే అధికారం యెక్కువ వున్నది.

"నీకు నా సాయమా?" అన్నాడు రాంబాబు అదేదో పెద్ద వింత అయినట్లు ఆశ్చర్యపడుతూ.

గౌరి వివరంగా చెప్పింది.

ఆమె కొత్తరకం బాంబు చేస్తోంది. అది తారాజువ్వలా కొంత దూరం వెళ్ళి అక్కడనుంచి పదివైపులకు పది బాంబులుగా వెళ్ళి పేలుతుంది. దాని తయారీ విషయంలో కొన్ని సందేహాలున్నాయి. అలాగే పొగబాంబు విషయంలో

కూడా।

"నాకు టైములేదు. నేను నీకులా పనికిరాని పనులలో కాలం వృధా చేసుకోను" అన్నాడు రాంబాబు.

"అన్నయ్యా ఈ పనికిరాని పని నువ్వే నాకు నేర్పావు. బాంబులు చేయడంలో ఎవరైనా ఈ ఊళ్ళో నీ తర్వాతేనని చెప్పుకుంటారు. నా దురదృష్టంకొద్దీ నువ్విప్పుడు నీ కాలాన్నంతా వ్యవసాయంలో వృధా చేస్తున్నావు" అంది గౌరి.

"వృధాయే అనుకోవాలి. నేను కష్టపడేదంతా నీ పెళ్ళికి కట్నం డబ్బు సంపాదించాలనే గదా" అన్నాడు రాంబాబు.

"అన్నయ్యా ఇప్పుడా కబుర్లొద్దు. నాకు కాస్త సాయం చెయ్యి" అంది గౌరి మారాం చేస్తున్నట్లు.

"పదహారేళ్ళొచ్చాయి. ఇంకా చిన్నతనం పోలేదు" అంది తల్లి.

"ఎన్నేళ్ళొచ్చినా మనింట్లో అదే కదా చిన్నది" అని "అమ్మా నాకు వడ్డిస్తూ వుండు. నేను దీనికి అన్నీ చెప్పి వస్తాను...." అన్నాడు రాంబాబు.

"మా మంచి అన్నయ్య" అంది గౌరి.

రాంబాబు చెల్లెలికిగల సందేహాలన్నీ తీర్చాడు.

అన్నయ్య వెళ్ళిపోయాక గౌరి శ్రద్ధగా పనిలో కూర్చుంది. సాయంత్రానికల్లా ఆమె పాళ్ళువేసి శాంపిల్ తయారుచేసి తన మిత్రబృందాన్ని పిలిపించింది.

అందరూ వచ్చారు.

"తమాషా చూడండి—గౌరి అంటే ఏమిటో తెలుస్తుంది" అంది గౌరి.

ఆమె తను తయారుచేసిన శాంపిల్ బాంబును డాబా గది కిటికీకి కట్టింది.

ఆ కిటికీలోంచి మైదానప్రాంతం ఒకటి కనబడుతుంది.

గౌరి తన మిత్రబృందాన్ని అక్కడకు వెళ్ళమని చెప్పింది. వారామె ఆజ్ఞను శిరసావహించారు.

గౌరి బాంబుకు వత్తి వెలిగించింది. క్షణాలమీద తారాజువ్వ దూసుకుంటూ మైదానప్రాంతానికి వెళ్ళింది. అప్పుడు అక్కడ ఒక్కసారిగా పది కాంతిపుంజాలు పుట్టి పది వైపులకు పయనించి ఢాంమంటూ పేలాయి.

గౌరి స్నేహితులీ వింతను చూసి పొందిన ఆనందమింతా అంతా కాదు. అంతా పరుగున డాబాదాకా వెళ్ళి "ఏం గొప్పగా చేసావే గౌరీ!" అని ఏకకంఠంతో మెచ్చుకున్నారు.

గౌరి రాత్రి కూడా డాబామీదనే భోజనం చేసింది. అర్ధరాత్రి దాటేవరకూ తన పనిలోనే వుంది. ఆ తర్వాత అక్కడే ఓ చాప పరచుకుని నిద్రపోయింది.

గౌరికి నిద్ర సరిగా పట్టలేదు. దీపావళి గురించీ, బాంబుల గురించీ రకరకాల కలలు.

3

కోడి కూయగానే గౌరికి మెలకువ వచ్చింది. మెలకువ రాగానే తన సామానంతా పరీక్షించి చూసుకుని తృప్తిగా నిట్టూర్చింది. ఒక్క టపాకాయ తప్ప మిగతావన్నీ తను శాంపిల్ చూసింది. టపాకాయలు సెట్టి ఇచ్చాడు.

"ఇవెలాగున్నాయో!" అనుకుందామె.

అనుకున్నదే తడవుగా గౌరి ఓ టపాకాయ చేతిలోకి తీసుకుంది. పక్కనే వున్న బుడ్డిదీపం రెండో చేత్తో అందుకుంది. డాబా పిట్టగోడవరకూ వెళ్ళి బుడ్డిదీపంలో టపాకాయను వెలిగించింది. టపాకాయ వత్తినుంచి వచ్చిన ముత్యాల ఒత్తిడికి బుడ్డిదీపం ఆరిపోయింది.

గౌరి టపాకాయను పెరట్లోకి పడేలా విసిరింది.

అపరాధ పరిశోధనపోటీ-183

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-10-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు డిసెంబరు '83 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. గత నెలలో యీ రాష్ట్ర శాసనసభలో నేత్రపర్వంగా అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య బాక్సింగ్ జరిగింది—? (ఆంధ్రప్రదేశ్, జమ్ముకాశ్మీర్.)
2. నేడు ప్రజల నిత్యకృత్యాలలో ఇదొక్కటైపోయింది—? (అల్లరులు, ఆక్సిడెంట్లు.)
3. దీనిలో పోషక విలువలు ఎక్కువ—? (అరటిపండు, గ్రుడ్డు)
4. దోమలకివి నెలవులు—? (మురికివాడలు, మరుగునీరు.)
5. అంధులకు ఆధారము—? (చేతికర్ర, మనోనేత్రము.)

అప్పుడు....

ఆమె చెవులు బద్దలవుతాయా అనిపించేటంత గట్టిగా ఢాంమన్న శబ్దం వినిపించింది.

గౌరి ఆశ్చర్యపోయింది. ఆ టపాకాయ నుంచి అంత శబ్దం వస్తుందని ఆమె ఊహించలేదు.

"పెట్టి టపాకాయలు బాగా చేశాడే—" అనుకుందామె.

గౌరి హఠాత్తుగా గుర్తించింది.

శబ్దం పెరట్లోంచి రాలేదు. దూరంగా మైదానంవైపు నుంచి వచ్చింది.

అవును—మైదానంవైపునించే వచ్చింది.

ఇంకా కనుచీకట్టిగానే వుంది. గౌరి మైదానంవైపు చూసింది.

అక్కడ అస్పష్టంగా ఏదో కనబడుతోంది.

ఈలోగా యింట్లో ఏదో కలకలం....గౌరి క్రిందకు తొంగిచూసింది.

అప్పుడు గౌరి చూసిన దృశ్యం ఆమె ఊహకు అందనిది!

ఎవడో ఒకడు....చేతిలో తుపాకీ వుంది....తన తల్లినీ అన్ననూ మైదానంవైపుకు నడిపించుకుని వెడుతున్నాడు.

గౌరి చటుక్కున తన గదిలోకి పరుగెత్తింది. అదృష్టవశాత్తూ ఆ మనిషి ఆమెను చూడలేదు. గౌరి గుండె అదిరింది.

ఎవడు వాడు....? యెందుకు వచ్చాడు....? అసలేం జరిగింది ..?

జరిగిందేమిటంటే....

తెల్లవారుఝామునే మొత్తం అయిదుగురు బందిపోట్లు

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00 లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

గుర్రాలమీద ఊళ్ళో ప్రవేశించారు. అయిదుగురిదగ్గా తుపాకు లున్నాయి. బందిపోట్ల నాయకుడు మైదానంలో ఉన్నాడు. ఊరికి నిప్పు పెడతామని బెదిరించి మొత్తం గ్రామవాసు లందర్నీ మైదానంలోనికి చేర్చుతున్నారు మిగతా బంది పోట్లు.

కాసేపటిలోనే ఊరి జనమంతా మైదానంలోకి సమావేశ మయ్యారు. వారి చుట్టూ అయిదుగురు సాయుధులయిన దొంగలు.

బందిపోట్ల నాయకుడు అప్పటికి రెండుసార్లు గాలిలోకి తుపాకీ పేల్చి జనాన్ని హెచ్చరించాడు. అతడు మొదటి సారి పేల్చిన శబ్దమే గౌరి విన్నది. అదృష్టవశాత్తూ గౌరి వేసిన టపాకాయ పేలలేదు. లేకపోతే ఆమె యింటికి వచ్చిన దొంగకు ఆమె గురించి కూడా తెలిసిపోయి వుండేది. ఆ యింటి డాబామీద మరో వ్యక్తి వుండవచ్చు నని దొంగ అనుకోలేదు....

మైదానంలో దొంగలు గుర్రాలు దిగారు. వాటిని మైదానంలో ఒక మూలకు తీసుకువెళ్ళి కట్టేశారు.

దొంగల నాయకుడికోసం మిగతావాళ్ళు ఓ కుర్చీ తెచ్చారు. వాడందులో కూర్చున్నాడు.

ఇద్దరు దొంగలు తుపాకీలతో జనాన్ని అదుపు చేస్తు న్నారు.

మిగతా యిద్దర్నీ ఉద్దేశించి నాయకు డిలాగన్నాడు— "మీరు వెళ్ళండి. ఎక్కడా దోపిడీ కానీ దొంగతనంగానీ జరక్కుండా చూడండి. పాపం—వీళ్ళకి ఇంట్లో అవసర మయ్యే వస్తువులేమీ ముట్టుకోవద్దు. మనక్కావలసినవి మాత్రమే తీసుకోండి. త్వరగా పని ముగించుకుని రండి. పొద్దుపొడిచేలోగా మన మిక్కణ్నుంచి మకాం ఎత్తేయా

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 61 : స్వరూపరాణి బి.ఏ. పరీక్షలు వ్రాసింది. అయితే కారణాంతరాల వల్ల ఆమె హిస్టరీ పేపరు ఎలాగో మిస్సయింది. అందువల్ల ఆమెను హిస్టరీలో ఫెయిల్ చేస్తూ మార్కుల లిస్టు పంపబడింది.

అంతేకాక యూనివర్సిటీ వారు ఆమెకు అసలు విషయం తెలియజేస్తూ, తర్వాత పరీక్షకు ఫీజు కట్టనవసరంలేకుండానే ఆమెను హిస్టరీ పేపరు మళ్ళీ వ్రాయమని కోరారు.

స్వరూపరాణి దానికి అంగీకరించలేదు. తను పరీక్ష వ్రాసానని పేపరు పోవటం తన బాధ్యత కాదని, తన పేపరును దిద్దించటమో లేదా, తనను పాసయినట్లు డిక్లెరు చేయటమో చేయాలని కోరుతూ మాండమస్ రిట్ వేసింది హైకోర్టులో.

న్యాయమూర్తిగా మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 5-10-'83 తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు డిశంబరు '83 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 59 (తీర్పు)

ప్రమీల వేసిన దావా చెల్లదు.

తన ప్లాటుని అమ్మి, వచ్చిన డబ్బులోంచి తన బాకీని చెల్లు వేసుకోమని ప్రమీల, లలితకు ఇచ్చిన అనుమతి Agency coupled with interest క్రింద వస్తుంది. కనుక లలిత అంగీకారం లేకుండా ప్రమీల తను ఇచ్చిన అనుమతిని ఏకపక్షంగా ఉపసంహరించుకోవడం చట్టరీత్యా చెల్లదు. కాబట్టి లలిత ప్రమీలకు నష్టపరిహారం ఏమీ చెల్లించనక్కరలేదు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ సి. దండపాణి, బి. ఇ, 685 సి, టైప్ 4 క్వార్టర్సు, బి. హెచ్. ఇ. ఎల్. టౌన్‌షిప్, హైద్రాబాదు—500 032.

లన్న విషయం మాత్రం మరిచిపోకండి—"

"అలాగే గురూ!" అని వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

అప్పుడు దొంగల నాయకుడు గ్రామస్థుల నుద్దేశించి ఇలాగన్నాడు: "చూశారుగా—దోపిడీలన్నా, దొంగతనా లన్నా నాకు అసహ్యం. నేనుకోరేది కేవలం మీ సహాయం. అందుకై మీ ముందుకు వచ్చి స్వయంగా నేనే చేతులు జాపుతాను. మీ శక్తికొద్దీ నాకు సాయం చేయండి. మీరు సాయం చేయకపోతే నన్ను హింసకు ప్రోత్సాహించినవా రవుతారు. అహింసను నమ్ముకుని బ్రతికే నా మనసుకు కష్టం కలిగించరని ఆశిస్తున్నాను—"

ఇలాగని నాయకుడు బయల్దేరాడు. ఓ గ్రామస్థుడి ముందుకు వచ్చి ఆగాడు. చేయి చాపాడు.

వెంటనే ఆ గ్రామస్థుడు తన చేతికున్న ఉంగరం తీసి యిచ్చాడు.

నాయకుడు రెండో గ్రామస్థుడివద్దకు వెళ్ళాడు. అతడూ అలాగే చేశాడు.

మూడో ఆమె పదహారేళ్ళ అమ్మాయి. ఆమె చెవుల నుంచి రింగులు, మెడలోని గొలుసు తీసి ఇచ్చింది.

"అహింసా పరమో ధర్మః" అంటూ నాయకుడు ఆ ఊరి ప్రెసిడెంటు ముందుకు వచ్చి చేయి జాపాడు.

ప్రెసిడెంటు తన మెడలోని పులిగోరు పతకం, చేతి కున్న మూడు ఉంగరాల్లోనూ రెండింటినీ తీసి నాయకుడి చేతిలో వేశాడు.

నాయకుడు అక్కణ్ణుంచి కదలలేదు. పెదవి విప్పి మాట్లాడలేదు. ప్రెసిడెంటు చేతికి మిగిలిన మూడో ఉంగరంవంక తీవ్రంగా చూస్తూ అది కూడా యివ్వమని కళ్ళతో సూచించాడు.

అతి త్వరలో విడుదల చేస్తున్నాం!

శ్రీ మధుబాబు రచన:

1. కిల్లర్ షాడో రూ: 4-00

S.N. నాగిరెడ్డి రచన:

2. వే టు డస్టీ డెత్ రూ: 4-00

కళాసాగర్ రచన:

3. ది మాన్ విత్ ఖంయిజో రూ: 4-00

రెండువైపులా ఆరు రంగుల హాంద్ డ్రాయింగ్ ఆఫ్ సెట్ ముఖచిత్రాలతో రిలీజ్ చేస్తున్నాము.

ఏజెంట్లు తమ భారీ ఆర్డర్లు పంపవల్సిందిగా కోరుచున్నాము.

ఇకపై మా సంస్థనుండి రెగ్యులర్‌గా నవలలు రిలీజ్ చేయగలం.

ఏజెన్సీ నిబంధనలకు, వివరాలకు:—

డెకాన్స్ పబ్లిషర్స్

14, కోట్స్ రోడ్, టి. నగర్

మద్రాసు-600 017.

"దయచేసి ఇది అడగొద్దు. ఇది నా పెళ్ళి ఉంగరం" అన్నాడు ప్రెసిడెంటు.

నాయకుడి కుడికాలు గాలిలోకి లేచింది. క్షణంలో ప్రెసిడెంటు నేలమీద పడ్డాడు. "లేచి నిలబడు" అంటూ గద్దించాడు నాయకుడు.

ప్రెసిడెంటు లేచి నిలబడ్డాడు. ఇలాంటి అవమానం జీవితంలో ఇదే ప్రథమం ఆయనకు. అందువల్లనే ముఖం కమిలిపోయింది.

"నేను మీ సాయం కోరిన మాట నిజమే: అయితే లేదు, కాదు అనే అవకాశం మాత్రం మీ కెవ్వరికీ లేదు. అది గుర్తుంచుకోండి" అన్నాడు నాయకుడు తీవ్రంగా.

ప్రెసిడెంటు మారు మాట్లాడకుండా మూడో ఉంగరం తీసి ఇచ్చేశాడు.

తర్వాత ఒక వివాహిత వనిత నాయకుడికి తన వంటి మీద వున్న బంగారమంతా ఇచ్చి-మంగళసూత్రం మాత్రం వుంచుకున్నది.

"ఏం-నీ కూడా నా చేత డైలాగులు చెప్పించాలని ఉందా?" నాయకు డామెను తీవ్రంగా అడిగాడు.

"ఉన్నవన్నీ యిచ్చేశానుగా!" అన్నదామె.

"అన్నీ ఎక్కడిచ్చావు? ఇంకా ఆ గొలుసు వుండనే వుంది."

"అయ్యో-అది మంగళసూత్రం-భర్త బ్రతికి వుండగా ఏ హిందూ వనితా దీన్ని మెడలోంచి బైటకు తియ్యదు" అన్నదామె.

"అలాగా" అన్నాడు నాయకుడు గంభీరంగా. ఒక్క క్షణం ఆగి "ఒరేయ్-నువ్వు దీని మొగుణ్ణి చంపేయ్" అన్నాడు తన అనుచరుణ్ణి వుద్దేశించి.

సెప్టెంబరు విడుదల

1. కాంచన గ్రహం (అపరాధ పరిశోధన సీరియల్) — వాణిశ్రీ
2. ప్రేమిస్తే ఏమవుతుంది! — మల్లాది వెంకట కృష్ణమూర్తి
3. స్వప్నలోకం — లల్లాదేవి
4. దృష్టి — N. R. నంది
5. పూలరథం — జి. భవానీ కృష్ణమూర్తి
6. సంకెళ్ళు — యార్లగడ్డ సరోజినీదేవి
7. పంతులమ్మ — మాదిరెడ్డి సులోచన
8. చంద్రోదయం — మన్నెం శారద

నేడే మీకు కావలసిన కాపీలకై మీ
ఏజెంటువద్ద రిజర్వు చేసుకోండి.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్

మ్యూజియం రోడ్ — విజయవాడ - 520 012.

మరో దొంగ పారిపోతూ గౌరి ఇంటి ముందుగా వచ్చాడు. అప్పుడే వెలిగించిన చిచ్చుబుడ్డి ఒకటి గౌరి వాడి తలమీదకు వదిలింది. అది సరిగ్గా వాడి తలపాగాలో ఇరుక్కుంది. చిచ్చుబుడ్డి విజృంభించి వాడి తలమీంచి ముత్యాలు రావడం ప్రారంభమయింది. వాడు పిచ్చివాడిలా అటూ యిటూ పరుగులెత్తసాగాడు.

ఇంత హడావుడిలోనూ దొంగల నాయకుడు తను నాయకు డనిపించుకున్నాడు. జనానికి ఎవరు ఎవరో తెలియని దశలో ఉండగా వాడు కంటికి ఎదురుగా కనబడిన ఓ అమ్మాయిని చటుక్కున పట్టి లాగి క్షణాలమీద ఓ గుర్రం ఎక్కి దాన్ని అదిలించాడు.

వాడి పాలబడ్డ ఆ అమ్మాయి ఆ ఊరి ప్రెసిడెంటు కూతురు పద్మావతీదేవి! ఆమె తన్ను రక్షించమని పెద్దగా కేకలు పెట్టసాగింది.

గుర్రం గౌరి యింటి ముందుకు వస్తూనే వేగం పుంజుకుంది. గౌరి మెదడు చురుగ్గా పనిచేసింది. ఆమె వెంటనే డాబా మీంచి ఆ గుర్రం మీదకు ఉరికింది. ఆమె కాళ్ళు తగిలి దొంగల నాయకుడు, పద్మావతీదేవి ఓ పక్కగా పడిపోయారు. గౌరి ముందు గుర్రం మీదా-ఆ తర్వాత నేలమీదా పడింది.

కొంతమంది గ్రామస్థులు వాళ్ళను చుట్టుముట్టారు.

అందరు దొంగలతోపాటు నాయకుడు కూడా పట్టుబడ్డాడు. పద్మావతీదేవి లేచి బట్టలు దులుపుకుంది.

(ఇంకావుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madr[illegible] 00 001.

Blank Page

Regd.no: H/HD-48